KLVA 102M241

జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 9 విజయవాడ 5-9-2008 పేజీలు : 16 వెల: రు 5.00

లోపలి పేజీలలో.....

- భూస్వామ్య దోపిడీని అంతంచేసే భూపంపిణీ - మావో
- జూలియస్ ఫ్యూజిక్ 65వ వర్ధంతి
- ఔషధ ప్రయోగాలకు బలిపశువులు
- భూమిహక్కు నిరాకరింపబడ్డ దళితులు
- ఆకలి మరణాలలో టీ తోటల కార్మికులు
- గుజ్జర్ల ఆందోళన-ద్రోహపూరిత ఒప్పందం

సామ్రాజ్యవాద కార్పోరేట్ సంస్థల ప్రయోజనాల వృద్ధికోసం, దేశ ప్రయోజనాలను విస్మరించి ప్రజల జీవితాలను బలియిచ్చే కోస్టల్ కారిడార్ రద్దుకై ఉద్యమించండి!!

మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి నెల్లూరుజిల్లా తడ వరకూ గల 1575 చదరపు కి.మీటర్ల దూరం వున్న తీరప్రాంతాన్ని 'కోస్టల్ కారిడార్'గా నిర్మిస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2008వ సంవత్సరం జనవరి 4వ తేదీన ఈ కోస్టల్ కారిఢార్ నిర్మాణ నిర్ణయాన్ని ప్రకటిస్తూ జీ.వో.ఎం.ఎస్.నెం.34ను జారీ చేసింది.

ఈ జీ.ఓ. ప్రకారం ఈ 'కోస్టల్ కారిడార్' అనబడేదాన్ని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరిజిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లోని తీరప్రాంతంలో ఏర్పాటు చేస్తారు.

మొదటిదశలో తూర్పుగోదావరి-విశాఖపట్నంజిల్లాల మధ్య గల 603 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణాన్ని 'పెట్రో కెమికల్ ప్రాంతం'గా తయారు చేస్తారు. ఈ రీజియన్‌ను 1 లక్షా 50 వేల ఎకరాల ప్రాంతంలో నిర్మిస్తారు. ఈ రీజియన్‌లో భారీ ఎత్తున కాలుష్య కారకమైన పరిశ్రమలు నెలకొల్పబడతాయి. రెండవ దశలో మిగిలిన జిల్లాల్లో గల 972 చదరపు కిలోమీటర్లలో 'కోస్టల్ కారిడార్‌ను నిర్మించుతారు.

ఈ 'కోస్టల్ కారిడార్'లో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేయటం కోసం వివిధ విదేశీ, స్వదేశీ కార్పోరేట్ సంస్థలు పోటీపడుతున్నాయి. వాస్తవానికి విశాఖ-కాకినాడ తీరప్రాంతం భౌగోళికంగా అనువుగా వుండటంతో, ఆ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించటం కోసం చాలా కాలం క్రిందటి నుండి పలు విదేశీ కార్పోరేషన్లు కన్నేసి వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం యిప్పుడు వారి కోర్కెలకు తీర్చటానికి వీలుగా ఈ రకమయిన నిర్ణయాన్ని తీసుకొంది.

మొదటిదశ పెట్రో కెమికల్ ప్రాంతంలో నిర్మించే పరిశ్రమల అవసరాలకు వీలుగా వారికి 'మవులిక సదుపాయాల" పేరిట పలుసదుపాయాలు కల్పించటానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా ముందుగా గంగవరం పోర్టు నుండి కాకినాడ వరకూ 138 కిలో మీటర్ల తీరప్రాంతంలో నాల్గురోడ్ల భారీ రహదారిని నిర్మించటం కోసం సన్నద్ధమవుతూ ఈ ప్రాంతంలో బలవంతంగా తీరప్రాంత రైతుల నుండి భూములను సేకరించింది. తాను నిర్మించబోయే రోడ్డు వల్ల విశాఖపట్నం-కాకినాడల మధ్య 30 కిలో మీటర్ల దూరం తగ్గుతుందనీ, ప్రకృతి వైపరీత్యాలూ-తుపానులూ-సునామీలు వచ్చినపుడు తీరప్రాంత ప్రజలను ఆదుకోవటానికి ఈ రోడ్లు ఉపయోగకరంగా వుంటాయనీ ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఈ రోడ్డు నిర్మాణాన్ని సాధ్యం, ఆచరణయోగ్యం చేయటానికి కావల్సిన రిపోర్టును 5 నెలలలోగా తయారుచేసి పెట్టి యిమ్మని ప్రభుత్వం అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పోరేషన్‌తో ఒప్పందం చేసుకొంది. కోస్టల్ కారిడార్ ప్రాజెక్టు పేరిట మొదటి దశలో నిర్మించబోయే పెట్రో కెమికల్ ప్రాంతం వలన తలెత్తబోయే మవులిక సదుపాయాల, సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలపై ఒక నెలరోజుల్లో అధ్యయనం పూర్తి చేయబడుతుందట. ఈ ప్రాజెక్టుకు ఎల్ అండ్ టి రాంబోల్ సంస్థ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తుందట.

603 చ.కి.మీటర్ల ప్రాంతంలో నిర్మించబోయే ఈ పెట్రో కెమికల్ రీజియన్‌లో 209 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పబడతాయట. మిగిలిన ప్రాంతంలో మవులిక సదుపాయాలైన గృహనిర్మాణం, ఆసుపత్రులు, విద్యాసంస్థలు తదితరములు నిర్మించబడతాయట. ఆ ప్రాంతంలో తమ పరిశ్రమలను నెలకొల్పటానికి హెచ్.పి.సి.ఎల్. మిట్టల్ ఎనర్జీ, గెయిల్, ఫ్రాన్సు దేశానికి చెందిన ఆయిల్ డిటోటల్ కంపెనీలు సంయుక్తంగా విశాఖపట్నంలో సంవత్సరానికి 15 మిలియన్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కల రిఫైనరీ ఏర్పాటు చేస్తాయట. కాకినాడలో జి.ఎం.ఆర్. సంస్థ, ఇ.ఎల్. అండ్ ఎఫ్.ఎస్, కాకినాడ సీ పోర్టుల సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ రిఫైనరీ నిర్మించబడుతుందట.

ఇక మిగిలిన తీర ప్రాంతంలో అయితే నిజాంపట్నంలో వాన్‌పిక్ పారిశ్రామిక కారిడార్‌ను నిర్మిస్తారట. గుంటూరు, ప్రకాశంజిల్లాల్లో ఈ ప్రాజెక్టులో నిర్మించబడబోయే విదేశీ, స్వదేశీ కార్పోరేషన్లకు 22 వేల ఎకరాల భూమిని యివ్వటానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ రెండు జిల్లాల్లోనూ రెండు ఓడరేవులతోబాటు, వివిధ రకాల భారీ పరిశ్రమలను నిర్మిస్తారట. ఈ పోర్టుల్లోనే షిప్‌బిల్డింగ్ యూనిట్ ఒక దాన్ని కూడా నిర్మిస్తారట. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మింపబడే షిప్ బిల్డింగ్ యూనిట్‌లో మాట్రిక్స్ ఎన్ పోర్టు, శ్యాంసంగ్ కంపెనీలు భాగస్వామ్యం వహించబోతున్నాయట. వీటితోపాటు ఈ ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలైన టీ.వీ.లు, సెల్‌ఫోన్సు తదితర వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు నెలకొల్పుతారట.

నెల్లూరుజిల్లాలో కృష్ణపట్టణంలోని పోర్టును ఆసియాలోని అతిపెద్ద పోర్టుగా అభివృద్ధిపరుస్తున్నారు. ఈ పోర్టు నుండి డర్టీకార్గో, క్లీన్ అండ్ కంటైనర్ కార్గోలు ఏర్పాటు చేయబడతాయి. పోర్టులో ఎగుమతి, దిగుమతుల సామర్థ్యాన్ని భారీ ఎత్తున పెంచనున్నారు. ఇప్పటికే ఈ పోర్టుకోసం 4 వేల 5 వందల ఎకరాలను ప్రభుత్వం సేకరించిది. ఈ పోర్టు ఆధారంగా చిల్లకూరు మండలంలో సింహపురి థర్మల్ విద్యుత్ కేంద్రం, మీనాక్షి థర్మల్ విద్యుత్ కేంద్రంతోపాటు, నవయుగ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయబడబోతున్నాయి.

మొత్తంగా చూసినపుడు ఈ కోస్టల్ కారిడార్‌లో పెట్రో కెమికల్ పరిశ్రమ, విదేశాల్లో నిషేధింపబడిన రసాయనిక పరిశ్రమలు, ప్రైవేటు విద్యుత్తు కేంద్రాలు, ఎలక్ట్రానిక్, ఫార్మా స్యూటికల్ పరిశ్రమలూ నెలకొల్పబడటంతోపాటు, ప్రధానంగా ఈ ప్రాంతమంతా విదేశాలకు సరుకులను, ముడిఖనిజాలను, ఆహార ధాన్యాలను, విదేశీ పరిశ్రమలు మన దేశంలో కారుచౌకగా చేసిన పారిశ్రామిక ఉత్పత్తులను ఎగుమతి ద్వారా సునాయాసంగా తరలించటానికీ, విదేశాల నుండి పారిశ్రామిక అవసరాలకోసం వినియోగించే రసాయనాలు, బొగ్గు, తదితర పదార్థాలతోపాటు, విదేశీ కంపెనీలు ఉత్పత్తి చేసిన సరుకులు మన దేశంలోకి క్రుమ్మరించటానికీ ఉద్దేశింపబడ్డట్టు తేటతెల్లమవుతోంది.

ఈ రకంగా ప్రభుత్వం తీరప్రాంత అభివృద్ధి పేరిట రేవులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, భారీ పారిశ్రామిక పార్కులు, ఐటి పార్కులు, పెట్రో కెమికల్ కాంప్లెక్సులు, పెట్రోలియం రిఫైనరీలు, సహజవాయు టెర్మినల్స్ ఏర్పాటు చేయించబోతోంది. 666 కిలో మీటర్ల దూరం రహదారులు, 200 కిలో మీటర్ల పొడవున కొత్త రైలుమార్గం, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం; ప్రస్తుతపు 2 విమానాశ్రయాల స్థాయి పెంపు, 14 చిన్న రేవులు, 3 భారీ రేవుల నిర్మాణం, 8 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, 5 ఐ.టి. కేంద్రాలు, 27 థీమ్ పార్కులు, 3 సెజ్‌లు, 16 వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, 2 లాజిస్టిక్ హబ్బులు (రవాణా హబ్బులు), 8 వ్యాపారం అభివృద్ధి కేంద్రాలు, చమురు, సహజవాయువులను వెలికితీయటానికి ఆఫ్‌షోర్ (తీరానికి దూరంగా సముద్రంలో) బ్యాకులు, వీటికోసం 11 టౌన్ షిప్పులు, వీటికి మంచినీటి సరఫరాకోసం 1226 కిలోమీటర్ల దూరం నీటి పైపులూ, మెగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, 4 ఛార్జ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను, ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యంతో (ప్రధానంగా విదేశీ సంస్థల) 20 సంవత్సరాల కాలంలో ఈ కోస్టల్ కారిడార్‌ను నిర్మించటానికి ప్రభుత్వం బ్లూ ప్రింట్‌ను తయారుచేసింది. ఇవన్నీ 20 సంవత్సరాల కాలంలో పూర్తి చేయకల్గితే 12 లక్షల మందికి ఉపాధి కల్గుతుందట.

తొలిదశలో అభివృద్ధి చేయబడబోయే 603.58 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబోయే 'పెట్రో రసాయనాల పెట్టుబడి ప్రాంతం' యొక్క మాస్టర్ ప్లాన్ తయారుచేసి పెట్టి యివ్వటానికి ప్రభుత్వం చైనాకు చెందిన 'నాన్జింగ్ ఇండస్ట్రియల్ పార్కు' అనే సంస్థ సహకారాన్ని తీసుకోవటానికి ఒప్పందం చేసుకొంది.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

ఆగష్టు 20 సమ్మె అనుభవపు వెలుగులో భారత కార్మికోద్యమాన్ని పట్టి పీడిస్తున్న బలహీనతలను అర్థం చేసుకొందాం!

కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ ఫెడరేషన్లు, అసోసియేషన్లతో కూడిన స్పాన్సరింగ్ కమిటీ యిచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపు మేరకు ఆగష్టు 20న దేశవ్యాపితంగా సమ్మె జరిగింది. పిలుపునిచ్చిన సంఘాలేకాక, ఈ సమ్మెకు మద్దతుగా దేశమంతటా గల పలు ప్రగతిశీల శక్తులు, సంస్థలు ఈ సమ్మెను బలపర్చటమేకాక, సమ్మె విజయవంతం కావటానికి కృషి చేశాయి. ప్రగతిశీల ప్రభావం క్రింద గల కార్మిక-ఉద్యోగ వర్గాలు ఈ సమ్మెలో చైతన్యపూరితంగా పాల్గొన్నారు. దేశంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను నిరసిస్తూ ఈ సమ్మెలో పాల్గొన్న కార్మిక, ఉద్యోగ తదితర శ్రామిక జనావళి అభినందనీయులు.

సమ్మెకు సకల ఏర్పాట్లూ పూర్తి చేశామని ప్రకటించిన స్పాన్సరింగ్ కమిటీ నాయకులు ఈ సమ్మెలో కనీసం 10 కోట్ల మంది దాకా ప్రజలు పాల్గొంటారనే అంచనాను సమ్మెకు ముందు రోజున ప్రకటించారు. అయితే బెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాలలో మాత్రమే సమ్మె పూర్తి స్థాయిలో జరుగగా, యితర రాష్ట్రాలలో ఈ సమ్మె పాక్షికంగానే జరిగింది. బ్యాంకింగ్, యిన్సూరెన్సు రంగాల్లో మాత్రమే పూర్తిస్థాయిలో సమ్మె జరిగితే, యితర రంగాలలో సమ్మె పాక్షికంగానే జరిగింది.

రైల్వేలు, రోడ్డు రవాణా, గనులు యితర పరిశ్రమల్లో సమ్మె నామమాత్రంగా జరిగింది. ఈ సమ్మెలో ప్రభుత్వోద్యోగులూ, ఉపాధ్యాయులూలాంటి మధ్యతరగతి ఉద్యోగులు పాల్గొన్నా, పారిశ్రామిక రంగానికి చెందిన, ఉత్పత్తి రంగానికి చెందిన పారిశ్రామిక కార్మికులు ఆశించినంత మేరకు పాల్గొనకపోవటం అన్నది కొట్టొచ్చిన అంశంగా వుంది.

దేశం మొత్తం మీదగా సంఘటిత, అసంఘటిత, అనియత రంగాల్లో 60 కోట్ల పై చిలుకు శ్రామికులుండగా, కనీసం 10 కోట్ల మంది అయినా ఈ సమ్మెలో పాల్గొనని స్థితి మన దేశంలోని కార్మికోద్యమం యొక్క బలహీనతకు అద్దంపడుతోంది.

ప్రస్తుత సమ్మె యొక్క డిమాండ్లలో కేవలం కార్మికుల-ఉద్యోగుల యొక్క ఆర్థిక డిమాండ్లుకాక దేశంలోని సాధారణ ప్రజల డిమాండ్లను ప్రధానంగా పెట్టడం జరిగింది. ధరల అదుపుదల, రైతాంగానికి వడ్డీ వ్యాపారుల నుండి తీసుకొన్న రుణాలు రద్దు, అసంఘటిత, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టంలాంటి డిమాండ్లను పెట్టడం జరిగింది. అయినా అధిక సంఖ్యలో సామాన్య ప్రజానీకాన్నీ, రైతాంగ వర్గాన్నీ ఈ సమ్మెలోకి సమీకరించలేకపోవటం అన్నది ఆలోచించాల్సిన విషయంగా వుంది.

తనతోపాటు యితర శ్రామికవర్గాలనూ, పీడిత ప్రజానీకాన్నీ సంఘటితపరచి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను విజయవంతంగా ఎదురించాల్సిన కార్మికవర్గం, ఈ కర్తవ్య నిర్వహణలో ఎందుకు వైఫల్యం చెందుతోందన్న విషయాన్ని ఆత్మవిమర్శ చేసుకోవాల్సి వుంది. ప్రత్యేకించి పారిశ్రామిక కార్మికవర్గాన్ని పోరాటపథంవైపు మళ్ళించటంలో ఎందుకు వైఫల్యం చెందుతున్నామన్న విషయాన్ని పరిశీలన చేసుకోవాల్సి వుంది.

భారత కార్మికోద్యమ నాయకత్వంలో మెజార్టీ భాగం సంస్కరణవాదం, చట్టబద్ధవాదం, ఆర్థికవాదం, పాలకవర్గాల్లో ఏదో ఒక సెక్షనుతో మైత్రి నెరపే విధానాలను గత 60 సంవత్సరాలుగా అనుసరించటం జరుగుతోంది. కార్మికవర్గాన్ని వర్గ రాజకీయాలతో చైతన్యపరిచి, వర్గ పోరాట స్ఫూర్తిని రగిలించటానికి బదులు ఫక్తు ఆర్థికవాద చైతన్యాన్నే కల్పించటం, పాలక పార్టీల పట్ల భ్రమలు కల్పించటం, ప్రస్తుతం వర్గ పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం లేదంటూ దాట వేయటం లాటి అన్యవర్గ భావజాలంతో ఈ నాయకత్వాలు కార్మికవర్గాన్ని ప్రభావితం చేశాయి. అధికార పార్టీకి అనుబంధ సంఘాల్లో వుంటే సమస్యలు సునాయాసంగా పరిష్కారమవుతాయనే భావం కూడా వ్యాప్తి చేయటం జరిగింది. కార్మికులను క్యాడర్‌వారీగా , పరిశ్రమల వారీగా, ప్రాంతాలవారీగా ఒకరితో మరొకరికి సంబంధంలేనివారిగా విడదీసి అర్థనైజు చేయటం వలన కార్మికుల్లో మొత్తం కార్మికులందరూ ఐక్యంగా వుండాలి అన్న స్ఫూర్తిని అందించటం-దానిని కార్మికులు గ్రహించటం అన్నదానికి విఘాతం కలిగింది. యూనియన్లు గుర్తింపు పొందటానికి ప్రాధాన్యతనిచ్చి, కార్మికుల మధ్య విబేధాలను విపరీత స్థాయికి పెంచి పోషించటం జరిగింది. ఈ సమ్మె సన్నాహకక్రమంలోనూ, నిర్వహణ సందర్భంలోనూ కూడా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలూ, క్షణక్షణానికీ పెరిగిపోతున్న అధిక ధరలూ, ద్రవ్యోల్బణంలాంటి విషయాల గురించి నొక్కి చెప్పకుండా, ఏ శాఖకు చెందిన ఉద్యోగులకు, కార్మికులకు ఆ శాఖ లేదా డిపార్టుమెంటులకు సంబంధించిన సొంత సమస్యలపైననే, ఆర్థిక సమస్యలపైననే నాయకత్వాలు ప్రచార ఊదరగొట్టడం జరిగింది. పాలకవర్గాల, పాలకుల, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానం వలన దారుణ పరిస్థితుల్లోకి త్రోసివేయబడుతున్న సామాన్య ప్రజల, గ్రామీణ ప్రాంతపు రైతాంగపు దుస్థితి గురించీ, ఈ ప్రజలందరి సమస్యలు పరిష్కారం కాకుండా, కార్మిక-ఉద్యోగవర్గాలవారి డిమాండ్లు పరిష్కారం కాని స్థితి గురించీ వివరించి చైతన్యపరిచిన సందర్భాలు చాలా అరుదుగా వున్నాయి.

(తరువాయి 11వ పేజీలో)

కామ్రేడ్ కే.రామచంద్రన్‌కు జోహార్లు!

సి.పి.ఐ. (ఎం.ఎల్) ప్రజాప్రతిఘటన కేంద్ర కమిటీ నాయకులు కా॥ కే.రామచంద్రన్ తీవ్ర అనారోగ్యంతో 31.8.2008న ముంబాయిలో మృతి చెందారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. ఆయన అవివాహితుడు. కేరళలోని తిరువనంతపురంజిల్లాలో తమిళనాడు సరిహద్దు వద్ద గల గ్రామంలో జన్మించిన ఆయన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగంకోసం బొంబాయికి వచ్చి రైల్వేలో కళాసీల సూపర్‌వైజరుగా చేరారు. కార్మికసంఘాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్న కా॥ రామచంద్రన్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1964లో రైల్వేలో ఉద్యోగాన్ని వదలుకుని పూర్తికాలం కార్యకర్తగా పని చేశారు. నక్సల్బరీ రైతాంగ పోరాటం తర్వాత ఏర్పడిన కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ, మహారాష్ట్రలో చేరారు. కొద్దికాలంలోనే అఖిల భారత సమన్వయ కమిటీ అతివాద, అవకాశవాద రాజకీయాలతో మిగిలిన మహారాష్ట్ర కామ్రేడ్స్‌తో కలిసి విడగొట్టుకున్నారు. 1974-75లలో రూపొందిన చంద్ర పుల్లారెడ్డి, సత్యన్నారాయణసింగ్‌ల నాయకత్వంలోని సి.పి.ఐ. (ఎం.ఎల్)లో చేరారు. ఐఎఫ్‌టియు నిర్మాణంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. కా॥ సి.పి. మరణం తర్వాత సి.పి.ఐ. (ఎం.ఎల్) కేంద్ర కమిటీ కార్యదర్శి అయ్యారు. ప్రతిఘటనా పోరాట భావనను ప్రజా ప్రతిఘటన పోరాటంగా సాగించాలనీ, దాని కొరకు విప్లవకారులందరూ ఐక్యం కావాలనీ కోరుకున్నారు. 1991లో ఏడు విప్లవ సంస్థలూ కలిసి సి.పి.ఐ. (ఎం.ఎల్) జనశక్తిగా ఏర్పడేందుకు జరిగిన సన్నాహక ఐక్యతా కృషిలో ముఖ్యపాత్ర నిర్వహించారు. నాడు ఏర్పడిన సి.పి.ఐ. (ఎం.ఎల్) జనశక్తి కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఆనాటి కేంద్రకమిటీ పత్రికగా ఇంగ్లీషులో వచ్చిన 'జనశక్తి'కి ముఖ్య సంపాదకుడిగా ఆయన, సంపాదకుడిగా నేను కలిసి పనిచేశాము. 'జనశక్తి' రెగ్యులర్‌గా తీసుకురావాలని పూర్తి సహకారాన్నందించేవారు. నిరాడంబర జీవనం గడిపేవారు. కామ్రేడ్ కే.రామచంద్రన్‌కు విప్లవజోహార్లు తెలుపుతున్నాను. వారి చెల్లెలికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాను.

1-9-2008,
విజయవాడ.

పి.జస్వంతరావు
సి.పి.ఐ. (ఎం.ఎల్)

ప్రజా కళాకారులకు ఆదర్శమూర్తి తాపీ రాజమ్మ

భూస్వామ్య సంస్కృతి బంధనాలు తెగద్రెంచుకొని, క్రియాశీలంగా ప్రజాసాంస్కృతిక రంగంలో కృషి చేసిన తాపీ రాజమ్మగారిది కర్నూలుజిల్లా. అతిచిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ ఒడిలో ఆమె చేరారు. ఉద్యమక్రమంలోనే తాపీ ధర్మారావుగారి అబ్బాయి తాపీ మోహనరావును కులాంతర వివాహం చేసుకున్నారు.

1943 నుండి 1947 వరకు మహిళా సంఘంలో ఆమె చురుకుగా పనిచేశారు. ప్రజాకళాకారిణిగా తుమ్మల 'ఎర్రజెండా' గీతాన్ని, గురజాడ 'దేశభక్తి' గీతాన్ని, పూర్ణమ్మ 'కన్యక'ల కథలను పాటలుగా పాడి ప్రేక్షకులనుత్తేజపరిచడమేగాక, రాష్ట్రవ్యాప్తంగా సుంకర రాసిన 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథను చెప్పిన దళంలో ప్రముఖపాత్ర వహించారు. కమ్యూనిస్టు పార్టీతోపాటు, పార్టీ ఇతర పత్రికలతోపాటు మహిళా సంఘం నడిపే 'ఆంధ్ర వనిత' పత్రిక కూడా నిషేధానికి గురికాగా, ఆ నిషేధాన్ని ప్రతిఘటిస్తూ ప్రదర్శనల్లో పాల్గొని పాటలు పాడుతూ జైలుకెళ్ళారు. మూడు నెలల పాపతోపాటు ఆమె జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత మద్రాసులో అత్తవారింటికెళ్ళి, 'జనవాణి' పత్రికలో ప్రజానుకూలమైన వార్తలు ప్రచురించడంలో భర్తకు, మామగారికి సహకరించారు. అజ్ఞతంలో వున్న నాయకుల రహస్య జీవితానికి తోడ్పాటునందించారు.

1951లో పార్టీపైన నిషేధం తొలగించిన తర్వాత విజయవాడలో జరిపిన బహిరంగ సభలో తన 20 సవర్ల బంగారు నగలను పార్టీకి విరాళంగా ఇచ్చారు. 1952 ఎన్నికల్లో ప్రచార కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘంలో పనిచేస్తూ పాటలు, కవితలు, వ్యాసాలు రాశారు. 1964లో పార్టీ చీలికను చివరి నిముషం వరకు ఆమె జీర్ణించుకోలేకపోయారు. మార్క్సిజంపట్ల నిబద్ధతతో జీవించిన తాపీ రాజమ్మను ఆదర్శంగా తీసుకొని, నేటి మహిళలందరూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణను పితృస్వామ్య సంస్కృతిని ప్రతిఘటించడమే వారికి సరైన నివాళిగా వుంటుంది.

'జనశక్తి' తాపీ రాజమ్మగారి మరణానికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది.

(1వ పేజీ తరువాయి)

ఈ 'కోస్టల్ కారిడార్' ఎవరి అభివృద్ధి కోసం?

కేంద్ర, రాష్ట్ర మంత్రుల నుండి స్థానిక కాంగ్రేసు పార్టీ నాయకుల వరకూ ఈ కోస్టల్ కారిడార్ ఏర్పాటు అనేది రాష్ట్రాభివృద్ధి కోసమన్నట్లు ప్రచారాన్ని ఊదర గొట్టేస్తున్నారు. ఈ 'అభివృద్ధి'ని వ్యతిరేకించేవారు ప్రజావ్యతిరేకులూ, దేశద్రోహులన్నట్లుగా ప్రచారాన్ని లంకించుకొన్నారు.

దేశ ప్రయోజనాలను, దేశ ప్రజల ప్రయోజనాలను రక్షించటంకోసం, దేశ సంపదను పరిరక్షించటంకోసం, దేశ ప్రజల ఉమ్మడి ఆస్తులయిన సహజవనరులను, సంపదలనూ సంరక్షించాల్సిన, నిర్వహించాల్సిన ధర్మకర్తల గానూ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవటం జరిగింది.

కానీ మన దేశంలోని పాలకులూ, ప్రభుత్వాలూ (ఏ పార్టీకి చెందిన వారైనా) దేశమూ, దేశ సంపదలూ, వనరులూ తమ స్వంత ఆస్తులయినట్లూ, దేశ ప్రజలు తమ మోచేతి క్రింద నీళ్ళు తాగే అధీనులన్నట్లు పరిగణిస్తూ, ఆ రకంగా వ్యవహరిస్తున్నారు. వీరికి దేశ ప్రయోజనాలుకానీ, దేశ ప్రజల ప్రయోజనాలుకానీ పట్టలేదు. కేవలం తమ అధికారం, సొంత ఆస్తుల పెంపకం అన్నవే వీరి ధ్యేయంగా వున్నాయి. ఈ ధ్యేయాలను నెరవేర్చటంకోసం వారు నిర్లజ్జగా సామ్రాజ్య వాదానికీ, సామ్రాజ్యవాద పెట్టుబడికీ దళారులుగా వ్యవహరించటానికే నిర్ణయించుకొన్నారు. సామ్రాజ్యవాదం యొక్క, సామ్రాజ్యవాద బడా కార్పోరేట్ సంస్థల యొక్క ప్రయోజనాలను పెంపొందించటం ద్వారా, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఊడిగం చేయటం ద్వారా తమ రాజ్యాధికారాన్నీ, స్వంత ఆస్తులను పెంపొందించుకోవటం కోసమే ఈ 61 సంవత్సరాలుగా కృషి సలుపుతున్నారు. వీరిలో దేశభక్తి అణుమాత్రం కానీ, 'స్వతంత్ర'తను నామమాత్రంగా కానీ చూడలేము. వీరి ప్రతాప పటాటోపాలన్నీ దేశ ప్రజలను దుర్భర దారిద్ర్యంలోనూ, నిరుద్యోగంలోనూ, అనారోగ్యంలోనూ అణచిపెట్టి వుంచటంలో మాత్రమే కన్పిస్తాయి.

ప్రజాస్వామ్యం, స్వతంత్రం, శాంతి, సోషలిజం లాంటి నినాదాలతో నాలుగున్నర దశాబ్దాలపాటు కొంగ జపం చేస్తూ వాటి మాటున పాలకులు, పాలకవర్గాలు, ప్రభుత్వం దేశ ప్రజలను భ్రమలపాలుచేస్తూ, వంచిస్తూ దేశాన్ని విదేశీయులకు క్రమంగా అన్ని రకాలుగానూ తాకట్టు పెట్టారు.

గత దశాబ్దిన్నర కాలంగా సూటిగానే సామ్రాజ్య వాదానికి ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాసోహంచేస్తూ, 'అభివృద్ధి' పేరిట దేశాన్ని సామ్రాజ్య వాదులకు అమ్మకంపెట్టే ప్రక్రియను ప్రారంభించారు. సామ్రాజ్యవాదాన్ని ఆదేశిస్తున్న, బడా కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను పెంపొందించే, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాలను అమలు జరుపుతూ, దేశాన్ని అమ్మివేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ 'అమ్మకపు' ప్రక్రియలోని ఒక భాగమే ఈ 'కోస్టల్ కారిడార్' అనబడే దాని యొక్క నిర్మాణం.

ఇప్పటికే ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరిట దేశంలో 'స్వతంత్ర ప్రాంతాలు' అనబడే కార్పోరేట్ జమీందారీలను సృష్టించిన పాలకులు, ప్రభుత్వాలూ, యిప్పుడు తీర ప్రాంతాన్ని కూడా అభివృద్ధి పేరిట సామ్రాజ్యవాద కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేయబూనుకొన్నారు. దీన్నే 'అభివృద్ధి' అంటూ దేశ ప్రజలను, దేశ ప్రయోజనాలనూ అపహాస్యం చేస్తున్నారు.

ఈ తీరప్రాంత కోస్టల్ కారిడార్ నిర్మాణం వలన సంభవించబోయే నష్టం అంతంత మాత్రంగా వుండదు. అనేక రూపాల్లో, పలు నష్టాలను కలుగచేస్తుంది.

విలువైన దేశ వనరులను సునాయాసంగా తరలించుకుపోయే ముఖద్వారంగా 'కోస్టల్ కారిడార్':

ఎగుమతుల ద్వారా, ఎగుమతి కోసం చేసే ఉత్పత్తి ద్వారా ఆర్థికాభివృద్ధిని, పారిశ్రామికాభివృద్ధిని సాధించటం అనే ఏకైక లక్ష్యంతో మనదేశపు ఆర్థిక వ్యవస్థను (సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల ఆదేశంతో) కుదించటం జరిగింది. తదనుగుణంగానే పరిశ్రమ లనేవి స్థాపించబడుతున్నాయి. అటువంటి లక్ష్యం గల పరిశ్రమల్లోనే విదేశీ పెట్టుబడి ప్రవహిస్తోంది. ఆ విదేశీ పెట్టుబడికి దళారీలుగా భారత బడా పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గం వ్యవహరిస్తూ, తదనుగుణమైన పరిశ్రమల్లోనే భాగస్వామ్యం వహిస్తోంది.

మన దేశంలో, ప్రత్యేకించి ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అత్యంత విలువైన ఖనిజ సంపద వుంది. ఈ ఖనిజ సంపదపై కన్నుపడిన విదేశీ సామ్రాజ్యవాద కార్పోరేషన్లు ఆ సంపదను కొల్లగొట్టుకోవటం కోసం మనదేశంలో పెట్టుబడులను, పరిశ్రమలను పెడ్తున్నారు. ముడిఖనిజాన్ని మన దేశంలోనే కారుచౌకగా శుద్ధి చేసుకొని తరలించుకుపోవటం కోసమే తమ పరిశ్రమలను ఈ రాష్ట్రాలలో స్థాపించటం జరుగుతోంది.

ఒరిస్సా నుండి విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుండి బాక్సయిట్ త్రవ్వుకొని, శుద్ధి చేసుకొని అల్యూమినాను తరలించుకుపోవటం కోసం, ప్రపంచంలో అత్యంత విలువైన చమురు ఉత్పత్తులను కారుచౌకగా మన తీర ప్రాంతంలోనే శుద్ధిచేసుకొని తరలించుకుపోవటంకోసం, కె.జి. బేసిన్‌లో లభ్య మవుతున్న సహజవాయువు నిక్షేపాలను అమ్ముకో వటానికి తరలించుకపోవటం కోసం, వైజాగ్‌లోనూ, గంగవరంలోనూ, కాకినాడలోనూ పోర్టులను అభివృద్ధి పరచటం జరుగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, కంటైనర్ల ద్వారా, కంటైనర్లను మోసుకు పోయే బడా నౌకల ద్వారా తక్కువ ఖర్చుతో, అతిశీఘ్రంగా తరలించుకుపోవటం కోసమే డీప్ పోర్టులు (లోతైన రేవులు) అనే వాటిని అభివృద్ధి చేయటం జరుగుతోంది. వీటికోసమే ఈ రేవులు, రోడ్లు, విమానాశ్రయాలు అభివృద్ధి చేయటం జరుగుతోంది. ఈ పారిశ్రామిక కార్యకలాపాల నిర్వహణ అవసరం కోసమే థర్మల్ విద్యుత్ కేంద్రాలనూ, ప్రైవేటు పోర్టులనూ, షిప్ బిల్డింగ్ యూనిట్లనూ, టౌన్ షిప్‌లనూ, ఆ విదేశీ, స్వదేశీ కంపెనీలు నిర్మించుకొంటున్నాయి. ఇవిగాక యిటీవలికాలంలో దేశం నుండి అపారమైన విలువ గల ఇనుప ముడిఖనిజాన్ని తరలించు కోవటం జరుగుతోంది. విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం రేవుల నుండి ఈ ఖనిజం ముమ్మరంగా ఎగుమతి చేయబడి కొల్లగొట్టుకుపోబడుతూ వుంది. వీటితో బంగ్లాదేశ్, ఆఫ్రికా తదితర దేశాలకు బియ్యం, సిమెంట్ క్లింకర్లు, అదే రకంగా కాకినాడ నుండి టాయ్‌కో, చందననగర్, జంబోమైనింగ్, ట్రైమాక్స్ పరిశ్రమల కొరకు భారీ ఎత్తున సరుకులు ఎగుమతి జరుగుతోంది. ఒరిస్సాలో విదేశీ కంపెనీలు నిర్మించిన లోహాన్ని కరిగించే కర్మాగారాల నుండి తయారైన అల్యూమినాను ఎగుమతి చేసుకోవటంకోసం ఈ కోస్టల్ కారిడార్ ఉద్దేశింపబడింది.

విదేశీ పరిశ్రమల వాణిజ్యావసరాలకోసం దిగుమతులు జరిగే కోస్టల్ కారిడార్:

పాలకులు ఎంతో ఘనంగా ప్రకటిస్తున్న తొలిదశ 'పెట్రో కెమికల్ ప్రాంతం'లో నిర్మించబడే పరిశ్రమలు, రిఫైనరీలు భారతదేశ అవసరాలకు ఎంత మాత్రం కాదు. విదేశాల నుండి ఐ.ఒ.సి.ఎల్., హెచ్.పి.సి.ఎల్., బి.పి.సి.ఎల్., రిలయన్సు తదితర సంస్థల్లు, ముడి చమురుని దిగుమతి చేసుకొని, శుద్ధి చేసుకొని తిరిగి విదేశాల్లో అమ్ముకోవటానికి సదుపాయం కోసం, బిపిసిఎల్, హెచ్‌ఎఫ్, ఎస్.డి., ఎల్.డి.ఒ.లాంటి సంస్థల అవసరాలకు ఫర్నేసు ఆయిలు దిగుమతి కోసం, గోదావరి ఫర్టిలైజర్సు రిలయన్సు, హెచ్.పి.సి.ఎల్ కంపెనీలకు పాస్ఫారిక్ ఏసిడ్, సల్ఫర్ ఏసిడ్, అమ్మోనియా, నాఫ్తా లాంటి ముడిసరుకులు దిగుమతికోసం, ఈ ప్రాంతం అభివృద్ధి చేయబడుతోంది. అదే విధంగా మన దేశానికి విదేశీ కార్పోరేషన్లు అమ్ముకొనే ఖాద్యతైలాలు, జన్యు మార్పిడి ఆహారాలు, గోధుమ తదితర ధాన్యాలను దిగుమతి చేయటంకోసం ఈ కారిడార్ అభివృద్ధి చేయబడుతోంది. విదేశీ కంపెనీల విద్యుత్ ఉత్పాదన అవసరాలకోసం విదేశాల నుండి బొగ్గు దిగుమతి చేసుకోవటానికి ఈ కారిడార్‌లోని రేవులు అభివృద్ధి చేయబడుతున్నాయి.

విషం నింపే రసాయన పరిశ్రమలు:

తీరప్రాంతాన్నంతా రసాయనిక పరిశ్రమలతో నింపే కుట్ర యిది. సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి కారుచౌకకు భూమి, నీరు, కరెంటు యిచ్చి బానిసలుగా కార్మికులనిస్తామంటూ యిక్కడ రసాయనిక పరిశ్రమలు పెట్టమని అడిగే విధానమిది. ఈ పరిశ్రమలు కలిగించే నష్టాలు ఊహించనలవికానివి. భోపాలు గ్యాసు లీకుకు గురైన బాధితుల పిల్లలు కూడా విష ప్రభావాలకు లోనవుతున్నారు. జపానులోనే ఒక పరిశ్రమ వదిలిన వ్యర్థంలో వున్న పాదరసం సముద్ర చేపలలోకి చేరి అవి తిన్నవారు అనారోగ్యం పాలయ్యారని నిరూపించినా, ఆ కంపెనీ మెడలు వంచలేకపోయింది ఆ ప్రభుత్వం. భోపాలు బాధితులకు న్యాయం చెయ్యాల్సింది పోయి యూనియను కార్బయిడ్ అధినేతను సకల మర్యాదలతో గౌరవించిన భారత పాలకులు కోస్తా కారిడార్‌లో రాబోయే పరిశ్రమలు కాలుష్య నియంత్రణా పద్ధతులనూ, భద్రతాచర్యలనూ అమలుజరిపే విధంగా చెయ్యగలుగుతాయని ఊహించ లేము. దేశ సహజవనరులు, ఆర్థిక వనరులు, శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టి, ప్రమాదాలు, కాలుష్యమూ మనకు వదలటమేకాక, చుట్టుప్రక్కల కొన్ని పదుల చదరపు మైళ్ల భూమి అనేక తరాల వరకూ ఉపయోగపడకుండా విషతుల్యం చేసే పరిశ్రమలివి. ఇవి దేశ ప్రజలకవసరం లేదు. (ప్లాస్టిక్ సంచులక్కరలేదు; జూటు సంచులు వాడుకోగలం) సామ్రాజ్యవాదుల లాభాల కొరకు ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలివి.

ఈ మొత్తం కార్యకలాపాలలో ఈ ప్రాంత ప్రజల అవసరాలనుకానీ, ప్రయోజనాలను కానీ పెంపొందించే అవకాశం అణుమాత్రం కూడా లేదు. అందువలన ఈ అభివృద్ధి అటు మనదేశ ప్రయోజనాలకోసం కానీ, యిటు ప్రజల అవసరాలకోసం కానీ జరుగుతున్నది కాదు. పైపెచ్చు ఈ కోస్టల్ కారిడార్ నిర్మాణం వలన జరుగబోయే నష్టాలు మాత్రం అనంతంగా వుంటాయి.

విధ్వంసం కాబోతున్న మత్స్యకారుల జీవితాలు:

ఈ 'కోస్టల్ కారిడార్' నిర్మించతలపెట్టిన 972 కి.మీ. సముద్ర తీర ప్రాంతమంతటా, సుమారు 6 లక్షల మంది మత్స్యకారులు చేపలుపట్టే, తమ సాంప్రదాయ మత్స్యకార వృత్తిలో జీవనోపాధిని నెరపుకొంటున్నారు. ఇప్పటికే వీరు జీవన ప్రమాణాల రీత్యా అట్టడుగుస్థాయి వర్గపు ప్రజలుగా జీవిస్తున్నారు. మొదట మరపడవలొచ్చాయి. కొందరికి ఆదాయం పెంచాయిలే అనుకుంటుండగానే ట్రాలర్లు వచ్చాయి; మత్స్య సంపదను ఎగరేసుకుపోయాయి; ఇప్పుడు విదేశీ కంపెనీల షిప్పులు దిగాయి; సముద్ర గర్భంలో పిల్లచేప కూడా మిగలకుండా దేవుకు పోతున్నాయి. తర్వాత రొయ్యలొచ్చాయి. తీరభూములు పెద్దకంపెనీల చేతుల్లోకి వెళ్లాయి. మత్స్యకార గ్రామాలకు మంచినీళ్లకు కూడా గతి లేకుండా చేసాయి. వరి భూములను చెరువులను చేశాయి. అరచేతిలో వైకుంతం చూపి ఎత్తి కుదేశాయి. రొయ్యవేసి నష్టపోలేక, చెరువును మాగాణి చెయ్యలేక రైతాంగాన్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. ఇప్పుడు కారిడారు వచ్చింది. పాలకులు అభివృద్ధిగా కీర్తించిన ప్రతిచర్యా ప్రజాజీవనాన్ని ఛిన్నాభిన్నం చేసింది; ప్రత్యామ్నాయమూ చూపించలేదు. ఇప్పుడు 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు' వీరిపై ఈ 'కోస్టల్ కారిడార్ అభివృద్ధి' భూతం పడింది. తీరప్రాంతమంతటా వెలిసే పరిశ్రమల కోసం వీరు ఈ ప్రాంతం నుండి నిర్దాక్షిణ్యంగా వెళ్ళగొట్టబడతారు. పర్యవసానంగా వీరు జీవనోపాధిని కోల్పోతారు. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధిని ప్రభుత్వం చూపించటమనేది కల్ల. వీరు ఈ సాంప్రదాయక వృత్తిని తప్ప మరో వృత్తి ఏదైనా నెరుపుకోవటానికి అవసర మయిన విద్య, వృత్తి శిక్షణా, నేర్పులు కలిగినవారుకాదు. ఇప్పటికే గంగవరం పోర్టు నిర్మాణ సందర్భంగానూ, శ్రీకాకుళంజిల్లా ఎచ్చర్లలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు కోసం జరిపిన భూసేకరణ సందర్భంగానూ వారికి పునరావాసం కల్పించని పాలకులూ, ప్రభుత్వమూ, తీరప్రాంత మంతటా జీవనోపాధి నుండి బలవంతంగా గెంటివేయబడే వారందరినీ పట్టించుకుని, ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తుందన్నది అబద్ధమే. ఇప్పటికే తీరప్రాంతంలో కోస్టల్ జోన్ మేనేజిమెంటు విధానం ద్వారా పరిశ్రమలు నిర్మించటానికి వీలుగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ 1992 నిబంధనలను సడలించి, మత్స్యకారుల పీకమీద కత్తి పెట్టిన ప్రభుత్వం, యిప్పుడు ఈ 'కోస్టల్ కారిడార్' ఏర్పాటుతో సంహారణకు పాల్పడుతోంది. కనీసం వీరికి పట్టబోయే దుస్థితిపట్ల ప్రభుత్వం నుండి నామమాత్రమయిన మానవీయ స్పందన కూడా లభిస్తుందని ఆశించటం మూర్ఖత్వమే అవుతుంది.

మత్స్యసంపదకు నష్టం:

ప్రభుత్వం లెఖ్ఖల ప్రకారం ప్రతీ సంవత్సరం 7 కోట్ల రూపాయల విలువచేసే మత్స్యసంపద లభ్యమవు తోంది. ఇపుడు ఈ సముద్రతీరప్రాంతమంతటా పరిశ్రమలూ, రసాయనాల పరిశ్రమలూ వస్తే, అవి సముద్రంలోకి విడుదల చేసే వ్యర్థ పదార్థాల విషకాలుష్యం వలన తీరప్రాంత మత్స్య సంపద అంతా చచ్చిపోయి, ఆ మేరకు నష్టం సంభవిస్తుంది. ఇందుకు ఉదాహరణగా సింహాద్రి ఎన్.టి.పి.సి. కర్మాగారం నుండి

(తరువాయి 11వ పేజీలో)

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

భూస్వామ్య దోపిడీ విధానాన్ని అంతంచేయటమే భూ సంస్కరణల లక్ష్యం

మావో

షాన్సి-సుయ్యువాన్ విముక్త ప్రాంత కార్యకర్తలనుద్దేశించి 1948 ఏప్రిల్ 1న కామ్రేడ్ మావో చేసిన ఉపన్యాసమిది. ఈ ప్రాంతంలో భూసంస్కరణలను అమలుచేయటంలో మొదట మితవాదం, తరువాత అతివాదాలకు చెందిన ధోరణులు తలెత్తిన తీరునూ, వాటి మూలాలను చర్చించిన వ్యాసమిది. సరైన సమయంలో ఈ తప్పుడు ధోరణులను సరిదిద్దినందువలన పార్టీ నిర్మాణం పటిష్టమవటమే కాకుండా, జపాను వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధ పరోగమనానికి ఎలా తోడ్పడిందో వివరించారు. భూస్వామ్య వ్యతిరేక పోరాట క్రమంలో ప్రజాకమిటీల ఏర్పాటు-వాటి ఆధ్వర్యంలో భూసంస్కరణల అమలు భవిష్యత్ ప్రజాధికార సంస్థలకు అంకురార్పణగా వుండే విధానాన్ని వివరించారు. పాఠకుల అధ్యయనం కొరకు ప్రచురిస్తున్నాము.

- సంపాదకుడు

కామ్రేడ్స్! నేను, ఇవాళ ప్రధానంగా షాన్సి-సుయ్యువాన్ విముక్త ప్రాంతంలోని మన కార్యకలాపాలకు సంబంధించిన కొన్ని సమస్యలను గురించి, అలాగే, దేశం మొత్తం మీద, మన కార్యకలాపాలకు సంబంధించిన కొన్ని సమస్యలను గురించి మాట్లాడాలనుకుంటున్నాను.

-1-

చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన షాన్సి-సుయ్యువాన్ ఉపబ్యూరో నాయకత్వం క్రింద వున్న ప్రాంతంలో, గత సంవత్సరంలో సాగిన భూసంస్కరణల కార్యక్రమం, పార్టీని పటిష్టంచేసే కార్యక్రమాలు విజయవంతమయ్యాయని నేను అభిప్రాయ పడుతున్నాను.

దీన్ని రెండు కోణాల నుండి చూడవచ్చు. ఒకవైపు, షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ మితవాద పెద ధోరణులతో తలపడి, ప్రజా పోరాటాలను ప్రారంభించి, ఆ ప్రాంతపు మొత్తం 30 లక్షల పై చిలుకు జనాభాలో, 20 లక్షలకు పైబడ్డ ప్రజానీకంలో భూసంస్కరణలనూ, పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాలను పూర్తిచేసింది లేదా పూర్తిచేస్తున్నది. మరోవైపు, ఈ కాంపెయిన్‌లలో తలెత్తిన అనేక "అతివాద" పెదధోరణులను కూడా అది సరిదిద్ది తద్వారా తన పనినంతటినీ సరయిన అభివృద్ధి పథం మీద నిలిపింది. ఈ రెండు కోణాల నుండీ నేను, షాన్సి-సుయ్యువాన్ విముక్త ప్రాంతాలలోని భూసంస్కరణ, మరియు పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాలు విజయవంతమయినట్లుగా పరిగణిస్తున్నాను.

"ఇక నుండి ఎవడూ గూడా భూస్వామ్య దొరతనం చలాయించడానికిగానీ, ఇతరులపై దాదాగిరి చెలాయించడానికిగాని, అవినీతికి పాల్పడడానికిగాని సాహసించడు" అని షాన్సి-సుయ్యువాన్ విముక్త ప్రాంత ప్రజలు అంటున్నారు. మన భూసంస్కరణల కార్యక్రమం, పార్టీని పటిష్టంచేసే కార్యక్రమాలను గురించి వాళ్ళు ఆ నిర్ధారణకు వచ్చారు. "ఎవ్వడూ గూడా ఇంకెన్నడూ భూస్వామ్య దొరతనం చలాయించడానికి సాహసించడు" అని అనడంలో వాళ్ళ భావం ఏమిటంటే, కొత్త విముక్త ప్రాంతాలలోని భూస్వామ్య దోపిడీ విధానాన్ని, పాత, అర్థ-పాత విముక్త ప్రాంతాలలోని ఆ విధానపు అవశేషాన్ని, నాశనంచేసిన, లేక చేస్తున్న పోరాటాలను ప్రారంభించడంలో మనం వాళ్ళకు నాయకత్వాన్ని చ్చామని. "ఎవ్వడూ గూడా ఇంకెన్నడూ ఇతరులపై దాదాగిరి చెలాయించడానికిగానీ, అవినీతికి పాల్పడడానికి గాని సాహసించడు" అనడంలో, మన పార్టీ మరియు ప్రభుత్వ సంస్థల పని పద్ధతుల్లోనూ, వర్గ పొంతనలోనూ గతంలో కొంత మేరకు చోటు చేసుకున్న కాలుష్యం అన్న తీవ్రమైన విషయాన్ని వాళ్ళు ప్రస్తావిస్తున్నారు. మన పార్టీ, మరియూ ప్రభుత్వ సంస్థలలోకి అనేక మంది దుష్టశక్తులు చొరబడ్డారు, అనేక మంది పెత్తందారీ పని పద్ధతులను అలవర్చుకొని, తమ అధికారాన్ని దుర్వినియోగపరచి, ప్రజలపై దాదాగిరి చెలాయించి, బలవంతంగా పనులు జరిపించే పద్ధతులు, ఆజ్ఞాపించే పద్ధతులు ప్రయోగించి, తద్వారా అసంతృప్తిని రేపారు, లేదా అవినీతికి పాల్పడ్డారు, లేదా ప్రజల ప్రయోజనాలను అతిక్రమించారు. అయితే, భూసంస్కరణలు, పార్టీని పటిష్టంచేసే కార్యక్రమాలపై ఒక సంవత్సరం కృషి చేసిన పిమ్మట, ఈ పరిస్థితులు మౌలికంగానే మార్చబడ్డాయి.

"మాకు ప్రాణాంతకం కాగల వాటిని వొదిలించుకున్నాము. అంతకుముందెన్నడు మాకులేని వాటిని ఇపుడు సంపాదించుకున్నాము" అని ఇక్కడున్న కామ్రేడ్లలో ఒకరు నాతో అన్నారు. మరియు ప్రభుత్వ సంస్థల్లో వర్గ పొంతనలోనూ, పని విధానంలోనూ కాలుష్యం ఉండడం అన్న తీవ్రమైన విషయాన్ని, తత్ఫలితంగా ప్రజలలో చెలరేగిన అసంతృప్తిని గురించే అతడు "ప్రాణాంతకం" [illegible]న్నది. ఈ అంశం ఇపుడు మౌలికంగానే తొలగించి వేయబడింది. "అంతకు ముందెన్నడూ మాకు లేనివి, ఇపుడు సాధించుకున్నవి" అని అతడన్నది, పేద రైతు సంఘాలు, కొత్త రైతు సంఘాలు, జిల్లా మరియు గ్రామీణ స్థాయిల్లోని ప్రజా ప్రతినిధుల సమావేశాలు, భూసంస్కరణల కార్యక్రమం, పార్టీని పటిష్టంచేసే కార్యక్రమాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న కొత్త వాతావరణాల గురించి.

ఈ వ్యాఖ్యానాలు, ఇప్పటి పరిస్థితుల గురించిన వాస్తవిక చిత్రాన్ని తెలియజేస్తాయనుకుంటున్నాను.

షాన్సి-సుయ్యువాన్ విముక్త ప్రాంతంలో భూసంస్కరణల పనీ, పార్టీని పటిష్టం చేసే కార్యక్రమం సాధించిన గొప్ప విజయం యొక్క మొదటి అంశం. ఈ ప్రాతిపదికమీదనే, గడచిన సంవత్సరంలో షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ మహత్తర ప్రజావిముక్తి యుద్ధానికి మద్దతుగా పెద్ద ఎత్తున యుద్ధ సహాయక సేవలు అందించగలిగింది. భూసంస్కరణ, పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాలలో విజయవంతంగా పనిచేయకపోయి వుండి వుంటే, ఇటువంటి మహత్తర సైనిక కర్తవ్యాలను నెరవేర్చడం కష్టమయ్యి వుండేది.

వేరొక పక్క షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ, తన పనిలో తలెత్తిన ఎన్నో "అతివాద" పెదధోరణులను సరిదిద్దుకొంది. అటువంటి పెదధోరణులలో ప్రధానమైనవి మూడు వున్నాయి. మొదటిది, చాలా ప్రాంతాలలో, వర్గస్థాయిని గుర్తించే క్రమంలో శ్రామిక జనంలోని చాలా మంది, వారు భూస్వామ్య దోపిడీకి పాల్పడినప్పటికీ, లేదా కొద్దిపాటి దోపిడీకి మాత్రమే పాల్పడినప్పటికీ కూడా, వారు భూస్వాములుగానో, ధనిక రైతులగానో వర్గీకరించబడ్డారు; ఈ విధంగా దాడి యొక్క పరిధిని, పొరబాటుగా విస్తృతం చేశారు. పైగా, భూసంస్కరణలలో మనం మొత్తం కుటుంబాలలో 92 శాతాన్ని, అంటే గ్రామీణ జనాభాలో 90 శాతాన్ని ఐక్యం చేయాలి, చెయ్యగలం, మరో విధంగా చెప్పాలంటే భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐక్యసంఘటన ఏర్పాటు చేయడానికి గ్రామీణ శ్రామిక జనాన్నందరినీ మనం ఐక్యం చేయాలి అన్న అతిముఖ్య వ్యూహాత్మక సూత్రం విస్మరించబడింది. ఈ పెద ధోరణి ఇపుడు సరిదిద్దబడింది. తత్ పర్యవసానంగా, ప్రజలకు నమ్మకమైన భరోసా ఏర్పడి, విప్లవ ఐక్య సంఘటన పటిష్టపరచబడ్డది. **రెండవది:** భూసంస్కరణల కార్యక్రమంలో భూస్వాములు, ధనిక రైతులకు చెందిన పారిశ్రామిక వాణిజ్య సంస్థలను ఆక్రమించడం జరిగింది; ఆర్థికరంగంలో ప్రతీఘాతుక విప్లవాన్ని బహిర్గతం చేసే పోరాటంలో, విచారణకు నిర్దేశించిన పరిధిని దాటి పోవటం జరిగింది; పన్నుల విధింపు విధానంలో, పరిశ్రమకూ వాణిజ్యానికి హాని జరిగింది. పరిశ్రమ వాణిజ్యాలతో వ్యవహరించడంలో వచ్చిన "అతివాద" పెదధోరణులు ఇవి. ఇపుడు అవిగూడా సరిదిద్దబడ్డాయి. కాబట్టి, పరిశ్రమ, వాణిజ్యాలు కోలుకొని అభివృద్ధి చెందవచ్చు. **మూడవది,** గత సంవత్సర కాలపు భూసంస్కరణలోని తీవ్రమైన పోరాటంలో, విచక్షణా రహితంగా కొట్టడం, చంపడం అనేవి ఖచ్చితంగా నిషిద్ధమనే పార్టీ విధానానికి షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ నిర్ద్వంద్వంగా కట్టుబడి లేదు. దాని ఫలితంగా, కొన్ని ప్రాంతాలలో, కొందరు భూస్వాములను, ధనిక రైతులను అనవసరంగా చంపడం జరిగింది. గ్రామాలలోని దుష్టశక్తులు ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని చాలా మంది శ్రామిక జనాన్ని తమ కక్షలు తీర్చుకోడానికి దుర్మార్గంగా హత్య చేశారు. జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని అన్నిటికీ బరితెగించి, తీవ్రంగా వ్యతిరేకించి, భూ సంస్కరణలను వెన్నుపోటు పొడిచిన ప్రధాన నేరస్థులకు అంటే అతినీచమైన ప్రతీఘాతకులకూ, స్థానిక నియంతలకూ ప్రజాకోర్టుల ద్వారా, ప్రజాస్వామిక ప్రభుత్వాల ద్వారా, మరణదండన వేయడం సక్రమమేననీ, పూర్తిగా అవసరమైనదనీ మేము భావిస్తున్నాం. ఈ పని చేయకపోతే, ప్రజాస్వామిక పాలన నెలకొల్పబడజాలదు. అయితే కొమింటాంగ్ పక్షాన వున్న సాధారణ సిబ్బందిని, సాధారణ భూస్వాములనూ, ధనిక రైతులనూ, చిన్నపాటి నేరస్థులను, విచక్షణారహితంగా చంపడాన్ని నిషేధించాలి. అంతేకాకుండా, నేరస్థులను విచారించేపుడు ప్రజాకోర్టుగానీ, ప్రజాస్వామిక ప్రభుత్వంగానీ, శారీరక హింసను ప్రయోగించకూడదు. గడచిన సంవత్సర కాలంలో, షాన్సి-సుయ్యువాన్ ప్రాంతంలో అమలు జరిగిన యిటువంటి పెదధోరణులు కూడా సరిదిద్దబడ్డాయి.

ఇపుడు, ఈ పెదధోరణులన్నీ చిత్తశుద్ధితో సరిదిద్దబడ్డాయి కాబట్టి, కేంద్ర కమిటీ యొక్క షాన్సి-సుయ్యువాన్ ఉపబ్యూరో నాయకత్వాన జరిగే పని అంతా సరైన పురోగమన పథంలో వుందని, ఆధారాల పూర్వకంగా చెప్పవచ్చు.

మన పని విధానాలను, వాస్తవమైన పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయించుకోవాలన్నది, కమ్యూనిస్టులందరూ దృఢంగా గుర్తుంచుకోవాల్సిన అత్యంత మౌలికమయిన పని పద్ధతి. మనం చేసిన పొరబాట్లకు గల కారణాలను పరిశీలిస్తే, మనం నిర్దిష్టమైన కాలమూ, ప్రదేశాలలోని వాస్తవ పరిస్థితి నుండి పక్కకు మళ్ళి, మన విధానాలలో స్వీయమానసికతత్వానికి గురికావడం వల్లనే అవన్నీ తల ఎత్తాయని మనకు విదితమౌతుంది. కామ్రేడ్లందరికీ ఇది ఒక గుణపాఠం కావాలి.

ప్రాథమిక స్థాయిలోని పార్టీ సంస్థలను పటిష్టం చేసే విషయానికి వస్తే, పాత, అర్థ-పాత, విముక్త ప్రాంతాలలో భూసంస్కరణలు, పార్టీని పటిష్టం చేయడం అనే కార్యక్రమాన్ని గురించి కేంద్ర కమిటీ జారీ చేసిన ఆదేశాన్ని అనుసరించి మీరు షాన్సి-చహార్-హోపై విముక్త ప్రాంతంలోని పింగ్ షాన్ కౌంటి అనుభవం మీద ఆధారపడ్డారు; అంటే మీరు పార్టీ సభ్యులుకాని ప్రజలలోని క్రియాశీల కార్యకర్తలను పార్టీ శాఖ సమావేశాలలో పాల్గొనడానికి ఆహ్వానించి, పార్టీ సంస్థల పని పద్ధతిలోనూ, వర్గ పొందికలోనూ పేరుకున్న కాలుష్యాన్ని తొలగించడానికి విమర్శ-ఆత్మవిమర్శలు ప్రారంభించి, పార్టీకి ప్రజలతో మరింత సన్నిహితమైన సంబంధాలు పెనవేసుకునే అవకాశం కల్పించారు. పార్టీ సంస్థలను పటిష్టం చేసే పనినంతా కూడా సరయిన విధంగా నిర్వహించడానికి ఇది మీకు దోహదం చేస్తుంది.

పొరబాట్లు చేసినప్పటికీ, సరిదిద్దుకోని మొండి ఘటాలు తప్ప, ఇంకా నేర్చుకో గల పార్టీ సభ్యులకు, కేడర్లకు అధ్యయనం గరపాలే తప్ప, వాళ్ళు ఏ వర్గం నుండి వచ్చిన వారయినప్పటికిన్నీ, వారిని వొదిలేయ కూడదు. మీరు, ఈ విధానాన్ని అమలుచేస్తూ వుండటం లేక చేయబోవడం అన్నది కూడా సరైనదే.

భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో, పేదరైతు సంఘాలు, రైతుసంఘాల ప్రాతిపదికమీద, జిల్లా, గ్రామ (లేక పట్టణ) స్థాయిలో ప్రజల ప్రాతినిధ్య సభలు ఏర్పరచే అనుభవం అత్యంత విలువైనది. నిజంగా విశాలమైన ప్రజానీకం యొక్క అభీష్టం మీద ఆధారపడ్డది మాత్రమే వాస్తవమైన ప్రజాప్రాతినిధ్య సభ. అన్ని విముక్త ప్రాంతాలలోనూ అటువంటి ప్రజల ప్రాతినిధ్య సభ ఏర్పడడం ఇపుడు పూర్తిగా సాధ్యం. అటువంటి సభ, ఒకసారి నెలకొల్పబడ్డ తర్వాత, అది స్థానిక ప్రజాధికార అంగం కావాలి. దానికి చెందవలసిన అధికారమంతా దానికీ, ఎన్నుకొనే ప్రభుత్వ కౌన్సిలుకూ ఇవ్వాలి. పేద రైతు సంఘం, రైతు సంఘాలు అప్పుడు దానికి చేదోడు వాదోడు అవుతాయి. భూసంస్కరణలు ప్రధానంగా ముగిసిన తరువాతనే, గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ప్రాతినిధ్య సభలను నెలకొల్పాలని ఒకప్పుడు మనం భావించాము. అయితే భూసంస్కరణల పోరాటం మధ్యలోనే, ప్రజల ప్రాతినిధ్య సభలను, వాటిచేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వ కౌన్సిళ్ళనూ, జిల్లా, గ్రామ స్థాయిలలో నెలకొల్పడం సాధ్యమనీ, అవసరమని కూడా మీ స్వంత అనుభవమూ, ఇతర విముక్తి ప్రాంతాల అనుభవమూ ఋజువు చేసాయి కాబట్టి, అదే పద్ధతిని మీరు కొనసాగించాలి. అన్ని విముక్త ప్రాంతాలు అదే విధంగా చేయాలి. గ్రామ, జిల్లాస్థాయిల్లో మొత్తంగా ప్రాతినిధ్య సభలు నెలకొల్పబడిన తర్వాత, వాటిని కౌంటిస్థాయిలో కూడా నెలకొల్పవచ్చు. కౌంటిస్థాయి వరకు ప్రజల ప్రాతినిధ్య సభలను నెలకొల్పిన తర్వాత, అంతకంటె పైస్థాయిలో వాటిని నెలకొల్పడం చాల సులువవుతుంది. వివిధ స్థాయిలలోని ప్రజల ప్రాతినిధ్య సభలలో, ఎక్కడ సాధ్యమైతే అక్కడ మనం-కార్మికులు, రైతులు, స్వతంత్ర వృత్తిపనివారు, వివిధ వృత్తులవారు, మేధావులు, జాతీయ బూర్జువావర్గపు పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, వివేకం గల ఆసాములు- వంటి అన్ని స్థాయిల ప్రజాస్వామిక ప్రతినిధులనూ కలుపుకు రావాలి. అయితే ఈ పనిని యాంత్రికంగా చేయకూడదు. అన్ని స్థాయిల ప్రజాస్వామిక ప్రజలనూ ఐక్యం చేయడం అన్న కర్తవ్యాన్ని యాంత్రికంగాకాక, సహజంగా నెరవేర్చటానికిగానూ, మనం పట్టణాలున్న గ్రామీణ ప్రాంతాలకూ, పట్టణాలు లేని గ్రామీణ ప్రాంతాలకు మధ్య గల తేడానూ, వివిధ పరిమాణాలలో వుండే పట్టణాల మధ్య గల తేడానూ, నగరాలకు గ్రామీణ ప్రాంతాలకు మధ్య గల తేడానూ గమనించాలి.

భూసంస్కరణల కోసం, పార్టీని పటిష్టం చేయడం కోసం జరిగిన మహత్తర ప్రజాపోరాటాలు, వేల వేల క్రియాశీల కార్యకర్తలను, కేడర్లనూ శిక్షితుల్ని చేసి, ముందుకు తెచ్చాయి. వాళ్ళకు ప్రజలతో మంచి సంబంధాలు వున్నాయి. వాళ్ళు జన చైనా రిపబ్లిక్‌కి అత్యంత విలువైన సంపద వంటి వారవుతారు. ఇక మీదట, వారు తమ పనితో నిరంతరం పురోగమించ టానికిగానూ, వాళ్ళ అధ్యయనా కార్యక్రమాన్ని మనం గట్టిపరచాలి. ఈ లోపల, విజయాలు, అభినందనలు తమను గర్విష్టులుగానూ, స్వయంసంతుష్టులుగాను తయారు చేయకుండా జాగ్రత్తపడమని వాళ్ళను మనం హెచ్చరించాలి.

వీటన్నిటి దృష్ట్యా, ఈ వివిధ అంశాలలోని విజయాల దృష్ట్యా, షాన్సి-సుయ్యువాన్ విముక్తి ప్రాంతం ఇదివరకెన్నటికన్నా, మరింత పటిష్టమవుతుందని చెప్పవచ్చు. ఇదే మార్గంలో పనిచేసిన ఇతర విముక్త ప్రాంతాలు కూడా. ఇదే విధంగా పటిష్టమైనాయి.

-2-

నాయకత్వానికి సంబంధించినంత వరకూ, షాన్సి-సుయ్యువాన్ విముక్త ప్రాంతపు విజయాలు,- ప్రధానంగా ఈ క్రింది కారణాల మూలంగా సాధించబడ్డాయి:

1. కామ్రేడ్ కాంగ్‌షెంగ్, గత వసంతకాలం, వేసవి కాలాలలో, లిన్ షియెన్ కౌంటిలోని హొచియా పో పరిపాలనా గ్రామంలో చేసిన కృషి ఇచ్చిన ఊతంతో, షాన్సి-సుయ్యువాన్ ఉపబ్యూరో గత జూన్ నెలలో ప్రిఫెక్చరల్ పార్టీ కమిటీల కార్యదర్శుల సమావేశం నిర్వహించింది. ఆ సమావేశం, గతంలోని పనిలో తల ఎత్తిన మితవాద పెదధోరణులను విమర్శించింది, పార్టీ పంథాకు వివిధ రకాల ఉల్లంఘనలు అనే తీవ్రమైన పరిణామాన్ని క్షుణ్ణంగా బహిర్గతంచేసి, భూసంస్కరణలనూ, పార్టీని పటిష్టం చేయడాన్ని చిత్తశుద్ధితో చేపట్టడం అన్న విధానాన్ని నిర్ణయించుకొంది. ఆ సమావేశం, ప్రధానంగా విజయవంతమైనట్లే. అది జరగకపోతే. భూసంస్కరణలు, పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాలు అంతటి విస్తృతిలో విజయవంతమై వుండేవి కావు. సమావేశంలోని లోపాలు ఏమిటంటే, అది, పాత, అర్థ-పాత, కొత్త, విముక్త ప్రాంతాలలోని విభిన్నమైన పరిస్థితులననుసరించి వేర్వేరు సమస్యలకు సంబంధించి అది తీవ్ర అతివాద విధానాన్నవలంబించింది; భూస్వామ్య వ్యవస్థను ఏ విధంగా నాశనం చేయాలన్న సమస్యకు సంబంధించి, భూస్వాములు దాచిన సంపదను వెలికితీయడంపై అతిగా పట్టుదల చూపెట్టింది. ప్రజల డిమాండ్లతో వ్యవహరించే సమస్యకు సంబంధించి, సమదృష్టితో కూడిన విశ్లేషణ చేయడంలో విఫలమై, "ప్రజలు ఏ విధంగా కోరుతారో, దాన్ని అలానే చేయండి" అనే తోడ్డకొట్టుడు నినాదాన్నిచ్చింది. పార్టీకి ప్రజలతో వుండే సంబంధాల సమస్య అయిన ఈ చివరి అంశానికొచ్చేసరికి పార్టీ ప్రజలకు నాయకత్వం వహించి, పరిస్థితుల వెలుగులో వాళ్ళలోని సరయిన భావాలను ప్రోత్సహించాలి. వాళ్ళు ఏవైనా తప్పుడు భావాలను కలిగి వుంటె, వాటిని సరిదిద్దుకునేందుకుగానూ వాళ్ళకు అధ్యయనాన్ని గరపాలి. ఆ సమావేశం, పార్టీ, ప్రజల భావాలను అమలుచేయాలని నొక్కి చెప్పిందే తప్ప, పార్టీ, ప్రజలకు అధ్యయనం గరపి, నాయకత్వం వహించాలి అన్న విషయాన్ని ప్రస్తావించకుండా నిర్లక్ష్యం చేసింది. తత్ఫలితంగా, చివరకు, కొన్ని జిల్లాలోని కామ్రేడ్ల మీద చెడు ప్రభావాన్ని కలిగించి, వాళ్ళలో తోకపట్టుకుపోయే తత్వపు పొరబాట్లను తీవ్రతరం చేసింది.

(తరువాయి 4వ పేజీలో).

2. ఈ సంవత్సరం జనవరిలో షాన్సి-సుయ్యువాన్ ఉపబ్యూరో, "అతివాద" పెడధోరణులను సరిదిద్దడానికి వరుసగా చర్యలు తీసుకుంది. ఉపబ్యూరో కామ్రేడ్లు, కేంద్ర కమిటీ డిసెంబరు సమావేశం నుండి తిరిగి వచ్చిన పిదప ఈ చర్యలను అమలుచేయడం జరిగింది. దీనికోసం ఆ ఉపబ్యూరో ఒక అయిదు అంశాల ఆదేశాన్ని జారీ చేసింది. 'ఈ సరిదిద్దుబాటు చర్యలు, ప్రజల అభిలాషలకు ఎంత చక్కగా అతికాయంటే, వాటి అమలు ఎంత వేగంగానూ, సమగ్రంగానూ జరిగిందంటే, దాదాపుగా "అతివాద" పెడధోరణులన్నీ కూడా, అతి కొద్ది సమయంలోనే సరిదిద్దబడ్డాయి.

-3-

షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ, జపాను వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధ కాలంలో అవలంబించిన నాయకత్వ పంథా మౌలికంగా సరైనదే. ఈ విషయం, కౌలు, వడ్డీరేట్ల తగ్గింపు ఉద్యమంలోనూ, వ్యవసాయిక ఉత్పత్తి, గృహ పరిశ్రమగా నూలు వడకడం, నేయడం, యుద్ధ పరిశ్రమలు-కొన్ని తేలికపాటి పరిశ్రమలు ఇవన్నీ గణనీయంగా పునరుద్ధరించబడి అభివృద్ధి చేయడంలోనూ, పార్టీ సంస్థలకు పునాదులు వేయడంల్లోనూ, ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పడంలోనూ, దాదాపు లక్ష సంఖ్య గల ప్రజల సాయుధ బలగాలను నిర్మించడంలోనూ ప్రదర్శించబడింది. ఈ కృషి అంతటి ప్రాతిపదికపైనే మనం ప్రతిఘటనా యుద్ధాన్ని విజయవంతంగా నడిపి, యెన్ షి-షాన్ తదితర అభివృద్ధి నిరోధకుల దాడులను తిప్పికొట్టాం. అయితే, ఆ కాలంలో ప్రభుత్వం, మరియు పార్టీలో, వాటి లోపాలు వాటి కున్నాయనుకోండి. వర్గ పొంతనలోనూ, పని పద్ధతిలోనూ కొంత మేరకు కాలుష్యం పేరుకోవడమే ఆ లోపమనీ, దానివల్ల మన పని మీద అవాంఛనీయమైన ప్రభావం ఉండిందనీ, ఇప్పుడు మనందరికీ చాలా స్పష్టంగా అర్థమౌతోంది. కానీ, మొత్తంగా తీసుకుంటే, ప్రతిఘటనా యుద్ధ కాలంలోని పని ఫలవంతమైంది. దీనివల్ల, జపానీయుల లొంగుబాటు తర్వాత చియాంగ్ కై-షేక్ విప్లవ ప్రతిఘాతుక దాడులను ఓడించటానికి కావలసిన అనుకూల పరిస్థితులు మనకు సమకూరాయి. ప్రతిఘటనా యుద్ధ కాలంలో షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ నాయకత్వపు ప్రధాన లోపాలు, లేక పొరబాట్లు ఏమిటంటే, పార్టీ సంస్థల్లోనూ, ప్రభుత్వ సంస్థల్లోనూ, వర్గ పొందికలోనూ పని పద్ధతిలోనూ, ఒక మేరకు పేరుకొన్న కాలుష్యాన్నీ తద్వారా అది మన పని మీద కలిగించిన అవాంఛనీయమైన ప్రభావాన్నీ అధిగమించడంలో, అత్యంత విశాలమైన ప్రజానీకంపై ఆధారపడకపోవడం. ఆ కర్తవ్యాన్ని నెరవేర్చే బాధ్యత ఇపుడు మీ మీద వున్నది. ఆ పరిస్థితికి ఒక కారణం ఏమిటంటే, షాన్సి-సుయ్యువాన్‌లోని నాయకత్వపు కామ్రేడ్లలో కొందరికి పార్టీకి, ప్రజలకూ సంబంధించిన అనేక వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన కొరవడింది. కామ్రేడ్లకు ఇది కూడా ఒక గుణపాఠం కావాలి.

-4-

షాన్సి-సుయ్యువాన్ పార్టీ సంస్థ ముందున్న కర్తవ్యమేమిటంటే, భూసంస్కరణలు, పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాల్ని పూర్తిచేయడానికి, అత్యధికంగా ప్రయత్నం చేయడం, ప్రజల విముక్తి పోరాటాన్ని కొనసాగించటం, దానికి మద్దతు ఇవ్వడం, ప్రజలపై గల భారాన్ని యిక ఏ మాత్రం పెంచకుండా, నిగ్రహించుకుంటూ తగినంతగా తేల్చికపర్చడం, ఉత్పత్తిని పునరుద్ధరించి అభివృద్ధి చేయడమూను. మీరిప్పుడు ఉత్పత్తిని గురించి సమావేశం జరుపుకుంటున్నారు. రాబోయే కొద్ది సంవత్సరాల వరకూ, ఉత్పత్తిని పునరుద్ధరించడానికీ, అభివృద్ధి చేయడానికీ వుండే లక్ష్యం ఏమిటంటే, ఒక వైపున ప్రజల జీవన పరిస్థితుల్ని మెరుగుపరచటం, రెండవ వైపు ప్రజల విముక్తి యుద్ధానికి మద్దతునివ్వడం. మీకు విస్తృతమైన వ్యవసాయం, గృహ పరిశ్రమలు వున్నాయి. వాటితోబాటు యంత్రాలను ఉపయోగించేటటువంటి కొంత తేలికపాటివి, భారీవి పరిశ్రమలు వున్నాయి. ఈ ఉత్పత్తి సంస్థలను నడిపించడంలో మంచి నాయకత్వాన్నందిస్తారని ఆశిస్తాను. లేకుంటే మీరు మంచి మార్క్సిస్టులనిపించుకోలేరు. వ్యవసాయరంగంలో, బ్యూరాక్రాట్ల గుప్పెట్లో వుండి, ప్రజలకు ప్రయోజనం కల్గించకపోగా కీడు చేసిన శ్రమమార్పిడి దళాలు, సహకార సంస్థలు అన్నీకూడా కుప్పకూలిపోయాయి. ఇది పూర్తిగా అర్థం చేసుకోవచ్చు. దీనిని గురించి చింతించాల్సిన అవసరంలేదు. ప్రజల మద్దతును పొందిన శ్రమమార్పిడి దళాలనూ, సహకార సంస్థలనూ, అవసరమైన ఇతర ఆర్థిక సంస్థలనూ జాగ్రత్తగా కాపాడి అభివృద్ధి చేయడం, వాటిని అన్ని ప్రాంతాలకూ వ్యాపింపచేయడమే మీ కర్తవ్యం.

-5-

జాతీయ పరిస్థితిపై మన కామ్రేండ్లందరూ తమ దృష్టిని నిలపాలి. గత సంవత్సరం జరిగిన పార్టీ యొక్క భూవ్యవస్థపై జాతీయ సమావేశం, భూసంస్కరణలు, పార్టీని పటిష్టం చేసే కార్యక్రమాలను ప్రారంభించాలనే కొత్త విధానాన్నవలంబించాలని తీర్మానించింది. దానికి అనుగుణ్యంగా, పార్టీని పటిష్టం చేయడం, భూసంస్కరణల మీద దాదాపుగా అన్ని విముక్త ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున కేడర్ల సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాలలో, పార్టీలో తలెత్తిన మితవాద భావాలను విమర్శించడం, పార్టీ యొక్క వర్గ పొందికలోనూ, పని పద్ధతిలోనూ ఏదో మేరకు కొంత కాలుష్యం పేరుకోవడం అన్న తీవ్రమైన పరిణామాన్ని బహిర్గతం చేయడం జరిగింది, అటు తర్వాత చాలా ప్రాంతాలలో తగు చర్యలు తీసుకోబడ్డాయి. "అతివాద" పెడధోరణులు సరిదిద్దబడ్డాయి, లేదా సరిదిద్దబడుతున్నాయి. ఈ విధంగా, కొత్త రాజకీయ పరిస్థితి, కొత్త రాజకీయ కర్తవ్యాలను ఎదుర్కొన్న మన పార్టీ, దేశం మొత్తం మీద తన పనిని సరయిన పురోగమన పథంపై నిల్పగల్గింది. గత కొద్ది మాసాలలో, ప్రజా విమోచనా సైన్యమంతా కూడా, సమరాల మధ్య విరామ కాలాన్ని పెద్దఎత్తున తర్ఫీదునివ్వడానికి, సంఘటితమవడానికీ వినియోగించుకుంది. ఇది పూర్తిగా సరైన మార్గదర్శకత్వం కింద, సక్రమమైన ప్రజాస్వామికమైన పద్ధతిలో నడపబడింది. కాబట్టి, ఇది కమాండర్ల సైనిక బాహుళ్యపు విప్లవోత్సాహాన్ని ఉత్తేజపరిచి, వాళ్ళకు యుద్ధం యొక్క లక్ష్యాన్ని స్పష్టంగా అర్థం చేసుకునే అవకాశం కల్పించి, సైన్యంలో కొన్ని తప్పుడు సైద్ధాంతిక పోకడలనూ, అవాంఛనీయమైన వ్యక్తీకరణలను ఏరిపారేసి, కేడర్లకూ, సైనికులకూ బోధన గరిపి, సైన్యం యొక్క పోరాట పటిమను బాగా పెంపొందించింది. ఇప్పటి నుండి, ప్రజాస్వామిక స్వభావము, ప్రజాస్వభావం గల ఈ కొత్తతరహా సిద్ధాంత బోధనా ఉద్యమాన్ని మనం సైన్యంలో నిర్వహిస్తూ ఉండాలి. మనం సాధించిన, మహత్తర చారిత్రక ప్రాముఖ్యతను కలిగిన పార్టీని పటిష్టం చేయడంగాని, ఇవేవీ, వీటిలో ఏ ఒక్కటి గూడా, మన శత్రువైన కొమింటాంగ్ చేపట్టలేదని మీరు స్పష్టంగానే గమనించగలరు. మన మాటకొస్తే, మనం మన లోపాలు సరిదిద్దుకోవడంలో చిత్తశుద్ధితో వ్యవహరించాము; మన పార్టీనీ 'సైన్యాన్నీ ఒక్క తాటిమీద ఐక్యంచేసి, వాటికి, ప్రజానీకానికి మధ్య సన్నిహిత సంబంధాలను స్థిర పరచాము; మన పార్టీ కేంద్రకమిటీ రూపొందించిన అన్ని విధానాలనూ, ఎత్తుగడలనూ మనం శక్తివంతంగా అమలుచేస్తున్నాము, ప్రజల విముక్తి యుద్ధాన్ని విజయవంతంగా నడుపుతున్నాము. మన శత్రువు ప్రవర్తన సరిగ్గా దీనికి వ్యతిరేకమైనది. వాళ్ళు అవినీతిలో ఎంతగా కూరుకుపోయి, దినదినం పెరుగుతోన్న, రాజీ కుదరని అంతరంగిక కలహాలవల్ల ఎంతగా చీలిపోయి, ప్రజలచేత ఎంతగా తిరస్కరించబడి పూర్తిగా ఏకాకులయిపోయి, తరచుగా సమరాల్లో ఎంతగా ఓటములు చవిచూస్తున్నారంటే వాళ్ళ వినాశనం తథ్యం. చైనాలో, విప్లవానికీ, ప్రతీఘాతుక విప్లవానికి మధ్య వున్న మొత్తం పరిస్థితి ఇది.

ఈ పరిస్థితిలో, కామ్రేడ్లందరూ పార్టీ యొక్క సాధారణ పంథాపై, అంటే నూతన ప్రజాస్వామిక విప్లవ పంథాపై దృఢమైన పట్టును సంపాదించుకోవాలి. నూతన ప్రజాస్వామిక విప్లవమంటే వేరే ఏదో విప్లవం కాదు. అది కేవలం కార్మిక వర్గ నాయకత్వం కింద, విశాల ప్రజానీకం సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికి, నిరంకుశాధికార పెట్టుబడిదారీవిధానానికీ, వ్యతిరేకంగా జరిపే విప్లవం మాత్రమే కాగలదు. కావాలి కూడా. దీని అర్థం ఏమిటంటే, ఈ విప్లవంలో నాయకత్వాన్ని, కార్మికవర్గమూ చైనా కమ్యూనిస్టు పార్టీ తప్ప వేరే వర్గంగానీ, వేరే ఏ పార్టీయైనగాని చేపట్టలేదు. చేపట్ట డానికి వీలులేదు. దీని అర్థం ఏమిటంటే కార్మికులు, కర్షకులు, స్వతంత్ర వృత్తిపనివారు, వివిధ వృత్తులవారు, మేధావులు, జాతీయ బూర్జువావర్గం, భూస్వాముల నుండి తెగతెంపులు చేసుకున్న వివేకం గల ఆసాములలో ఒక భాగం ఉంటారు. మనం విశాల ప్రజానీకం అని ప్రస్తావించేది వీళ్ళందరి గురించే. ఈ విశాల ప్రజానీకం ఏర్పరచబోయే రాజ్యం, మరియు ప్రభుత్వాలు, జనచైనా రిపబ్లిక్ మరియు కార్మికవర్గ నాయకత్వం కింద సకల ప్రజాస్వామిక వర్గాల మిత్ర కూటమికి చెందిన ప్రజాస్వామిక మిశ్రమ ప్రభుత్వం ఈ విప్లవంలో, సామ్రాజ్యవాదం, భూస్వామ్య-నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానాలు మాత్రమే కూలదోయబడవలసిన శత్రువులు కాగలవు, అవి మాత్రమే శత్రువులవుతాయి. ఈ శత్రువులందరి కేంద్రీకృత వ్యక్తీకరణే చియాంగ్ కై-షేక్ అభివృద్ధి నిరోధక పరిపాలక ముఠా.

సామ్రాజ్యవాదానికీ, నిరంకుశాధికార పెట్టుబడిదారీవిధానానికీ భూస్వామ్య విధానం మిత్రుడు. వాటి పరిపాలనకు అదే పునాది. కాబట్టి, భూమి వ్యవస్థను సంస్కరించడమే చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం యొక్క ప్రధాన సారాంశం. పేద రైతులమీద ఆధారపడి, మధ్యతరగతి రైతులతో ఐక్యమై, భూస్వామ్య దోపిడీ విధానాన్ని విచక్షణతో వ్యవహరిస్తూ అంచెలంచెలుగా రద్దుచేసి, వ్యవసాయక ఉత్పత్తిని అభివృద్ధి చేయడం అన్నదే భూసంస్కరణల సాధారణ పంథా. భూ సంస్కరణలలో, మనం ఆధారపడగల ప్రధాన శక్తి పేదరైతాంగం మాత్రమే. వ్యవసాయకూలీలతో కలిసి వాళ్ళు చైనా గ్రామీణ జనాభా మొత్తంలో 70 శాతం వున్నారు. పేదరైతు, వ్యవసాయ కూలీ ప్రజానీకపు డిమాండ్లను తీర్చడమే భూసంస్కరణల ప్రధాన, తక్షణ, కర్తవ్యం. భూసంస్కరణలలో, మధ్యతరగతి రైతులతో ఐక్యం కావడం అవసరం; గ్రామీణ జనాభాలో 20 శాతం వున్న మధ్యతరగతి రైతులతో, పేద రైతులు వ్యవసాయ కూలీలు పటిష్టమైన ఐక్యసంఘటనను ఏర్పరచాలి. లేకపోతే పేదరైతులూ, వ్యవసాయ కూలీలు ఏకాకులయిపోయి, భూసంస్కరణలు విఫలమవుతాయి. కొందరు మధ్యతరగతి రైతుల కోర్కెలను తీర్చడం భూసంస్కరణల కర్తవ్యాలలో ఒకటి. మధ్యతరగతి రైతులలో ఒక సెక్షనుకు, పేద రైతులకు సగటున దక్కే భూమి కంటే, కొంత ఎక్కువ భూమిని వుండనివ్వాలి. ఫ్యూడల్ భూస్వామ్య వర్గపు భూమి యాజమాన్య విధానాన్ని రద్దుచేయడానికై, విశాల రైతాంగ ప్రజానీకాన్ని త్వరగా మేల్కొల్పటానికి దోహదం చేయడానికే, మనం భూమిని సమానంగా పంచిపెట్టాలనే రైతాంగ డిమాండును సమర్థిస్తాము తప్ప సంపూర్ణ సమానత్వ సిద్ధాంతాన్ని మనం ప్రబోధించం. పరిపూర్ణ సమానత్వ సిద్ధాంతాన్ని ఎవరు ప్రబోధించినా తప్పే. భూమి పంపకంలో పరిపూర్ణ సమానత్వాన్ని ప్రబోధిస్తూ పరిశ్రమ వాణిజ్యాలను తక్కువచేసే ఒక రకమైన ఆలోచన ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో ప్రచారంలో వుంది. అటువంటిది, అభివృద్ధి నిరోధకమైన వెనుకబాటు ఆలోచన, తిరోగామి స్వభావం గలది. దాన్ని మనం విమర్శించాలి. భూస్వామ్య వర్గపు, పాతతరహా ధనిక రైతుల యొక్క భూస్వామ్య దోపిడీ విధానాన్ని అంతం చేయడం మాత్రమే, భూసంస్కరణల లక్ష్యం, కేవలం అది మాత్రమే లక్ష్యం కావాలి; అంతేకానీ జాతీయ బూర్జువావర్గంపైనగాని, భూస్వాములు మరియు ధనిక రైతులు నడిపే పారిశ్రామిక సంస్థలపైనగాని అతిక్రమణలు జరగకూడదు. మరీ ముఖ్యంగా, మధ్యతరగతి రైతులు, స్వతంత్ర వృత్తి పనివారు, వివిధ వృత్తులవారు, కొత్తతరహా ధనిక రైతుల ప్రయోజనాలను అతిక్రమించకుండా జాగ్రత్తపడాలి. (వాళ్ళ దోపిడీ చాల తక్కువ వుంటుంది. లేదా అసలు వుండదు). భూసంస్కరణల లక్ష్యం భూస్వామ్య విధానపు దోపిడీని రద్దు చేయడం. అంటే భూస్వాములను ఒక వర్గంగా రద్దుచేయడమే కానీ వ్యక్తులుగా కాదు. కాబట్టి భూస్వామికికూడా, ఒక రైతు కిచ్చినంత భూమీ, ఆస్థీ ఇచ్చి, అతను ఉత్పత్తి కొరకు శ్రమచేయడం నేర్చుకొని జాతి ఆర్థిక జీవన స్రవంతిలో కలిసేలా చేయాలి. విశాల ప్రజానీకపు తీవ్ర ద్వేషానికి గురై, నేరస్తులుగా ఋజువు చేయబడి, శిక్షార్హులైన, శిక్షించబడవలసిన అతి నీచమైన విప్లవ ప్రతీఘాతకులు, స్థానిక నియంతలు మినహా, తక్కిన వారందరిపట్లా ఔదార్యపు విధానాన్నవలంబించాలి. విచక్షణా రహితంగా కొట్టడం, చంపడాలను నిషేధించాలి. భూస్వామ్య దోపిడీ వ్యవస్థను అంచెలంచెలుగా, అంటే యుక్తి యుక్తంగా రద్దుచేయాలి. పోరాటాన్ని ప్రారంభించేటపుడు, పరిస్థితులనుబట్టి, రైతాంగ ప్రజానీకం ఎంత మేరకు జాగృతులయి, సంఘటితమై వున్నారన్న దానిని బట్టి, మనం మన ఎత్తుగడలను నిర్ణయించాలి. రాత్రికి రాత్రే భూస్వామ్య దోపిడీ వ్యవస్థను మొత్తంగా తుడిచి పెట్టేయడానికి ప్రయత్నించకూడదు. చైనా గ్రామాలలోని భూస్వామ్య దోపిడీ వ్యవస్థ యొక్క వాస్తవ పరిస్థితుల కనుగుణ్యంగా, భూసంస్కరణలలో మన దాడి యొక్క మొత్తం పరిధి, గ్రామీణ కుటుంబాలలో 8 శాతాన్ని లేదా గ్రామీణ జనాభాలో 10 శాతాన్ని మించకూడదు. పాత, అర్థ-పాత, విముక్త ప్రాంతాలలో ఈ శాతం ఇంకా తక్కువగా ఉండాలి. వాస్తవ పరిస్థితుల నుండి దూరమై దాడి యొక్క పరిధిని విస్తృతం చేయడం ప్రమాదకరమైనది. పైగా కొత్త విముక్త ప్రాంతాలలో విభిన్న ప్రదేశాలకు మధ్య, విభిన్న దశలకు మధ్య కూడా తేడాను గమనించాల్సిన అవసరం ఉంది. విభిన్న ప్రదేశాల మధ్య తేడాను గమనించాలి అనడంలో మన భావం ఏమిటంటే, మనం భద్రంగా నిలబెట్టుకోగల ప్రదేశాలలో, స్థానిక ప్రజల డిమాండ్ల ననుసరించి, తదనుగుణ్యమైన భూసంస్కరణల కార్యక్రమాన్ని కొనసాగించడంపై మన ప్రయత్నాలను కేంద్రీకరిస్తూ, ప్రస్తుతానికి భద్రంగా నిలబెట్టుకోడం. కష్టమైన ప్రదేశాలలో, పరిస్థితిలో మార్పు వచ్చేదాకా భూసంస్కరణలను ప్రారంభించడానికి తొందరపడకుండా, ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలకూ, సాధించడానికి వీలయే కార్యక్రమాలకూ మాత్రమే పరిమితం కావాలి. విభిన్న దశల మధ్య తేడాను గమనించండి అని అనడంలో మన భావ మేమిటంటే, యిటీవలే ప్రజా విముక్తి సైన్యం ఆక్రమించుకొన్న ప్రాంతాలలో మనం ధనిక రైతులను తటస్థంగా చేసుకునే ఎత్తుగడలనూ, మధ్యతరగతి, చిన్న భూస్వాములను తటస్థంగా చేసుకునే ఎత్తుగడలనూ అవలంబిస్తూ, ఆ విధంగా కేవలం అభివృద్ధి నిరోధక కొమింటాంగ్ సాయుధ బలగాలను మాత్రమే నాశనం చేసి, దుష్ట ఆసాములపైనా, స్థానిక నియంతల పైనా దెబ్బతీసే విధంగా మన దాడి యొక్క పరిధిని తగ్గించాలి. కొత్త విముక్త ప్రాంతాలలోని పనిలో మొదటి దశగా యీ కర్తవ్యాన్ని నిర్వహించడం మీద మన ప్రయత్నాలన్నిటినీ కేంద్రీకరించాలి. ఆ తరువాత పెరిగే ప్రజల చైతన్యాన్ని, నిర్మాణాన్ని అనుసరించి, భూస్వామ్య వ్యవస్థను సంపూర్ణంగా రద్దుచేసే దశకు అంచెలంచెలుగా ముందుకు పురోగమించాలి. కొత్త విముక్త ప్రాంతాలలో పరిస్థితులు సాపేక్షికంగా భద్రంగా వుండి, ప్రజలలో అత్యధిక భాగం కార్యాచరణకు పూర్తిగా ఉత్తేజితులైన తర్వాత మాత్రమే మనం భూమిని, చరాస్థిని పంచిపెట్టాలి; దీనికి భిన్నంగా ప్రవర్తించడం దుస్సాహసికం, ఆదారపడరానిదీ అవుతుంది. మంచి కంటె కీడే చేస్తుంది. కొత్త విముక్త ప్రాంతాలలో ప్రతిఘటనా యుద్ధంలో సాధించుకున్న అనుభవాన్ని పూర్తిగా వినియోగించాలి. భూస్వామ్య విధానాన్ని ఒక విచక్షణాయుత మార్గంలో రద్దుచేయడం అనడంలోని మన భావం ఏమిటంటే మనం భూస్వాములకు, ధనిక రైతులకు మధ్య గల తేడాను దృష్టిలో వుంచుకోవాలి; పెద్ద, చిన్న, మధ్యరకపు, భూస్వాముల మధ్య గల తేడానూ, భూస్వాములు ధనిక రైతులలో స్థానిక నియంతలకూ కాని వారికీ మధ్యగల తేడానూ గమనించాలి; భూమిని సమానంగా పంచిపెట్టడం, భూస్వామ్యవ్యవస్థను రద్దుచేయడం, అనే ముఖ్యమైన, ప్రాథమికాంశానికి లోబడి వుంటూనే, విభిన్న పరిస్థతులను, బట్టి, విభిన్నంగా వ్యవహరించాలి తప్ప, వీళ్ళందరిపట్ల ఒకే విధమైన నిర్ణయాలతో ఒకే తీరుగా వ్యవహరించరాదు. మనం ఈ విధంగా చేస్తే, మన పని పూర్తిగా సమంజసంగా వుందని ప్రజలు గుర్తించగలుగుతారు. వ్యవసాయిక ఉత్పత్తిని అభివృద్ధి చేయటమే భూసంస్కరణల తక్షణ లక్ష్యం. భూస్వామ్య విధానాన్ని రద్దుచేయడం ద్వారా మాత్రమే, అటువంటి అభివృద్ధికి అవసరమైన పరిస్థితులు సృష్టించబడతాయి. అన్ని ప్రాంతాలలోనూ, భూస్వామ్య విధానాన్ని తుడిచిపెట్టేసి, భూసంస్కరణలను పూర్తిచేయగానే, పార్టీ మరియు ప్రజాస్వామిక ప్రభుత్వాలు, వ్యావసాయికోత్పత్తిని పునరుద్ధరించి అభివృద్ధి చేసే కర్తవ్యాన్ని చేపట్టి, గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో వున్న శక్తులన్నింటినీ, యీ కర్తవ్య నిర్వహణకై తరలించి, సహకారమూ, పరస్పర సహాయమూ ఏర్పాటుచేసి, వ్యవసాయ పద్ధతులను మెరుగుపరిచి, విత్తనాల ఎంపికను పెంపొందించి, నీటిపారుదల సౌకర్యాలను నిర్మించాలి. ఇవన్నీ కూడా, ఉత్పత్తి తప్పనిసరిగా అధికంగా జరిగేలా చూడడం కోసమే. గ్రామీణ ప్రాంతాలలోని పార్టీ సంస్థలు, వ్యవసాయిక ఉత్పత్తిని పునరుద్ధరించి, అభివృద్ధి చేయడంకోసం, అత్యధిక శక్తిని వినియోగించాలి. ఈ పునరుద్ధరణనూ, అభివృద్ధిని త్వరితం చేయ్యడంకోసం, భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసే పోరాట క్రమంలో, ఉత్పత్తికీ జీవనానికీ ఉపయోగకరమైన సాధనాలన్నింటినీ జాగ్రత్త చేయడం కోసం, వాటిని ఎవరైనా వృధా చేసినా, లేదా ధ్వంసం చేసినా, వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. విపరీతంగా తినడాన్ని, తాగడాన్ని వ్యతిరేకిస్తూ, పొదుపు ఆదాలపై దృష్టి వుంచాలి. వీటన్నింటికోసం మనం, మన శక్తి మేరకు కృషి చేయాలి. వ్యవసాయిక ఉత్పత్తిని అభివృద్ధి చేయడంకోసం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు అనుమతించదగినవీ, వ్యక్తిగత ప్రాతిపదికగా వుండేవీ అయిన వివిధ రకాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలనూ, వినియోగదారుల సహకార సంఘాలనూ, స్వచ్ఛందంగానూ, అంచెలంచెలుగానూ నిర్మించుకోమని రైతులకు మనం సలహా ఇవ్వాలి. భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసి, వ్యవసాయిక ఉత్పత్తిని అభివృద్ధి చేస్తే, అది పారిశ్రామిక ఉత్పత్తి అభివృద్ధికి, వ్యవసాయిక దేశం, పారిశ్రామిక దేశంగా పరివర్తన చెందడానికీ అవసరమైన పునాదిని సృష్టిస్తుంది. నూతన ప్రజాస్వామిక విప్లవపు అంతిమ లక్ష్యం ఇదే.

కామ్రేడ్స్! చైనా విప్లవం యొక్క సాధారణ పంథానూ, సాధారణ విధానాన్ని మన పార్టీ నిర్దేశించిందనీ, అంతేకాక వివిధ నిర్దిష్ట విధానాలనూ, పనికి సంబంధించి నిర్దిష్ట పంథాలనూ కూడా రూపొందించిందని మీకందరికీ తెలుసు. అయితే; చాలా మంది కామ్రేడులు మన పార్టీ యొక్క నిర్దిష్ట విధానాలను, పనికి సంబంధించిన నిర్దిష్ట పంథాలనూ గుర్తుంచుకొన్నప్పటికీ, తరచుగా వాళ్ళు, పార్టీ యొక్క సాధారణ పంథాను, సాధారణ విధానాన్ని మనం మరచిపోతే, మనం గుడ్డిగా తడుములాడుకునే విప్లవకారులము, పరిణితి లేనివాళ్ళమూ అవుతాం, మందబుద్ధుల మవుతాము. పైగా నిర్దిష్ట పని పంథాను, నిర్దిష్ట విధానాన్ని

(తరువాయి 5వ పేజీలో)

జూలియస్ ఫ్యూజిక్ 65వ వర్ధంతి సందర్భంగా:

కమ్యూనిస్టులు ప్రజల ప్రయోజనాలను ధృడంగా పరిరక్షిస్తారని కళ్ళకు కట్టినట్లు చూపించిన జూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు'

- జీవన్

పాత్రికేయుడూ, సాహిత్య విమర్శకుడూ, కమ్యూనిస్టు నాయకుడూ అయిన జూలియస్ ఫ్యూజిక్ జెకోస్లవేకియా దేశంలోని ప్రేగ్ నగరంలో ఒక ఉక్కు పరిశ్రమ కార్మికుని యింట 23 ఫిబ్రవరి 1909లో జన్మించాడు. చిన్న వయస్సులోనే సాంస్కృతిక రంగం లోనూ, కార్మికోద్యమంలోనూ తన కార్యకలాపాలను ప్రారంభించాడు. ప్రేగ్ యూనివర్శిటీలో సాహిత్యం, సంగీతం, కళలను గురించిన విద్యనభ్యసించాడు. ఒక కార్మికుడిగా జీవిస్తూనే కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. సోషలిస్టు సమీక్షలు రాస్తూ కమ్యూనిస్టు విద్యార్థి ఉద్యమంలో ఒక నాయకుడిగా ఎదిగాడు. 1929లో 'త్వోర్బా' (సృజన) అనే పత్రికకు ప్రధాన సంపాదకు డయ్యాడు. ఆ పత్రికలో సంస్కృతిపైనా, రాజకీయాల పైనా సమీక్షలు రాసి ఆ పత్రికకు ప్రజల్లో ప్రాచుర్యాన్ని పెంపొందింపచేశాడు. తదనంతర కాలంలో జెకోస్లవేకియా కమ్యూనిస్టు పార్టీ యొక్క అధికార పత్రిక 'రుదేప్రావో' పత్రికకు సంపాదకుడు అయ్యాడు.

జ్యూలియస్ ఫ్యూజిక్ రెండుసార్లు సోవియట్ యూనియన్‌ను సందర్శించి అక్కడి విషయాలను పత్రికల ద్వారా, ఉపన్యాసాల ద్వారా తన దేశ ప్రజలకు వివరించాడు. జెకోస్లవేకియాలోని అభివృద్ధి నిరోధకులు ఆయన్ను ఎంతగానో పీడించారు. అభివృద్ధి నిరోధక ప్రభుత్వం ఆయనను పలుమారులు జైలుపాలు చేసింది.

జెకోస్లవేకియా ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని, కమ్యూనిస్టు సాహిత్యాన్నీ చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించింది. జెకోస్లవేకియా దేశాన్ని హిట్లరు, నాజీలు ఆక్రమించటంతో ఫ్యూజిక్ రహస్య జీవితంలోకి వెళ్ళిపోయాడు.

1941 ఫిబ్రవరి నెలలో ఒక్కరు తప్ప జెకోస్లవేకియా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులందరూ అరెస్టు చేయబడ్డారు. వారితోపాటే వారి స్థానంలో పనిచేయాల్సిన ద్వితీయ స్థాయి బృంద నాయకులు కూడా అరెస్టు కాబడ్డారు. జికా అనే ఒక్క కేంద్ర కమిటీ సభ్యుడు మాత్రమే అరెస్టు కాబడలేదు. ఆయన ఎంతో అంకిత భావంతో, ధృడ నిశ్చయంతో పార్టీ పనిని చేసేవాడు. తాను చేయాల్సిన పని తప్ప ఆయన ఏ యితర విషయాన్ని తెలుసుకొనేవాడు కాదు. పట్టించుకొనేవాడు కాదు. తన కర్తవ్యాన్ని నిర్వహించటం కోసం ఆయన యితర సుఖాలన్నింటినీ త్యజించినవాడు. రహస్య జీవితంలో వున్న ఫ్యూజిక్, జికాతో కలసి పార్టీ యొక్క రహస్య కేంద్ర కార్యాలయాన్ని నిర్వహించటంలో కృషి చేశాడు. కేంద్ర పార్టీ పత్రిక 'రుదేప్రావో'ను ప్రచురించాడు. ఆ పత్రికతోపాటు వ్యంగ్యమయిన సమీక్షలు రాసే 'ట్రాన్ వెసెక్' (చిరుకేక) అనే పత్రికను, మరిన్ని యితర ప్రచురణలను కూడా ప్రచురించటం జరిగింది. ఆ రకంగా 1931-1941 వరకు పార్టీ రహస్య నిర్మాణ కార్యకలాపాలను కొనసాగించటమేకాక, 1941 సెప్టెంబరు నాటికి కుంటుబడి, దెబ్బతిన్న పార్టీ పునర్నిర్మాణానికి జరిపిన కృషిలో ఫ్యూజిక్ ప్రముఖ పాత్ర వహించాడు.

జూన్ 22, 1941వ తేదీన హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి చేయటం జరిగింది. అదే రోజు సాయంత్రానికల్లా హొూంజా వైస్కోషిల్‌తో కలసి జూలియస్ ఫ్యూజిక్ ఒక కరపత్రాన్ని తీసుకువచ్చి, ఆ కరపత్రంలో రష్యాపై నాజీ దాడి వలన జెకోస్లవేకియాకు ఏ రకంగా నష్టం జరుగుతుందో వివరించటం జరిగింది. ఫ్యూజిక్ పార్టీ యొక్క రహస్య ప్రచురణా విభాగాన్ని నిర్మాణంచేసి దాన్ని అభివృద్ధి పరిచాడు.

23, ఫిబ్రవరి, 1942న కామ్రేడ్ స్టాలిన్ జారీ చేసిన 'సైనిక సాధారణ ఉత్తర్వులను' 24 సాయంత్రానికల్లా ముద్రించి పాఠకులకు అందుబాటులోకి తేవటం జరగటాన్నిబట్టి చూస్తే శత్రువు తీవ్ర నిర్బంధం మధ్య, రహస్యంగా పనిచేస్తూ, తమ సాహిత్యాన్ని ప్రజలకు తక్షణం అందించగల ప్రతిభావంతమయిన నిర్మాణాన్ని ఎలా నెలకొల్పగలిగారో అర్థమవుతోంది. అదే కాలంలో పార్టీకి చెందిన మరో సాంకేతిక బృందం అయిన ఫుష్-లోరెంజ్ అనే రహస్య బృందం "హిట్లర్‌ను వ్యతిరేకిస్తున్న ప్రపంచం' అనే మరో పత్రికను ప్రచురించటం జరిగింది. ఈ పత్రికకు సంబంధించిన విషయాలన్నింటినీ జూలియస్ ఫ్యూజికే తయారుచేసి యిచ్చేవాడు. ఈ రకంగా జూలియస్ ఫ్యూజిక్ పార్టీ యొక్క రహస్య ప్రచురణల ద్వారా దేశ ప్రజలకు రాజకీయ చైతన్యం కల్గించే కృషిని సాగించాడు. జెకోస్లవేకియాకు చెందిన ఒక దేశభక్తుడిగా, ఒక కార్మికవర్గ ప్రతినిధిగా జూలియస్ ఫ్యూజిక్ "ఏ దేశమైనా అభివృద్ధి నిరోధకత్వం బారి నుండీ, ఫాసిజం నుండీ రక్షింపబడాలంటే ఆ దేశం తప్పనిసరిగా సోషలిస్టు భూమి అయిన సోవియట్ యూనియన్‌తో మైత్రి నెరపా"లనే అభిప్రాయాన్ని బోధించేవాడు. మేధావుల మధ్య పనిచేస్తూ రహస్యంగా 'రెడ్ రైట్స్' అనే పత్రికను ఆయన మేదే కోసం ప్రచురించటం జరిగింది. ఈ రకంగా రహస్యంగా ప్రచురించిన సాహిత్యాన్ని కేవలం పార్టీ సభ్యులేకాక దేశమంతటా విస్తృతంగా చదివేవారు.

తన మాతృదేశ విముక్తికోసం, ప్రపంచ దేశాలకు ప్రమాదంగా ముంచుకొచ్చిన ఫాసిజం యొక్క ఓటమి కోసం ఈ విధంగా నిర్విరామంగా కృషిచేస్తున్న జూలియస్ ఫ్యూజిక్‌ను, జర్మన్ ఫాసిస్టు రహస్య పోలీసు సంస్థ అయిన "గెస్టపో" సంస్థ ఏజెంట్లు ఏప్రియల్24, 1942న అరెస్టు చేశారు. ఒక సహచరుడి విద్రోహ ఫలితంగా ఈ అరెస్టు జరిగింది. అరెస్టు చేయబడ్డ ఫ్యూజిక్‌ను ప్రేగ్ నగరంలోని గెస్టపోకు చెందిన పాంక్రాంట్సు కారాగారంలో నిర్బంధించటం జరిగింది.

అరెస్టు చేసిన ఫ్యూజిక్‌ను గెస్టపో పోలీసులు నానా చిత్రహింసలకు గురిచేశారు. నాలుగు రోజులపాటు అతడ్ని కుళ్ళబొడిచారు. పార్టీ విషయాలూ, యితరుల వివరాలూ తెలియచేస్తే వదిలివేస్తామని ఆయన్ని ప్రలోభ పెట్ట చూశారు. లేకపోతే నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేస్తామని బెదిరించి భయపెట్ట చూశారు. వారి జిత్తులనుకానీ, బెదిరింపులనుకానీ ఫ్యూజిక్ లక్ష్యపెట్టలేదు. వాళ్ళు ఎంతగా కుళ్ళబొడుస్తున్నా, ఎంతగా మానసికంగా హింసించినా లొంగక, ఒక్కమాట కూడా చెప్పకుండా అత్యంత ధైర్యంగా నిలబడ్డాడు. "నేనింత వరకూ నా జీవితాన్ని వృధాగా గడపలేదు. ఇప్పుడు ఈ ఆఖరి రోజుల్లో నా జీవితాన్ని నేను నాశనం చేసుకోను" అంటూ ఎంతో ధైర్యంగా ప్రకటించాడు.

ఏప్రియల్ 24, 1942 నుండి జూన్ 9, 1943 వరకూ తాను, తనతోబాటు వున్న యితర రాజకీయ ఖైదీలు అనుభవించిన చిత్రహింసలూ, వేధింపులూ, యితర ఖైదీలతో సాన్నిహిత్యం, జైలులో యితరులతో కలిసి సమిష్టిగా ఏర్పాటు చేసుకొన్న 'బ్రదర్ హుడ్' (సోదరవర్గం) ద్వారా ఒకరి కష్టాలను మరొకరు ఆదుకొన్న వైనం, ఒకరికొకరు ధైర్యాన్ని చెప్పుకోవటం, తమ కళ్ళముందే తమతోటి వారిని కాల్చి చంపి వేయటానికి తోలుకుపోతున్నప్పుడు పడే మనోవ్యధ, మరణశిక్షకు గురవబోతున్న ముందు క్షణంలో కూడా, కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రదర్శించిన మొక్కవోని ధైర్యం, తమ కమ్యూనిస్టు ఆదర్శం శత్రువు ముందు చులకన కాకుండా కమ్యూనిస్టు రాజకీయ ఖైదీలు ప్రదర్శించిన నిబ్బరం, నానాటికీ దిగజారిపోతున్న పరిస్థితుల్లో సహితం క్రుంగిపోయి, కుమిలిపోకుండా యింకా అరెస్టుకాని యితరులనూ, అరెస్టయిన వారినీ రక్షించటం కోసం ఆ ఖైదీలు పడ్డ తాపత్రయం, కృషీ తదితర విషయాలన్నింటినీ జూలియస్ ఫ్యూజిక్, ఒక జెక్ జాతీయుడైన జైలు కాపలాదారుని సహాయంతో 'నోట్సు'గా వ్రాయటం జరిగింది. 'నోట్సు ఫ్రమ్ ది గాలోస్' (ఉరికంబం నుండి వివరములు) అనే పేరుగల యీ వివరాలను 1945 మే నెలలో జైలు నుండి బయటకు వచ్చిన జూలియస్ ఫ్యూజిక్ భార్య ఆగస్టినాఫ్యూజిక్, ఆ నోట్సురాయటానికి సహకరించిన పాంక్రాట్సు కారాగారపు కాపలాదారుడు ఎ.కొలిన్స్కీ నుండి సేకరించి ప్రచురించటం జరిగింది. ఆ 'నోట్సు'ను తెలుగులో 'రక్తాక్షరాలు' పేరిట ప్రచురించటం జరిగింది. (1945 మే నెలలో సోవియట్ యూనియన్ చేతిలో హిట్లర్ ఓడిపోవటంతో ఆగస్టినా ఫ్యూజిక్ విడుదల చేయబడింది.)

ప్రేగ్ జైలులో విచారణ జరిపిన అనంతరం, బెర్లిన్‌లో గల నాజీ కోర్టు జూలియస్ ఫ్యూజిక్‌కు ఆగస్టు 25, 1943న మరణశిక్ష విధించింది. శిక్ష విధించిన 14వ రోజున అనగా సెప్టెంబరు 8, 1943న జూలియస్ ఫ్యూజిక్‌పై బెర్లిన్ నగరంలో ఉరిశిక్ష అమలుజరుపబడింది.

ప్రేగ్‌లోని పాంక్రాట్సు కారాగారంలో పలు చిత్రహింసలకు గురవుతూ, తన తోటి రాజకీయ ఖైదీలు మరణశిక్షకు గురికాబడటం, కళ్ళారా చూస్తూ క్రుంగిపోకుండా జూలియస్ ఫ్యూజిక్ ఈ 'రక్తాక్షరాల'ను నమోదు చేయటం అన్నది అతడి పోరాటానికి కొనసాగింపుగా అర్థం చేసుకోవాలి.

ఈ నోట్సులో ఫ్యూజిక్ ప్రజలపట్ల, వారి భవిష్యత్తుపట్ల తనకు గల ధృడమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తాడు.

ఆయన జైలులో తీవ్ర చిత్రహింసలకు గురిచేయబడిన అనంతరం యిక తను బ్రతకటం అసాధ్యం అనే అభిప్రాయానికి వస్తాడు. అప్పుడు ఆయన యీ రకంగా ప్రజలకు తన సందేశాన్ని నమోదు చేశాడు:

"నేను జీవితాన్ని దాని యొక్క సౌందర్యంకోసం ప్రేమించాను. అందుకోసమే నేను పోరాటంలోకి వెళ్ళాను. ప్రజలారా, నేను మిమ్ములను ప్రేమించాను. మీరు తిరిగి నా పట్ల ఆ ప్రేమను చూపించినప్పుడు ఎంతో ఆనందించాను. నన్ను మీరు అపార్థం చేసుకొన్నప్పుడు ఎంతగానో బాధపడ్డాను. మీలో ఎవరికయినా నేను చెడు చేస్తే నన్ను క్షమించండి. మిమ్ములనెవరినైనా ఆనందపరిస్తే ఆ విషయం మరిచి పోండి. నా పేరు మీద దుఃఖం అన్నది వుండకూడదు. మీ అందరికీ నా ప్రేమాభివందనాలు.... ఒకవేళ ఏడ్వటం వలన దుఃఖం యొక్క ధూళిని పారద్రోలగల మనుకొంటే కొంచెంసేపు ఏడ్వండి. కానీ విచారించ కండి. నేను సంతోషంగా వుండటం కోసం జీవించాను. అందుకోనమే నేను మరణించబోతున్నాను. అటువంటప్పుడు శోక దేవతను నా సమాధిపై వుంచటం అన్నది అన్యాయం".

దీనినిబట్టి జూలియస్ ఫ్యూజిక్‌కు జీవితంపట్ల, భవిష్యత్తుపట్ల, ప్రజల పట్లా ఎంతటి ధృడవిశ్వాసం వుందో అర్థమవుతుంది.

జూలియస్ ఫ్యూజిక్ తన ఆఖరి వీలునామా రాస్తూ, తనకు తాను సేకరించుకున్న గ్రంథాలయం తప్ప వేరే ఆస్తిలేదనీ, గెస్టాపో దాన్ని యిప్పటికే ధ్వంసం చేసి వుంటారనీ, తాను అధ్యయనం చేసిన సాంస్కృతిక, రాజకీయ అంశాలపై అనేక వ్యాసాలు రాశాననీ సాహిత్యంపైనా, నాటకాలపైనా సమీక్షలు రాశాననీ, వాటిన్నింటినీ తన భార్య ఆగష్టినా దాచిపెడుతుందని అనుకొన్నాననీ, కానీ ఆమెకు అటువంటి అవకాశం లేదు కనుక (ఆమెను కూడా జూలియస్ ఫ్యూజిక్‌ను అరెస్టు చేసిన వెంటనే అరెస్టుచేసి కొంత కాలం పాంక్రాట్సు జైలులోనూ, మరికొంత కాలం రావెన్సుబర్క్ కాన్‌సెంట్రేషన్ క్యాంపులోనూ నిర్బంధించి, 1945 మేలో సోవియట్ యూనియన్ చేతిలో హిట్లరు ఓడిపోయిన అనంతరం, ఫాసిస్టులు ఆ తొందరలో ఆమెను చిత్రహింసలు పెట్టి చంపే సమయం లేక వదిలిపెట్టారు) తాను వ్రాసిన వాటినన్నింటినీ కామ్రేడ్ లడ్వాస్టాల్ సేకరించి (వివిధ పత్రికల నుండి) వాటి నుండి వివిధ రచనలను ఏరి 5 పుస్తకాలుగా ప్రచురించాలని కోరాడు:

1. రాజకీయ వ్యాసాలు-చర్చలూ
2. దేశ వ్యవహారాలపై ఎంపిక చేసిన వ్యాసాలు
3. సోవియట్ యూనియన్ నుండి తయారు చేసిన నోట్సు
4. మరియు 5. సాహిత్యంపై, నాటకాలపై అధ్యయనాలు, వ్యాసాలు.

ఇవిగాక జూలియస్ జేయర్ పై తన అధ్యయనాన్నీ, సాజిన్, జాన్ నెరూదాలపై తాను చేసిన అధ్యయన వివరాలను సేకరించి ప్రచురించాలని ఆయన కోరాడు.

తాను పోయిన లోటును పూడ్చటానికి తన తల్లిదండ్రులకోసం తన సోదరీమణులు విబా, వెరాలు పాటలు పాడుతూ, నవ్వుతూ వుండాలనీ,

తనతోపాటు ఈ ధర్మయుద్ధంలో పోరాడి చివరి దాకా జీవించి వుండే ప్రతీ కామ్రేడుకీ, తన భార్య ఆగష్టినాకూ, తర్వాతి కాలంలో ఉద్యమంలోకి రాబోయే కామ్రేడ్లకూ విప్లవ అభివందనాలు తెల్పుతూ,

"మేము సంతోషంకోసమే జీవించాం, అందుకోసమే పోరాట యుద్ధానికెళ్ళాం, అందుకోనమే మేము మరణిస్తాం. మా పేర్లతో విచారాన్ని కలుపవద్దు" అని కోరుతూ ఆయన తన వీలునామాను పూర్తి చేశాడు.

8 అధ్యాయాలుగా విడదీయబడి రాయబడిన ఈ రక్తాక్షరాల 'నోట్సు'లో తన అరెస్టును గురించిన వివరాలూ, చిత్రహింసల అనంతరం తాను మరణావస్థకు చేరుకొన్న వైనం, తనను వుంచిన సెల్ నెం.267 తోటి ఖైదీల సేవతో పునర్జన్మను పొందిన వైనం, తనను-యితర రాజకీయ ఖైదీలను విచారణ కోసం తీసుకువెళ్ళే 'సినిమా'గా రాజకీయ ఖైదీలచే పిలబడే పెట్‌చెక్ భవనంలోని 400 నెంబరు గల హాలు గురించీ, తన అరెస్టు తర్వాత జైలులోనూ, విచారణ సందర్భంగానూ తనతో తారసపడ్డ పాత్రల, ప్రదేశాల స్వరూపాల గురించీ, 1942లో జెకోస్లవేకియాలో విధింపబడిన సైనిక శాసన పాలన గురించీ, జెకోస్లవేకియా కమ్యూనిస్టు పార్టీకి చెందిన కొంత చరిత్ర గురించీ జూలియస్ ఫ్యూజిక్ వివరించటం జరిగింది.

తనతోపాటు, తన తర్వాత అరెస్టయిన రాజకీయ ఖైదీలు చిత్రహింసలను భరిస్తూ కూడా తమ రహస్యాలను-యితరుల వివరాలను వెల్లడి చేయకుండా, మరణశిక్షకు సహితం ధైర్యంగా, హుందాగా, చిరునవ్వు నవ్వుతూ సంసిద్ధపడిన వివరాల ద్వారా తమ ఆదర్శాల-లక్ష్యాల సాధనకోసం ఉత్తమమైన కమ్యూనిస్టు ఏ రకంగా సంసిద్ధపడతారో జూలియస్ ఫ్యూజిక్ వివరిస్తారు. ఇవి ప్రపంచమంతటా వున్న కమ్యూనిస్టు విప్లవకారులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా వుంటాయి.

కొన్ని ఉదాహరణలను చూద్దాం:

జూలియస్ ఫ్యూజిక్‌ను అరెస్టు చేసినప్పుడు అతడు మారువేషంలో ప్రొఫెసర్ హొూరాక్ అనే మారుపేరు గల పత్రాలతో వ్యవహరిస్తున్నాడు. వాళ్ళు తన పేరు గురించి అడిగినప్పుడు తన పేరును ప్రొఫెసర్ హొూరాక్ అనే చెప్పాడు. కానీ వాళ్ళు పరిశీలించి అతడివి నకిలీ పత్రాలనీ, అతడి పేరు ఫ్యూజిక్ అనీ, అతడు కమ్యూనిస్టు పార్టీ పత్రిక అయిన 'రుదేప్రావో' సంపాదకుడనీ తమ హెడ్ క్వార్టర్సు ద్వారా తెల్సుకొంటారు. అతన్ని గుర్తింపచేయటంకోసం అతడి భార్య ఆగస్టినా ఫ్యూజిక్‌ను అతడి వద్దకు తీసుకువచ్చి ఇతడు నీకు తెలుసా? అని ప్రశ్నిస్తారు. అందుకు ఆమె ఎటువంటి తడబాటు పడకుండా, ముఖకవళికల్లో ఏ రకమయిన భావం వ్యక్తం చేయకుండా (చిత్రహింసల పాలైన తన భర్త ముఖం రక్తసిక్తంగా చూడటానికి బాధాకరంగా వున్నా) 'నాకు తెలియదు' అంటూ జవాబు చెప్పి, గతంలో తాను ప్రతిన చేసిన ప్రకారం తన మనస్సులోని బాధనూ, గెస్టపో ఏజెంట్ల పట్ల గల భయాన్నీ అలాగే దిగమ్రింగి, అతనిని గుర్తించకుండా నిలబడింది. వాస్తవానికి ఆమె అతడ్ని గుర్తుపట్టినట్టు చెప్పినా అదనంగా జరుగబోయే నష్టం ఏమీ లేదు. ఎందుకంటే అప్పటికే అతడికి సంబంధించిన వివరాలన్నింటినీ విద్రోహిగా మారిన సహచరుడు పోలీసులకు యిచ్చాడు.

ఫ్యూజిక్, ఆగస్టినాలిద్దరూ స్నేహితుల్లా ఒకరికొకరు సహాయం చేసుకొంటూ పార్టీ పని చేశారు. ప్రాణంలో, ప్రాణంగా మెలిగిన ఆ భార్యాభర్తలు అంకిత భావంతో పార్టీ పనిని కలసి సాగించారు. కష్ట, సుఖాలను యిరువురూ కలిసే భరించారు. అయినా ఫ్యూజిక్‌ను గుర్తించకపోయినట్లు నటించటమేకాక, వారిరువురూ భార్యాభర్తలన్న విషయం తెలిశాక, 1942 జూన్ నెలలో ఆగష్టినాను, జూలియస్ ఫ్యూజిక్ ముందు నిలబెట్టి, పోలీసుశాఖ అధిపతి ఆమెను తన భర్తను బ్రతిమాలి వివరాలన్నింటినీ చెప్పటానికి ఒప్పించమనీ, అతడు తను గురించి ఆలోచించకపోయినా, భార్య అయిన నీ గురించి అయినా కనీసం ఆలోచించాల్సిందిగా బ్రతిమాలమనీ ఆదేశిస్తాడు. ఒక గంటలోపులో ఏ విషయమూ చెప్పు. అప్పటికీ నీవు మొండిగా వ్యవహరిస్తే మీ యిద్దరినీ ఈ రాత్రే కాల్చి చంపి పారేస్తానని బెదిరిస్తాడు. అతడి బెదిరింపులకు భయపడని ఆగస్టినా "అయ్యా కమిస్సార్ గారూ, మీరు నన్ను ఆ రకంగా భయపెట్టలేరు. ఆయనకి మరణ శిక్ష అమలుజరిపితే, నాకూ మరణశిక్షను అమలుజరపండి.

(తరువాయి 8వ పేజీలో)

(4వ పేజీ తరువాయి)

అమలుచేసేటప్పుడు, దా~ తప్పిపోయి, ఒకసారి "అతివాదా"నికీ, మరోసారి మితవాదానికీ వూగుతాం. మన పని దెబ్బతింటుంది.

మరోసారి చెప్పనీయండి:

కార్మికవర్గ నాయకత్వాన విశాల ప్రజానీకం, సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికీ నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా నడిపే విప్లవం-ఇదీ చైనా యొక్క నూతన ప్రజాస్వామిక విప్లవం. ప్రస్తుత చారిత్రక దశలో, చైనా కమ్యూనిస్టు పార్టీ యొక్క సాధారణ విధానం, సాధారణ పంథా ఇదే.

పేద రైతాంగంపై ఆధారపడి, మధ్యతరగతి రైతులతో ఐక్యం కావడం, భూస్వామ్య దోపిడీ విధానాన్ని అంచెలంచెలుగా, ఒక విచక్షణాయుత మార్గంలో రద్దు చేయడం, వ్యవసాయిక ఉత్పత్తిని అభివృద్ధి చేయడం, నూతన ప్రజాస్వామిక విప్లవ కాలంలో భూసంస్కరణల పనిలో చైనా కమ్యూనిస్టు పార్టీ యొక్క సాధారణ పంథా, సాధారణ విధానం ఇదే. ◈

బహుళజాతి విదేశీ మందుల కంపెనీల సూపర్ లాభార్జన కోసం జరిపే ఔషధప్రయోగాలకు బలి పశువులు చేయబడుతున్న భారతదేశ ప్రజలు

మన దేశంలో అమలుజరుపబడుతున్న నయా ఉదారవాద సంస్కరణలలో భాగంగా మన దేశంలో ఔషధ ప్రయోగాల రంగం అమాంతంగా పెరిగిపోయింది. విదేశీ బహుళజాతి మందుల కంపెనీలు తాము ఉత్పత్తి చేయబోయే క్రొత్త మందులకు జరిపే ఔషధ ప్రయోగాలకు భారతదేశాన్ని కేంద్రంగా ఎంచుకొన్నాయి.

ఈ ఔషధ ప్రయోగాలను మన దేశంలో అమలు జరపటం వలన మన దేశం ఆర్థికంగా ఎంతో లాభపడుతుందనీ, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పింపబడతాయనీ, ఈ రకంగా ఈ ఔషధ ప్రయోగాలు భారతదేశ ఆర్థిక రంగాభివృద్ధికి ఎనలేని దోహదం చేస్తాయనీ పాలకులు ప్రచారం చేస్తున్నారు. విదేశీ కంపెనీలు తమ ఔషధ ప్రయోగాలను మన దేశంలో జరుపుకోవటాన్ని ప్రోత్సహిస్తున్నారు.

మన దేశంలోని వివిధ మందుల ప్రయోగశాలలు ఈ మందుల ప్రయోగాలకు అనువుగా తమ లేబరేటరీలను సంసిద్ధం చేసుకొన్నాయి. మన దేశంలోని పెద్ద మందుల కంపెనీలైన రాన్ బాక్సీ లేబరేటరీస్, నికోలస్ పిరమల్ గ్రూపుకు చెందిన వెల్ క్వెస్ట్, బైకాన్, మేట్రిక్స్ లేబరేటరీస్, రిలయన్స్ క్లినికల్ రిసెర్చ్ సర్వీస్, డయాగ్నోసెర్చ్, లోటస్ లేబరేటరీలు ఈ ఔషధ పరీక్షలను నిర్వహించటానికి తగిన సౌకర్యాలను, సదుపాయాలను కల్పించుకొన్నాయి. ఇవిగాక ప్రభుత్వరంగంలో నిర్వహింపబడుతున్న ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సు (ఎయిమ్స్)లాంటి ప్రసిద్ధ వైద్య సంస్థలు కూడా ఈ ఔషధ పరీక్షలను నిర్వహిస్తున్నాయి.

"భారతదేశంలో భిన్నమయిన జన్యువులు గల, అనేక రకముల రోగాలతో బాధపడుతున్న జనాభా అందుబాటులో వుండటం వలనా, దేశంలో పలు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు వున్నందువలన, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకొనే సమర్థులయిన వృత్తినిపుణులు వున్నందువలన, ఈ ఔషధ ప్రయోగాలు జరపటానికి భారతదేశాన్ని ఎంచుకొంటున్నాం" అంటూ విదేశీ బహుళజాతి మందుల కంపెనీలు తెలియచేస్తున్నాయి.

ఔషధ ప్రయోగాలను 'తక్కువ ఖర్చు'తో జరపటం సాధ్యమవుతుందన్న కారణంచేత విదేశీ బహుళజాతి మందుల కంపెనీలు మన దేశంలో ఆ ప్రయోగాలను జరుపుతున్నారు.

ఈ ఔషధ ప్రయోగాలను జరుపటానికి అవసరమయిన వృత్తినిపుణులను తయారు చేసుకోవటం కోసం పూనా విశ్వ విద్యాలయంలోని బయో ఇన్ఫార్మేటిక్స్ కేంద్రం ద్వారా హైదరాబాదు, చెన్నై, ఢిల్లీ, బెంగుళూరు, భువనేశ్వర్‌లలో పి.జి. సర్టిఫికేటు కోర్సులనూ, బెంగుళూరులోని లోటస్ క్లినికల్ రీసెర్చి అకాడమీ, న్యూఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్లినికల్ రిసెర్చిలు, పి.జి. కోర్సులను నిర్వహిస్తున్నాయి.

ఈ రకంగా భారతదేశంలో ఈ 'క్లినికల్ రిసెర్చి' రంగం (ఔషధ ప్రయోగాల రంగం) నెలకొని వుంది. ఈ ఔషధ ప్రయోగాలన్నది ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందింది. కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే (గత ఏడాది నుండి ఈ ఏడాది వరకు) ఈ విదేశీ ఔషధ ప్రయోగాలు 65% మేరకు పెరిగాయి. వచ్చే రెండేళ్ళలో ఈ 'ఔషధ ప్రయోగాల' వ్యాపారం విలువ ఎనిమిది వేల కోట్ల రూపాయల మేరకు పెరుగుతుందని అంచనా.

మన దేశాన్ని ఈ ప్రయోగాలు జరుపటానికి బహుళజాతి కంపెనీలు ఎందుకు ఎంచుకొన్నాయి?:

ఈ ఔషధ ప్రయోగాలను సంపన్న దేశాల్లో నిర్వహిస్తే అత్యంత వ్యయపూరితంగా వుంటుంది. అంతేకాక ఔషధ ప్రయోగదారులు పలు ఆంక్షలకు, కట్టుబాట్లకు లోబడి ఈ ప్రయోగాలను నిర్వహించాల్సి వుంటుంది. ప్రయోగ సందర్భంగా సంభవించే హానికి బాధ్యత వహించాల్సి వుంటుంది. మానవులపై జరిపే ఈ ఔషధ ప్రయోగాలను తమపై జరుపటానికి అక్కడి విద్యావంతులైన, విషయంపట్ల చైతన్యవంతులైన రోగులు అంత తేలిగ్గా అంగీకరించరు. ఒకవేళ ఎవరైనా అందుకు అంగీకరించినా ప్రయోగం నిర్వహించే సంస్థ పలు భద్రత, రక్షణ ఏర్పాట్లను, సదుపాయాలను చేయాల్సి వుంటుంది. ఈ ప్రయోగ సందర్భంగా ప్రయోగం చేయబడే రోగికి కలిగే ఎటువంటి హాని, నష్టం, ప్రాణ ప్రమాదాలకు కంపెనీ బాధ్యత వహించాల్సి ఉంటుంది. దానికి తోడు ప్రయోగాలను నిర్వహించే లేబరేటరీలకు, వృత్తి నిపుణులకు, డాక్టర్లకు భారీ ఎత్తున పారితోషికం చెల్లించాల్సి వుంటుంది. అందువల్ల, జైళ్లలో వున్న నల్లజాతి ప్రజలను ప్రలోభపెట్టి ప్రయోగాలు జరుపుతున్నారన్న వార్తలు కూడా వచ్చాయి.

అదే పేద దేశంగా ఉన్న మన దేశంలో అయితే ఎక్కువ మేరకు రోగులు పేదలు అయినందువలనా, విద్యావంతులు కాని- ఈ ఔషధ ప్రయోగాల గురించి తెలియని అమాయకులైనందున, యిక్కడి చట్టాలనూ, ఆంక్షలనూ ఉల్లంఘించటం తేలిక అయినందునా, చట్టాలను అమలుజరిపే నియంత్రణా సంస్థలను సునాయాసంగా లోబరుచుకో వీలున్నందునా, ప్రయోగాలకు గురయ్యే రోగులు మరణించినా, నష్టపోయినా వారికి భారీ ఎత్తు పరిహారాలు కాదు కదా కనీసంగా కూడా పరిహారం చెల్లించాల్సిన అవసరం లేనందునా, చెల్లించాల్సివచ్చినా ఆ చెల్లింపులను మాయోపాయంతో తప్పించుకొనే వీలున్నందునా, ప్రధానంగా యిక్కడి పాలకులూ, ప్రభుత్వమూ ప్రజల గురించి -వారి కష్టనష్టాలు పట్టించుకోనివారయినందునా, విదేశీ బహుళజాతి కంపెనీలు తమ ప్రయోగాలకు మన దేశాన్ని ఎంచుకోవటానికి కారణంగా ఉంది.

ఇవేవీ పట్టని భారత పాలకులు ఈ ప్రయోగాల వ్యాపార విలువ మొత్తాన్ని చూపిస్తూ, మన దేశం ఈ రకంగా కూడా ఆర్థికాభివృద్ధి చెందుతోందని ప్రచారం చేస్తూ దేశ ప్రజలను మభ్యపెడుతున్నారు.

ఈ రోజున సంపన్న దేశాలలో జంతువులపైన జరిగే ప్రయోగాలపైనే వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. అయినా మన దేశ ప్రభుత్వం యిటువంటి ప్రయోగాలను మానవులపై జరపటానికే ప్రోత్సహిస్తోంది.

క్లినికల్ పరీక్షల చరిత్ర:

1920-30 దశకాల్లో యూరోపు, అమెరికాలోని డాక్టర్లు-జర్మనీ తదితర యూరోపు దేశాల్లో అయితే యూదులపై, సంచార తెగలకు చెందినవారిపై, గిరిజనులపై యిటువంటి దుర్బలురపై ఈ ఔషధ ప్రయోగాలను నిర్వహించేవారు. అమెరికాలో అయితే నల్లజాతి వారైన నీగ్రోలపై, ఖైదీలపై ఈ ప్రయోగాలను జరిపేవారు. అయితే ఈ విషయం ఎయటకు వెల్లడయిన తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఈ రకంగా దుర్బలురపై ప్రయోగాలను జరుపటంపట్ల వ్యతిరేకత వ్యక్తమయింది. వివిధ దేశాలకు చెందిన వారు కూడి, ఈ ఔషధ పరీక్షలకు సంబంధించిన 10 నైతిక సూత్రాలను రూపొందించి 'న్యూ రెంబర్గు కోడ్' పేరిట, ఆ నైతిక సూత్రాలను 1948లో జెనీవాలో ప్రకటించారు. ఔషధ పరీక్షలకు నిర్ణయించిన ఈ సార్వత్రిక నైతిక సూత్రాలు అప్పటి నుండీ ఔషధ పరీక్షలకు మార్గదర్శక సూత్రాలయ్యాయి.

హెల్సింకీ ప్రకటన:

తిరిగి ఉత్తర అమెరికాకు, యూరోపు దేశాలకు చెందిన వైద్యుల బృందం, మరికొందరు యితర దేశాలకు చెందిన వైద్యులతో కూడి ప్రపంచ వైద్య సంఘం ఆధ్వర్యంలో 1964లో ఫిన్లండు దేశంలోని హెల్సింకీలో సమావేశమై ఔషధ ప్రయోగ నైతిక సూత్రాలను మరింతగా విస్తృతపరిచి, మార్గదర్శక సూత్రాలను ప్రకటించటం జరిగింది. ఆ ప్రకటనను హెల్సింకీ ప్రకటన అంటారు.

ఈ ప్రకటన, మానవులపై జరిపే ఔషధ ప్రయోగాలలో ఏమి చేయవచ్చో, ఏం చేయకూడదో నిర్ణయించటం జరిగింది. ఈ ప్రకటన, "ఔషధ ప్రయోగానికి గురిచేయబడే వ్యక్తికి ఆ పరీక్షల వలన జరుగబోయే అనుకూల, నష్టకర అంశాలను గురించి పూర్తిగా తెలియచెప్పాలనీ, అప్పుడు ఆ వ్యక్తి నుండి ఆ పరీక్షల్లో పాల్గొనటానికి అంగీకారం పొందాలనీ లేదా మైనరు కానీ, అవిద్యావంతులుకానీ అయిన పక్షంలో ఆ వ్యక్తులకు చెందిన చట్టబద్ధమయిన సంరక్షకుడి నుండి కానీ, సమూహ పెద్ద నుండి గానీ అంగీకారం పొందాలనీ" విస్పష్టంగా నిర్దేశించింది.

అప్పటి నుండి మానవులపై ఔషధ ప్రయోగాలు జరిపే వైద్యులూ, మందుల కంపెనీలూ, పరిశోధకులూ ఈ మార్గ దర్శక సూత్రాలనే అమలుజరుపుతూ వస్తున్నాయి.

తదుపరి కాలంలో 1974లో ఈ హెల్సింకీ ప్రకటనలోని సూత్రాలను సవరించటం జరిగింది. ఈ సవరణ ప్రకారం 'ఔషధ పరీక్షల నిర్వహణను' అనుమతించటానికిగానీ, తిరస్కరించటానికిగానీ అధికారం గల ఒక స్వతంత్ర నీతినియమాల కమిటీ లేదా సంస్థను ఏర్పాటు చేసి దాని నియంత్రణలో ఈ క్లినికల్ పరీక్షలు నిర్వహింపబడాలని నిర్ణయించటం జరిగింది. తిరిగి 1983, 1989లలో ఈ సూత్రాలకు మరిన్ని మెరుగైన సవరణలు చేయబడ్డాయి. ఔషధ ప్రయోగాలను ఏ రకంగా జరపాలో అన్న విషయంపై ఈ సవరణలు జరిగాయి. ప్రపంచమంతటా ఈ హెల్సింకీ సూత్రాలను అంగీకరించి, పాటించటం జరుగుతోంది.

ఔషధ ప్రయోగ నైతిక సూత్రాలను పాటించ నిరాకరిస్తున్న బహుళజాతి మందుల కంపెనీలు:

సూపర్ లాభాలను ఆర్జించటమే తమ ధ్యేయంగా పెట్టుకొన్న సామ్రాజ్యవాద బడా మందుల కంపెనీలకు ఈ ప్రయోగ నిర్వహణా నైతిక సూత్రాలు కంటగింపుగా తయారై. ఈ సూత్రాలను ఉల్లంఘించి లేదా తిరస్కరించి తమ 'మందుల' ప్రయోగాలను తమకు లాభదాయకంగా, అనుకూలంగా మలచుకొనేందుకు పూనుకొన్నాయి.

తమ మందులపై గల పేటెంట్ హక్కు మురిగి పోయినా ఆ మందులను అమ్ముకోగల కళలో ప్రావీణ్యం పొందిన సామ్రాజ్యవాద బడా మందుల కంపెనీలు, తమ ప్రయోగాల్లో తమ మందులకు అనుకూలమైన ఫలితాలు రాకపోయినా, నియంత్రణా వ్యవస్థల నుండి ఆ మందుకు అనుమతిని పొందే స్థాయికి అవి ఎదిగిపోయాయి. అవి నైతిక సూత్రాలను తిరగదోడి తమకు అనుకూలంగా సవరించే యత్నాలకు పాల్పడ్డాయి.

కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సి.ఐ.ఒ.ఎం.ఎస్.) అనే ఒక స్వతంత్ర సంస్థ, ఐక్యరాజ్య సమితికి చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థలు, హెల్సింకీ ప్రకటనకు సమాంతరంగా తమ స్వంత నైతిక సూత్రాలను మూడింటిని ప్రకటించాయి. సామ్రాజ్యవాద బడా మందుల కంపెనీల ప్రోద్బలంతో ఈ రకంగా సమాంతరమైన మార్గదర్శక సూత్రాలు వెల్లడయ్యాయని నాడు ఆరోపించబడింది.

1994లో హెచ్.ఐ.వి. రోగాన్ని తగ్గించటం కోసం మందు కనిపెట్టిన ఒక అమెరికన్ కంపెనీ ఆ మందు పరీక్షలను అమెరికాలోకాక ఒక అభివృద్ధి పొందుతున్న దేశంలో నిర్వహించతలపెట్టింది. హెల్సింకీ ప్రకటన ప్రకారం ముందుగా ఆ ఔషధాలు ప్రమాదకరమైనవి కావని, ఆ ప్రయోగం జరిపే కంపెనీ స్వంత దేశంలో నిర్ధారించబడాలి కానీ అలా చేయకుండా, ఆ కంపెనీ తన పరీక్షలను మరో దేశంలో జరుపతలబెట్టింది. ఈ రకంగా హెల్సింకీ ప్రకటన నిర్దేశించిన నైతిక సూత్రాల ప్రమాణాలకు భిన్నంగా ఆ మందుల కంపెనీ వ్యవహరించటం జరిగింది.

అప్పుడు వెంటనే 1996లో హెల్సింకీ ప్రకటనకు 4వ సారి ఈ విధమైన సవరణ చేయబడింది:

ప్రపంచంలో ఏ ప్రాంతంలో క్లినికల్ పరీక్షలు జరిపినా, ఆ ప్రయోగానికి గురయ్యే వ్యక్తులు, ఏ మాత్రం తగ్గించవీలు లేని నైతిక ప్రమాణాల చేత రక్షింపబడాలి.

2001వ సంవత్సరంలో అమెరికాకు చెందిన డిస్కవరీ లేబ్స్ మందుల కంపెనీ పిల్లల్లో హఠాత్తుగా ఊపిరితిత్తులు ఆగిపోయే వ్యాధిని తగ్గించే మందును లాటిన్ అమెరికా దేశంలోని పిల్లలపై ప్రయోగించి పరీక్షలు జరుపుతానని తెల్పింది. అప్పటికే ఆ రోగానికి వాడుతున్న అనేక మందులతో తన మందును పోల్చి పరీక్షించటానికి బదులు, ప్లెసిబోను కంట్రోలు బృందానికి చెందిన 325 మంది పిల్లలకు యివ్వపూనుకొంది. (ఒక మందును పరీక్షించేటపుడు, ఆ మందున ప్రయోగించే వారిని 2 బృందాలుగా విభజించి ఒకరికి ఆ మందును, మరొకరికి ప్లేసిబో అనే మామూలు మొక్కజొన్న పొడి టాబ్లెట్లును యిచ్చి రెండు బృందాల మధ్య వచ్చే లక్షణాల తేడాను బట్టి పోల్చి చూసి, పరీక్షింపబడే మందు ప్రభావాన్ని కనుగొంటారు). అయితే అమెరికాకు చెందిన ఆహారము మరియు మందుల నియంత్రణా మండలి (ఎఫ్.డి.ఎ.) ఆ మందు పరీక్షలకు నాడు అనుమతిని నిరాకరించి, హెల్సింకీ ప్రకటనకు అనుగుణంగా వ్యవహరించింది.

అయితే ఈ నైతిక సూత్రాల ప్రమాణాలను తాము పాటించటానికి వ్యతిరేకిస్తున్న బడా మందుల కంపెనీల ఒత్తిడితో ఎఫ్.డి.ఎ. తన వైఖరిలో మార్పు చేసుకొంది. అక్టోబరు 2008 నుండీ తాను హెల్సింకీ డిక్లరేషన్ ప్రకారం, నైతిక సూత్రాలను పాటించమని నిర్దేశించటం విరమించుకొంటాను; 'మంచి క్లినికల్ ఆచరణ పేరిట' తాను క్రొత్త ప్రమాణాలను అమలుజరుపుతాను అని ప్రకటించింది.

ఈ 'మంచి క్లినికల్ ఆచరణ' సూత్రాలు అన్నవాటిని సామ్రాజ్యవాద దేశాలైన అమెరికా, జపాన్, యూరోపియన్ దేశాలకు చెందిన బడా మందుల కంపెనీలు రూపొందించాయి.

ఈ రకంగా ఎఫ్.డి.ఎ. హెల్సింకీ ప్రకటన సూత్రాలను విసర్జించటం ద్వారా ప్రపంచంలో సగం మేరకు దూరంగా వున్న ఔషధ ప్రయోగానికి వినియోగించబడే ప్రజలపట్ల పాటించాల్సిన నైతిక సూత్రాల ప్రమాణాలను గాలికి వదిలివేయవచ్చు అన్న తప్పుడు సంకేతాన్ని వెల్లడించింది అంటూ 'జర్నల్ నేచర్' అనే వైద్య విషయాలను చర్చించే పత్రిక పేర్కొంది. ఈ రకంగా చట్టబద్ధంగా క్లినికల్ పరీక్షలకు గురిచేయబడే వ్యక్తుల రక్షణకు తూట్లు పొడవటం జరిగింది.

వెల్లడైన బూటకపు ఔషధ పరీక్షల ప్రహసనం:

ఈ క్లినికల్ పరీక్షలు నిర్వహించే కంపెనీలు, ఆ పరీక్షల ఫలితాలను యథాతథంగా నమోదుచేసి, అందరికీ అందుబాటులో వుంచాలి. తమ మందులకు అనుమతిని పొందేటప్పుడు, ఆ వివరాలను అనుమతి మంజూరుచేసే నియంత్రణాధికార సంస్థకు సమర్పించాలి.

కానీ బడా మందుల కంపెనీలు ఆ రకంగా తమ ప్రయోగ పరీక్షల వివరాలను నియంత్రణాధికార సంస్థల ముందు సమర్పించక, తమకు అనుకూలంగా వున్న ప్రయోగ ఫలితాలనే సమర్పిస్తూ, వ్యతిరేక ఫలితాలను సమర్పిస్తున్నాయనీ, కొన్ని ఈ సందర్భంగా అబద్ధపు ప్రయోగ ఫలితాలను సమాచారాన్ని రూపొందించి, తమ మందులకు అనుమతులు మంజూరు చేసుకొంటున్నాయి అనీ వెల్లడి చేస్తూ యిటీవల 'ప్లాస్ మెడిసిన్' అనే వైద్య సమాచార పత్రికలో బ్రిటన్‌లోని హల్ యూనివర్శిటీకి చెందిన మానసిక శాస్త్ర ఆచార్యుడైన డాక్టర్ ఇర్వింగ్ క్రిష్ ఒక వ్యాసాన్ని ప్రచురించారు:

ప్రొఫెసర్ డా॥ ఇర్విన్ అమెరికాలోనూ, కెనడాలోనుగల తన సహచరులతో మానసిక ఒత్తిడిని నివారించే మందుల ప్రయోగ ఫలితాల సమాచారాన్ని పరిశీలించి, కంపెనీలు తమ ఔషధాలకు చెందిన పరీక్షా ఫలితాల సమాచారాన్ని పూర్తిగా, సక్రమంగా నమోదు చేసి, పొందుపరచక మోసం చేశాయని నిర్ధారించాడు.

ఆయన యిప్పుడు మార్కెట్టులో అందుబాటులో వున్న అన్ని రకాల మందుల్నీ 5 వేల మంది రోగులపై ప్రయోగించి, ఆ మందుల్లో ఏ ఒక్కటీ కూడా 'మానసిక ఒత్తిడిని' నామమాత్రంగా కూడా తగ్గించవని నిర్ధారించాడు. తమ లాభార్జనకోసం బడా మందుల కంపెనీలు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేశాడు.

భారతదేశంలో జరుగుతున్న ఔషధ పరీక్షలు-వాటి స్వభావం:

భారతదేశంలో ఈ క్లినికల్ పరీక్షలు చేయటానికి మందులు కంపెనీలూ, వాటి నుండి ఈ పరీక్షలను నిర్వహించటానికి కాంట్రాక్టు పొందిన సంస్థల్నూ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చి, డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియాల నుండి అనుమతులను పొందాలి.

కానీ మనదేశంలో ఈ అనుమతులు మంజూరు చేసే అధికార వ్యవస్థలు కంపెనీలు పాటించాల్సిన నైతిక సూత్రాలకు, నైతిక ప్రమాణాలకూ ప్రాధాన్యతనివ్వకుండా, కేవలం ప్రభుత్వమూ-పాలకులూ యిచ్చినట్టుగానే క్లినికల్ పరీక్షల వ్యాపార అవకాశాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ పరీక్షల్లో భారతదేశ పౌరులు బలిపశువులుగా వాడబడుతున్నారన్న అంశాన్ని పట్టించుకోవటల్లేదు. అంతేకాక ఈ పరీక్షలు నిర్వహించిన సందర్భంగా పొందిన ఫలితాల సమాచారాన్ని, ప్రయోగాలు నిర్వహిస్తున్న కంపెనీలు సమర్పించకపోయినా, పాక్షిక వివరాలను మాత్రమే సమర్పిస్తున్నా ఆ కంపెనీల మందులకు అనుమతులు మంజూరు చేస్తూ, రోగుల ప్రాణాల రక్షణను పట్టించుకోవటల్లేదు. సామ్రాజ్యవాద బహుళ కంపెనీల ఒత్తిళ్ళకూ, ప్రలోభాలకూ లొంగి దేశ ప్రజలకు ద్రోహం చేస్తున్నారు.

ఈ ప్రయోగాలను నిర్వహించటానికి కాంట్రాక్టును పొందిన దేశీయ లేబరేటరీలు సహితం, తమ వ్యాపార లాభాలను పెంచుకొందుకే ప్రాధాన్యమిస్తూ, తమ దేశపు పేదలైన, అవిద్యావంతులైన, అమాయకులైన ప్రజలను సామ్రాజ్యవాద మందుల కంపెనీల ఔషధ ప్రయోగ బలిపీఠంపై వధించటానికి నిర్లజ్జగా తెగిస్తున్నారు.

దేశ ప్రజల ప్రయోజనాలను పట్టించుకోని ఉన్నత న్యాయస్థానాలు:

మనదేశంలోని న్యాయస్థానాలు సహితం, ఈ ఔషధ ప్రయోగాల్లో సామ్రాజ్యవాద కంపెనీలు అనుసరిస్తున్న మోసపూరిత పద్ధతులను పరిగణనలోకి తీసుకోకుండా, దేశ ప్రజలు చిక్కుకొంటున్న ప్రమాదాన్ని గుర్తించకుండా, కేవలం వ్యాపార సూత్రాల ఆధారంగా తీర్పులు

యివ్వటం జరుగుతోంది. ఆ రకంగా దేశ ప్రజలకు న్యాయం కూడా నిరాకరింపబడుతోంది.

ఇటీవలి కాలంలో (2005) బహుళజాతి కంపెనీ అయిన బడా విత్తన సంస్థ మోన్సాంటోకు అనుబంధంగా వున్న మహికో సంస్థ మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో జన్యుమార్పిడి వంగ, బెండ, ఆవ, బియ్యం విత్తనాల క్షేత్ర పరీక్షలు జరపటానికి అనుమతి పొందింది. ఆ క్షేత్ర పరీక్షల ఫలితాల సమాచారాన్నీ, వివరాలనూ తనకు యివ్వాల్సిందిగా, సమాచార చట్టం క్రింద దివ్య రఘురాం అనే వ్యక్తి బయోటెక్నాలజీ శాఖకు దరఖాస్తు పెట్టుకొన్నాడు. ఆ సమాచారం యివ్వవీలులేదని ఆ శాఖ తిరస్కరించింది. తనకు తానడిగిన వివరాలు యిప్పించమని, ఆయన రివ్యూ కమిటీకి అప్పీలు చేయటం జరిగింది. ఆ కమిటీ ఆ సమాచారం యివ్వమని ఆదేశించినా, బయో టెక్నాలజీ శాఖ ఆయనకు ఆ సమాచారం యివ్వలేదు. తిరిగి ఆయన అప్పీలుకు వెళ్ళగా ఆ రివ్యూ కమీషన్ ఆ సమాచారాన్ని యివ్వమని ఆదేశించింది.

రివ్యూ కమీషన్ ఆదేశాన్ని నిలుపుదల చేసి, రద్దుచేయాలని కోరుతూ మహికో కంపెనీ 4వ తేదీన హైకోర్టుకెక్కింది. "ఆ సమాచారం బయటపెట్టడం వలన తన వాణిజ్య ప్రయోజనాలకు హాని కలుగుతుందనీ, తన పోటీదారులు లాభపడతారనీ " ఆ కంపెనీ వాదన. తమ మేధో హక్కులకు నష్టం జరుగుతుందని ఆ కంపెనీ వాదించింది. ఈ విషయం తేల్చటంకోసం, హైకోర్టు రివ్యూ కమిటీ ఆదేశాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వు యిచ్చింది. సుప్రీంకోర్టు కొన్ని ఆంక్షలతో క్షేత్ర పరిశోధనలకు అనుమతిని అంగీకరించింది. ప్రజల ఆరోగ్యంపై హానికి సంబంధించిన ఆ క్షేత్ర పరీక్షల వివరాలు మాత్రం నేటికీ బహిర్గంగపరచటం జరుగలేదు.

కానీ ఆ జన్యుమార్పిడి పంటలను వాణిజ్యపరంగా మన దేశంలో అమ్ముకోవటానికి తత్సంబంధిత ప్రభుత్వ నియంత్రణ సంస్థ అనుమతులు యివ్వటానికి రంగం సిద్ధమయింది. జన్యుమార్పిడి విత్తనాల క్షేత్ర ప్రయోగాల ఫలితాల వివరాలు ప్రజానీకానికి అందుబాటులో లేకుండానే, ఆ పంటల వల్ల ఎటువంటి అనారోగ్యపు ప్రమాదం వినియోగదారులకు రాదని రూఢి కాకుండానే, ఆ పంటలు అమ్మకంలోకి రాబోతున్నాయి. ఒకసారి ఈ పంటలు ప్రజల ఆహారంలోకి చేరితే వాటివల్ల కలగబోయే హానిని నివారించటం అసాధ్యమయి పోతుంది. అయినా పాలకులూ, ప్రభుత్వాలూ బహుళజాతి కంపెనీల కనుకూలంగా, ప్రజల ప్రయోజనాలను పట్టించుకోకుండా వాటి క్షేత్ర ప్రయోగాలకూ, అమ్మకానికీ అనుమతులు మంజూరు చేస్తున్నారు.

ఔషధ ప్రయోగాల్లో నీతిబాహ్యత:

దేశీయ కంపెనీల కాంట్రాక్టుల ద్వారా, సామ్రాజ్యవాద బడా మందుల కంపెనీలు మన దేశంలో ఈ ఔషధ ప్రయోగాలు అన్నవాటిని నిర్వహింప చేస్తున్నాయి. దేశ పౌరుల మీద ఈ పరీక్షలను నిర్వహింప చేస్తున్నాయి. భారతదేశాన్ని క్లినికల్ పరీక్షలకు వేదికగా మార్చుకొన్న విదేశీ కంపెనీలు తమకు అనువైన నగరాలుగా హైదరాబాదు, అహ్మదాబాదులను ఎంచుకొన్నాయి.

తాము నిర్వహింపచేసే క్లినికల్ పరీక్షలలో ఎటువంటి నైతిక ప్రమాణాలు పాటించకుండా, పరీక్షల కోసం వినియోగించుకొనే భారత పౌరుల ప్రాణాలతో, ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. మందుల విష ప్రమాదం వలన నష్టపోయే, మరణించే వ్యక్తులకు ఎటువంటి రక్షణా, పరిహారం అనేవి చెల్లించకుండా ప్రయోగాల్లో వాడుకొన్న జనాన్ని నడిరోడ్డుపై నిర్ధాక్షిణ్యంగా వదలి వేస్తున్నాయి. తాము ఎంచుకొన్న రోగులకు, వారిపై ఔషధ ప్రయోగం చేస్తున్నామన్న విషయాన్ని చెప్పటల్లేదు. ఇక వారి నుండి అనుమతి పొందటం (వారికి కష్ట, నష్టాలను) అన్న ప్రసక్తే లేకుండా పోయింది. ఆ మధ్యన, హైదరాబాదులోని జివికెబయో అన్న క్లినికల్ పరీక్షలు జరిపే లెబరేటరీ కూలీల అడ్డాలోనున్న కూలీలను, వారికి ఏ విషయం తెలుపకుండానే, వారిపై ఔషధ ప్రయోగం జరుపుతున్న విషయం బయల్పడి అల్లరైంది.

అయినా అటు ప్రభుత్వ నియంత్రణ సంస్థలుకానీ, యిటు విదేశీ కంపెనీలకు కాంట్రాక్టు పద్ధతి ద్వారా క్లినికల్ పరీక్షలు నిర్వహించిపెట్టే దేశీయ లెబరేటరీలు కానీ, ఆఖరుకు క్లినికల్ పరీక్షలను నిర్వహింపచేసే విదేశీ కంపెనీలుకాని నైతిక ప్రమాణాలను అమలుజరిపి పాటించే యత్నానికి పూనుకోవటల్లేదు. ఉన్న నిబంధనలనూ పట్టించుకోవటం లేదు. ఆ రకంగా భారత దేశాన్ని 'కొత్త సామ్రాజ్యవాదుల' బలిపీఠంగా మార్చటం జరిగింది.

ఇటీవల 'సైంటిస్టు' పత్రికలో ఒకరు 'గాంధీజీ కనుక జీవించి ఉంటే, ఈ ప్రయోగ కేంద్రాల ముందర సత్యాగ్రహం నిర్వహించి వుండేవారని' వ్యాఖ్యానించటాన్ని బట్టి చూస్తే 'ఔషధ ప్రయోగాలు' అనేవి ఎంతటి ఘోరంగా తయారయ్యాయో అర్థమవుతుంది.

దేశ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించి, దేశ ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వం క్లినికల్ పరీక్షలను నియంత్రించటానికి కట్టుదిట్టమైన నిబంధనలను చేయటానికి బదులు, విదేశీ సంస్థలకు-సామ్రాజ్యవాదానికి తన దళారీ తనాన్ని నిరూపించుకుంటూ, నిబంధనల సరళీకరణ అన్న సాకుతో "విదేశీ ఔషధ సంస్థలు మన దేశంలో ప్రయోగాలు నిర్వహించటానికి ముందు, తమ మాతృదేశంలో ఆ పరీక్ష చేయబడే మందులు సురక్షితమైనవి అని నిర్ధారణ చేసుకొని వుండాలి" అన్న నిబంధనను 2005 సంవత్సరంలో రద్దు చేయటం జరిగింది. మన పాలకులకు, పాలకవర్గాలకూ, ప్రభుత్వాలకూ ప్రజల ప్రయోజనాలు ఎంత మాత్రమూ పట్టవు అనటానికి యింత కంటే నిదర్శనమేమి కావాలి?

నైతిక ప్రమాణాలను పాటించక పసి పిల్లలను బలిపశువులుగా తీసుకొన్న ఎయిమ్స్:

'ఉదయ్ ఫౌండేషన్ ఫర్ కాన్‌జెనిటల్ ఢిఫెక్ట్స్ అండ్ రేర్ బ్లడ్ గ్రూప్స్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడైన రాహుల్ వర్మ, సమాచార చట్టం క్రింద-అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో జరుపుతున్న ఔషధ ప్రయోగాలను గురించి అడిగిన సమాచారానికి, ఆ సంస్థ కొంత సమాచారాన్ని అందచేసింది.

ఆ సంస్థ యొక్క పిల్లల విభాగం గత రెండున్నర సంవత్సరాలుగా ఔషధ ప్రయోగ పరీక్షలు నిర్వహించిందనీ, ఆ క్లినికల్ పరీక్షలను 4,142 మంది పసిపిల్లలపై నిర్వహించిందనీ, 42 జతల పరీక్షలు నిర్వహించిందనీ, మందులు ప్రయోగించిన పసివారిలో 2,728 మంది సంవత్సరంలోపు పసి కూనలేననీ, యిలా ఔషధ ప్రయోగానికి గురయిన పసిపిల్లల్లో, పరీక్షల క్రమంలో 49 మంది మరణించారనీ ఎయిమ్స్ తెలియజేసింది.

అయితే మరణించిన పిల్లల వయస్సులను కానీ, వారు ఏ లింగానికి చెందినవారోకానీ, వారి మరణానికి గల కారణాలు ఏమిటి అనే విషయంకానీ ఆ సమాచారంలో పేర్కొనటం జరుగలేదు.

ఈ క్లినికల్ పరీక్షలకు ఎయిమ్స్‌తోపాటు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చి, డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, అమెరికాకు చెందిన జాన్స్ హాప్‌కిన్స్ బ్లూమ్‌బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్తులు నిధులను సమకూర్చాయట.

ఈ క్లినికల్ పరీక్షలకు తమ సంస్థకు చెందిన (ఏయిమ్స్‌కు) నైతిక కమిటీ, ఐ.సి.ఎం.ఆర్. డి.బి.టి.లకు చెందిన నైతిక కమిటీలు అనుమతులను మంజూరు చేసి, అంగీకరించాయట.

ఐతే ఈ రకంగా పసిపిల్లలపై ఈ ఔషధ ప్రయోగ పరీక్షలు జరపటంలో ఎయిమ్స్ పలు నైతిక ప్రమాణాలను పాటించలేదు అని అర్థమవుతోంది.

విచారించినా, ఈ పసిపిల్లలపై జరిపిన పరీక్షల్లో, ఓల్మెసార్టన్, వాల్సర్టన్ అనే ఔషధాలను ప్రయోగించారట. ఈ ఔషధాలు అధిక రక్తపోటును తగ్గించటంకోసం ఉద్దేశింపబడినవి. ఈ మందులను 18 సంవత్సరాల వయస్సులోపు వారిపై యింత వరకూ ప్రయోగించటం జరుగలేదు. ఇప్పుడు మనదేశంలో ఈ పసిపిల్లలపై ఆ ఔషధాలను ఎందుకు పరీక్షించాల్సి వచ్చింది అన్న దానికి సరయిన సమాధానం లేదు.

మన దేశంలో 1-16 సంవత్సరాల వయస్సు పిల్లల్లో బి.పి.తో బాధపడే రోగగ్రస్తులున్నారా? ఉంటే ఎందరున్నారు? అలా వున్న వారిపై ఈ ఔషదాల ప్రయోగాలు జరుపాల్సిన అవసరం ఉందా? అన్న వాటికి సరయిన సమాధానం లేదు. ఈ ప్రయోగాలను అమెరికాలో జరుపకుండా జాన్ హాప్‌కిన్స్ ఇన్‌స్టిట్యూట్, ప్రపంచ ఆరోగ్య సంస్థలాంటి సంస్థలు భారతదేశాన్ని ఎందుకు ఎందచుకోవాల్సి వచ్చిందో? అన్నదానికి తగు జవాబు లేదు.

పరీక్షల్లో ఔషధాన్ని ప్రయోగింపబడ్డ పసిపిల్లల చట్టబద్ధమయిన సంరక్షకులకుకానీ, తల్లిదండ్రులకుగానీ ఈ పరీక్షల వివరాలు, యిందువల్ల జరుగబోయే ఔషధ దుష్ప్రభావాలు, హానిని గురించి వివరించి వారి నుండి అనుమతులను పొందిన దాఖలాలు లేవు.

ఈ పరీక్షల కోసం ఎంపిక చేయబడ్డ బాలలకు జరిగే హాని, నష్టం, ప్రాణనష్టాలకు ఇన్స్యూరెన్సులు చేయటం జరగలేదు.

పరీక్షల స్వభావాన్నిబట్టి వివిధ నియంత్రణ సంస్థల నుండి అనుమతులు సంపాదించవలసి ఉంటుంది. ఆఖరుకు ఈ ప్రయోగాల్లో జంతువులపై ప్రయోగాలు జరిపినా "ప్రయోగ జంతువుల జాగ్రత్త, నిరోధింపు, నియంత్రణ మండలిలాంటి 'నోడల్' ఏజెన్సీల నుండి అనుమతులు పొందాల్సి వుండగా, ఎయిమ్స్ మాత్రం ఈ పసిపిల్లలపై ప్రయోగాలు జరుపటానికి నియంత్రణ సంస్థల నుండి అనుమతులు తీసుకోకపోవటం అన్నది ఉద్దేశ్యపూర్వకంగా నైతిక ప్రమాణాలను పాటించ నిరాకరించటమే జరుగుతుంది. ఈ రకంగా నైతిక ప్రమాణాలను పాటించకుండా పరీక్షలు నిర్వహించి, ఆ పరీక్షలకు గురయి మరణించిన 49 పసిపిల్లలూ, ప్రయోగించిన మందుల వలన కాదనీ, వేరే రోగాలున్నందువలన మరణించారనీ ఎయిమ్స్ అధికారులు బుకాయిస్తున్నారు. క్లినికల్ పరీక్షలను సక్రమంగా నియంత్రింపచేసి, పౌరుల ప్రాణాలు కాపాడవల్సిన కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి రామదాస్ అందుకు బదులు, ఎయిమ్స్ అధికారుల వాదనలనే సమర్థిస్తూ ఆడపిల్లల మరణాలను సమర్థిస్తున్నాడు.

మనదేశ ప్రజల పేదరికాన్నీ, అసహాయతనూ, అమాయకత్వాన్నీ ఈ రకంగా-దేశంలోని దళారీ ప్రయోగశాలల, సంస్థల ఆసరాతో సామ్రాజ్యవాద విదేశీ మందుల కంపెనీలు తమ లాభార్జన కోసం కొల్లగొట్టుకు పోవటం జరుగుతోంది. మనదేశ పౌరులను ప్రయోగ బలిపీఠంపై వధించటం జరుగుతోంది.

ప్రభుత్వ నిర్వహణలో వున్న ప్రతిష్టాత్మకమైన వైద్య సంస్థలే ఈ రకంగా లాభార్జనకోసం యింతటి దారుణానికీ, దుర్మార్గానికీ పాల్పడుతూ వుంటే, యిక ప్రైవేటు లేబరేటరీలు, పరిశోధనా సంస్థలూ ఎంతటి దారుణానికి పాల్పడుతున్నాయనేది చెప్పనవసరం లేదు.

మన దేశంలో జరిగే క్లినికల్ పరీక్షల వ్యాపారంలో ఈ రకంగా సవాలక్ష దారుణాలు, అక్రమాలు జరుగుతున్నాయి. నీతిబాహ్యంగా వ్యాపారాభివృద్ధి కోసం మనదేశపు ప్రజానీకాన్ని బలి తీసుకోవటం జరుగుతోంది.

క్లినికల్ పరీక్షల పేరిట జరుగుతున్న ఈ దారుణం గురించి ప్రజలను చైతన్యపరచి, అప్రమత్తం చేయాల్సి వుంది. సామ్రాజ్యవాద మందుల కంపెనీలకు దళారీలుగా మారి ఔషధ ప్రయోగాలలో నైతిక ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నవారికి తోడ్పాటును, అవకాశాలను యిస్తున్న ప్రభుత్వ నియంత్రణ సంస్థల అక్రమ వైఖరులకు వ్యతిరేకంగా ప్రజలను ఆందోళనకు సమాయత్తం చేయాల్సి వుంది.

బలమైన ప్రజా ఉద్యమం ద్వారా క్లినికల్ పరీక్షలపై నియంత్రణను, దేశ ప్రజల ప్రయోజనాలను పరిరక్షణను సాధించటం సాధ్యమవుతుంది.

- పాణి

పని ప్రదేశాలలో, ఉపాధి యోగ్యతా అవకాశాల్లో స్త్రీ, పురుష కార్మికుల మధ్య అసమానతలు

ఇటీవలి కాలంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ పని ప్రదేశాలలో స్త్రీ, పురుష కార్మికుల మధ్య సమానత్వాన్ని పెంపొందింపచేయాలనే, ఒక ఏడాదిపాటు కొనసాగే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇదే అంశంపై 2009 జూన్‌లో జరుగబోయే, అంతర్జాతీయ కార్మిక సంస్థ యొక్క విధానాలను నిర్ణయించే శాఖ యొక్క సమావేశంలో జరుగబోయే చర్చకోసం ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించటంకోసం ఈ ప్రచార కార్యక్రమానికి పూనుకొంది.

ఈ సందర్భంగా, మహిళల ప్రపంచ ఉపాధి ధోరణులనే ఒక నివేదికను అంతర్జాతీయ కార్మిక సంస్థ విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం గత దశాబ్ద కాలంలో ప్రపంచమంతటా 20 కోట్ల మంది మహిళలు లేబరు మార్కెట్టులోకి ప్రవేశించారనీ, అయినప్పటికీ వారు పురుషులుకన్నా తక్కువ నాణ్యమైన, తక్కువ వేతనాలు చెల్లించే, ఎక్కువ అభద్రతతో కూడిన, ఎటువంటి సామాజిక భద్రతాలేని, మవులిక హక్కులు లేని ఉద్యోగాలు చేస్తున్నారనీ, ఎక్కువ మంది మహిళలు అనియతరంగంలోనో లేక స్వయంఉపాధి (ఇల్లు కేంద్రంగా పనిచేసే పనులు) పనులు చేస్తూనో జీవిస్తున్నారని ఈ కమిటీలో పేర్కొనటం జరిగింది. వీరు ప్రధానంగా ఉత్పత్తి రంగంలోకాక ఉత్పత్తి రంగానికి సంబంధించిన అనుబంధ రంగాల్లోనూ, సేవా రంగాల్లోనూ పని చేస్తున్నారని ఈ నివేదిక తెలియచేస్తోంది.

సగటు నిరుద్యోగ శాతం పురుషుల్లో 5.7% మేరకు ఉంటే, అది మహిళల్లో 6.4%గా వుందనీ, ప్రపంచమంతటి జనాభాలో పని చేస్తున్న పురుషుల శాతం 74.3% వుండగా, మహిళల శాతం కేవలం 49.1%గానే ఉంది. ఇప్పటికీ లేబరు మార్కెట్లో మహిళలకు సముచితమైన ఉపాధి (డీసెంట్ వర్కు)లోకి ప్రవేశించేందుకు కావల్సిన అర్హత, స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం లేదని ఆ రిపోర్టు తెలియచేస్తోంది.

ఏ ప్రాంతం ఎంత కాలం పేదరికంతో వుంటే, అంత కాలంపాటు ఆ ప్రాంతాల్లో పనిచేసే మహిళలు కుటుంబానికి తోడ్పాటు యిచ్చే కార్మికులుగానో, స్వయంఉపాధి కార్మికులుగానో వుంటారని ఆ రిపోర్టు తెలియచెప్పింది.. మన దేశంలో కూడా గత దశాబ్ద కాలంలో మహిళలు గణనీయమైన సంఖ్యలో శ్రామిక మార్కెట్టులోకి వచ్చారు. వీరంతా వంటవారిగానో, పని మనుషులుగానో, ఐ.టి. ఆధార సేవారంగంలోనో, వస్త్ర-దుస్తుల ఉత్పత్తి రంగంలోనో, ఎలక్ట్రానిక్స్, మందుల కంపెనీల్లో ఎగుమతి చేయటానికి జరిగే ఉత్పత్తికి అనుబంధంగా జరిగే సహాయక పని రంగంలోనో పనులకు కుదురుతున్నారు. సబ్ కాంట్రాక్టు రంగంలో పీస్ రేటు కార్మికులుగానో, స్వయంఉపాధి కార్మికులుగానో వీరు పనులకు కుదురుకొన్నారు.

నేటి శ్రామిక మార్కెట్లో గణనీయంగా పెరిగిన ఈ మహిళా శ్రామికుల సంఖ్యను చూపిస్తూ, ఈ రకంగా వీరు మహిళా సాధికారతను సాధించినట్లు పాలకులు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఆచరణలో సంక్షోభంలో కూరుకు పోయిన వ్యవసాయిక రంగం నుండి ఈ మహిళా కార్మికులు యితర రంగాలకు తరలినవారే. మారిన పని పరిస్థితులకు అనుగుణంగా తమను తాము వీరంతా మలుచుకుంటున్నవారే. అందుకు సంసిద్ధపడుతున్నవారే. అయినా వీరికి తగు విద్యా, వృత్తిపరమైన శిక్షణా వకాశాలు లేకపోవటతో వీరు ద్వితీయస్థాయి కార్మికులుగానే మనుగడ సాగిస్తున్నారు.

మన దేశంలోనేకాక, పలు దేశాల్లో యిప్పటికీ స్త్రీ, పురుషుల మధ్య వేతన వ్యత్యాసం (సమాన పనికి) కొనసాగుతూనే వుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం ప్రపంచమంతటా మహిళా శ్రామికులు, పురుష కార్మికులు ఒక గంటకు పొందే ఆదాయంలో 75% మాత్రమే పొందుతున్నారు.

ఉత్పాదక రంగంలో పురుషులతోపాటు, స్త్రీలకు సమాన పని అవకాశాలు లేకపోవటంతో మొదలై పని ప్రదేశాల్లోని అసమానత, వేతనాల్లో వ్యత్యాస రూపంలో, సంఘంగా సంఘటితపడటానికి నిరాకరించే రూపంలో, పని గంటల్లో, పని నాణ్యతలో వ్యత్యాస రూపంలో, మహిళా కార్మికులకు పని స్వభావరీత్యా సంభవించే ఆపదల నుండి రక్షణ లేమి రూపంలో, తగు ఆర్థిక స్వేచ్ఛలేని రూపంలో, పని ప్రదేశంలో లింగ వివక్షతకు-లైంగిక వేధింపులకు గురికాబడే రూపంలో మహిళా శ్రామికులు అసమానత్వాన్ని అనుభవిస్తున్నారు.

పెట్టుబడిదారీ ఉదారవాద ఆర్థిక విధానాల అమలు ఫలితంగా, దేశ ఆర్థిక రంగంలో వృద్ధి జరిగిందని చెప్పబడుతున్నా, మహిళా కార్మికులకు ఈ ఆర్థికవృద్ధి అనేది వారిని పురుష కార్మికులతోపాటు సమానత్వ స్థాయికి తీసుకురాలేకపోగా, వారి మధ్య అసమానత్వాన్ని మరింతగా పెంచి వేయటం జరిగింది.

మన దేశపు సాంప్రదాయక వ్యవసాయిక ఆర్థిక విధానం, మార్కెట్టు అనుకూల ఆర్థిక విధానంగా పరివర్తన చెంది, గణనీయమైన సంఖ్యలో శ్రామిక మార్కెట్టులోకి మహిళలు ప్రవేశించినా, మహిళా, పురుష శ్రామికుల మధ్య అంతరాలు-అసమానతలు పెరిగిపోతూనే వున్నాయి. ఇదే రకమయిన అసమానతలు మన దేశంలాంటి అభివృద్ధి చెందుతున్న వ్యవసాయిక దేశాల్లోనేకాక, అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల్లో కొనసాగటాన్నిబట్టి చూస్తే, ప్రపంచీకరణ అనబడేది, ఉదారవాద ఆర్థిక విధానాలు అన్నవి మహిళలను అభివృద్ధి పరచి, వారికి సాధికారతను, పురుషులతో సమానత్వాన్ని కల్పించటానికి ఉద్దేశింపబడినవి కావు అనీ, ఆ విధానాలు వాస్తవంగా పని ప్రదేశాల్లో, ఉపాధి అవకాశాల్లో స్త్రీ, పురుష శ్రామికుల మధ్య సమానస్థాయినీ, సమాన అవకాశాలనూ కల్పించవని అర్థమవుతుంది.

ఆర్థికాభివృద్ధి పేరిట, ఆర్థిక వృద్ధిపేరిట అమలు జరుపబడే ఈ విధానాలు, స్త్రీల యొక్క శ్రమశక్తిని కారుచౌకగా, యధేచ్ఛగా దోపిడీ చేసుకోవటానికి ఉద్దేశింపబడినవే అని అనుభవంలో అర్థమవుతోంది.

సూపర్ లాభాల ఆర్జన, నిరాఘాటమైన శ్రమ దోపిడీ అన్న ప్రాతిపదికపై నిర్వహించే ప్రస్తుత నయా ఉదారవాద దోపిడీ ఆర్థిక వ్యవస్థలో స్త్రీ, పురుష శ్రామికుల మధ్య నిజమైన సమానత్వాన్ని సాధించగలుగుతామని కానీ, స్త్రీల సాధికారతను సాధించటం సాధ్యం అవుతుందని చెప్పటంకానీ, భావించటం కానీ వాస్తవ విరుద్ధమైన, వంచన-ఆత్మవంచన అవుతుంది.

కేవలం దోపిడీ రహిత సోషలిస్టు సమాజంలోనే స్త్రీ, పురుష శ్రామికుల మధ్య సమానత్వం సాధ్యమవుతుంది. వర్గ చైతన్యాన్ని పొంది, వర్గ పోరాటాన్ని చేపట్టి దోపిడీ వ్యవస్థను కూలద్రోసి, సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేయటానికి స్త్రీ, పురుష శ్రామికులు సమాయత్తం కావటంద్వారా పని ప్రదేశాల్లో అసమానత్వాన్ని అంతంచేసే వైపు పయనించ గలుగుతారు. ◈

జూలియస్ ఫ్యూజిక్ – (5వ పేజీ తరువాయి)

ఇదే నా యొక్క **ఆఖరి కోరిక అంటూ** జవాబిస్తుంది. **ఆ రకంగా అద్భుత ధైర్యంతో** వ్యవహరించి తమకు **లొంగని [illegible]ను** 1943 మే 19వ తేదీన పోలెండు **లేబర్ క్యాంపులో** పనిచేయించు కోవటానికి జైలు నుండి ఈడ్చుకొనిపోయారు. తమ లక్ష్యసాధనకోసం కమ్యూనిస్టులు తమ ప్రాణాలను ఎంతటి తృణప్రాయంగా పరిగణిస్తారో యీ ఉదంతం తెలియచేస్తోంది.

★★★

జూలియస్ ఫ్యూజిక్‌ను జెలినెక్ దంపతులయిన జోసఫ్, మేరీల యింట్లో అరెస్టు చేయటం జరిగింది. ఆయనతోపాటు ఆ దంపతులను కూడా అరెస్టు చేయటం జరిగింది. వారిద్దరూ తమను ఎన్ని చిత్రహింసలు పెట్టినా భయపడక పోలీసులకు ఒక్క వివరాన్ని కూడా చెప్పకుండా ధైర్యంగా నిలబడ్డారు. వారిని చితకబాదినా ఒక్క ముక్క కూడా బయటపెట్టలేదు. ఒక రోజున ఆ దంపతులిద్దరినీ విడివిడిగా జైలు నుండి వేరు వేరు ప్రాంతాలకు తీసుకుపోయారు. తర్వాత వారు ఏమయ్యారో వివరాలు తెలియరాలేదు.

తనను తీసుకుపోయేటప్పుడు మేరీ జూలియస్ ఫ్యూజిక్‌తో "బయటనున్నవారికి (జైలు) నా గురించి దుఃఖించవద్దని చెప్పండి. నాకు జరిగిన దాన్ని చూసి ఎవ్వరూ భయపడనవసరంలేదు. ఒక కార్మికురాలిగా నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాను. అదే విధంగా ఒక కార్మికురాలిగానే నేను మరణిస్తాను" అంటూ చెప్పింది. ఇతరుల యిళ్ళలో గృహసేవకురాలిగా పనిచేస్తూ, తాను వర్గ కర్తవ్య నిర్వహణలో చేసిన కృషికి ఆమె ఈ రకంగా గర్వపడింది. వర్గ కర్తవ్య నిర్వహణలో మరణించటాన్ని ఆమె ఎంతో ఘన విషయంగా భావించింది.

★★★

జెలినెక్ దంపతులు నివసించిన భవనంలోనే, వారి ప్రక్కవాటాలోనే వ్యిషలి దంపతులు నివసించేవారు. వారి పేర్లు కూడా జోసఫ్, మేరీలే. జ్యూలియస్ ఫ్యూజిక్ అరెస్టయిన కొద్దిరోజులకు జోసప్ వ్యిషలీని కూడా అరెస్టు చేశారు. తన స్నేహితునికి రాజకీయ కరపత్రాలను పంచినందుకుగాను అతడ్ని అరెస్టు చేశారు. అతడి నుంచి పార్టీ సెంట్రల్ కమిటీలో అరెస్టు కాకుండా మిగిలిన వారి గురించి వివరాలు రాబట్టడంకోసం అతడ్ని తీవ్రంగా కొట్టారు. అయినా అతడు పెదవి విప్పలేదు. అప్పుడు అతడ్ని పోలెండులోని లేబర్ క్యాంపుకు తరలించారు. తర్వాత అతడి భార్య మేరీని అరెస్టు చేశారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ వుండటం వలన ఆమెను కొట్టలేదుకానీ, ఆమెను మానసికంగా చిత్రహింస పెట్టారు. "చూడు. లేబరు క్యాంపులో పనిచేయటం ఎంతో కష్టమైన పని. నీ భర్త ఆ పనికి తట్టుకోలేక చచ్చిపోతాడు. ఈ పెద్ద వయస్సులో నీకు మరో మొగుడెక్కడ దొరుకుతాడు?. అందువలన నీకు తెల్సిన విషయాలన్నీ చెప్పేయ్!. మేము నీ భర్తను యిప్పటికిప్పుడే తిరిగి తీసుకువస్తాము" అంటూ పోలీసులు ఆమెకు చెప్పారు. "నిజమే. ఆయన అక్కడ చచ్చిపోతాడు. నేను ఆ మరణానంతరం ఒంటరిగానే మిగిలిపోతాను. ఈ వయస్సులో మరో భర్త దొరకడు. అయితే నేను వారడిగిన రహస్యాలన్నీ వాళ్ళకి చెప్పి మూల్యం చెల్లించటం ద్వారా నేను ఆయన్ని రక్షించవచ్చు. కానీ నేను వాళ్ళకి అటువంటి మూల్యం చెల్లించను. ఆ రకంగా తిరిగి నా దగ్గరకి వచ్చేవాడు నా భర్త కాబోడు" అంటూ ఆలోచించిన మేరీ ఒక్క మాట కూడా వాళ్ళకి చెప్పలేదు. తర్వాత ఆమెను గెస్టాపో ఎక్కడికో తరలించి మాయం చేశారు. ఈ రకంగా తన పార్టీ రహస్యాలను కాపాడేందుకు, తన భర్తను కోల్పోవటానికే నిర్ణయించు కొన్న మేరీ వ్యిషలీ యొక్క త్యాగం అనంతమయినది.

★★★

మిలోష్కు క్రాన్‌స్కీ అనే విప్లవకారుణ్ణి, అక్టోబరు 1942లో అరెస్టు చేసి జైలుకి తీసుకువచ్చారు. చిత్రహింసలుపెట్టినా, ఏకాంతపు గదిలో నిర్బంధించినా ఆయన లొంగలేదు. అతడ్ని విచారణ గదికి తీసుకు వచ్చారు. మరణశిక్ష విధింపబడే అవకాశం ఉంది. అయినా ఆయన భయపడకుండా, తొణుకూ బెణుకూ లేకుండా, తనకు వెనుక నుంచొని వున్న కాపలా దారుడైన గార్డుకి ఏదో విషయాన్ని వివరిస్తూ, జ్యూలియస్ ఫ్యూజిక్‌ను చూసి వీడ్కోలుగా తలను విసురుతూ తిరిగి ఆ గార్డుతో "మీరు యిలా చేయటం అన్నది మీకు ఏ రకంగానూ తోడ్పడదు. మాలో ఇంకా అనేక మంది కూలిపోవచ్చు కానీ అంతిమంగా ఓడిపోయేది మాత్రం మీరే" అంటూ చెప్పటాన్ని బట్టి చూస్తే, అంతిమంగా ఫాసిజం ఓటమిపట్ల, కమ్యూనిజం విజయంపట్ల వారు ఎంత ఖచ్చితమైన దృఢవిశ్వాసంతో వున్నారో అర్థమవు తుంది. ఈ నోట్సులో ఇలా ధైర్యచిత్తులైన విప్లవకారులు పలువురు మనకు పరిచయమౌతారు.

★★★

నాడూ, నేడూ కూడా మేడే కార్మికవర్గానికి స్ఫూర్తిదాయకమయిన పండుగ దినమే!. 1943 మే 1వ తేదీన జ్యూలియస్ ఫ్యూజిక్ జైలులోనే వున్నాడు. అతడు తాను గతంలో మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో చూసినట్లుగా లక్షల మంది కార్మికులు ఆనాడు కవాతు చేయక పోయినా, ఆ మేడే రోజున కేవలం కొద్దిమంది మాత్రమే (ఒక పుంజీడు మంది) ప్రేగ్ నగర వీధుల్లో మేడే ఊరేగింపు జరిపారు. అయినా ఈ కొద్దిమంది జరిపిన ఊరేగింపుకు గల ప్రాధాన్యతను జ్యూలియస్ ఫ్యూజిక్ తన 'నోట్సు'లో వివరించాడు. 'నూతన శక్తులు భయంకరమైన అగ్నిగుండా సాగి, మాడి మసై పోకుండా, ఉక్కులా కాకలు తీరటంగా' ఆయన ఈ మేడే ఊరేగింపుకు గల ప్రాధాన్యతను పేర్కొంటాడు.

ఫాసిస్టు నాజీల జైలులో సహితం తీవ్ర నిర్బంధం, పహారాలను అధిగమించి తమదైన శైలిలో ఆ పాంక్రాట్స్ జైలులోని రాజకీయ ఖైదీలు 1943 మే దినోత్సవాన్ని జరుపుకొన్న విధానం అత్యంత స్ఫూర్తిదాయకంగా వుంటుంది.

మేడే ఉదయాన్నే ఒకో గదిలో నిర్బంధింపబడిన ఖైదీలు, జైలు గోడలపై బీథోవెన్ సంగీతంలోని రెండు దరువులను చరచటం ద్వారా, ప్రక్క గదిలోని ఖైదీలకు తమ మేడే శుభాకాంక్షలను తెలియచేశారు. జైలులోని ఖైదీలందరూ తమకున్న దాంట్లో మంచి దుస్తులు ధరించి మేడే పండుగ చేసుకోవటానికి ఉపక్రమించారు.

ఖైదీలకు ఉదయపు అల్పాహారం యివ్వటంకోసం రొట్టె, నీరు, కాఫీ డికాషన్‌తో ట్రస్టీలు (రాజకీయ ఖైదీలకు ఆహారం సరఫరా చేయటం కోసం ఎంపిక చేయబడ్డ ఖైదీలు) వారి గదుల ముందు నిలబడ్డారు. మేడే శుభాకాంక్షగా ట్రస్టీ అయిన కామ్రేడ్ స్కోరెపా రోజూ యిచ్చే 2 బన్ను రొట్టెలకు బదులు, అదనంగా వారికి మరో బన్ను రొట్టెను చేర్చి 3 బన్ను రొట్టెలను యిచ్చాడు. బన్నులు యిచ్చే సందర్భంగా ఖైదీల వేళ్ళు తాకటం ద్వారా తన మేడే శుభాకాంక్షలను వారికి 'స్పర్శ' ద్వారా తెలియచేశాడు. మాట్లాడుకోవటంపై ఆఖరుకు ముఖంలో కంట్లోనూ భావవ్యక్తీకరణ చేసుకోవటంపై నిషేధం వున్నందువలన ఆ చిన్న స్పర్శ ద్వారానే వారు మాట్లాడుకోవటం జరిగింది.

భవనంలోని క్రింది భాగంలో, మగ ఖైదీలున్న అంతస్థుకు క్రింది భాగంలోని దొడ్డిలో మహిళా ఖైదీలు వ్యాయామం చేస్తున్నారు. వారిని జ్యూలియస్ ఫ్యూజిక్ తన గదిలోని టేబుల్ పైకి ఎక్కి కిటికీ చువ్వలగుండా చూస్తున్నాడు. వాళ్ళు తలపైకెత్తి, పై అంతస్థులో వున్న ఆయన్ను చూసి పిడికిలి బిగించి తమ మేడే శుభాకాంక్షలను ఆయనకు తెలిపారు. ఆ రకంగా ఆ మహిళా కార్మికులు తమ మేడే పేరేడ్‌ను నిర్వహించు కున్నారు.

అనంతరం మగ ఖైదీలు వ్యాయామం చెయ్యాలి. వారి చేత ఆ రోజున జ్యూలియస్ ఫ్యూజిక్ వ్యాయామం చేయించాడు. కొత్తరకపు వ్యాయామం చేయించటం ద్వారా వారిచేత మేడే పెరేడ్‌ను నిర్వహింపచేశాడు. ముందుగా ఖైదీలందరూ ఒకటి, రెండూ అంటూ పెద్ద సమ్మెట (సుత్తి)ని క్రిందకూ, పైకీ ఎత్తి, దింపే వ్యాయామాన్ని చేశారు. తర్వాత కొడవలి (కత్తి)తో పంటను కోస్తున్నట్టుగా ఎక్సర్‌సైజు చేశారు. ఆ రకంగా వారు తమ మేడే వ్యాయామంలో కమ్యూనిస్టు పార్టీ గుర్తయిన సుత్తీ, కత్తి చిహ్నాన్ని స్ఫురించే విధంగా చేసి తమ మేడే పెరేడ్‌ను జరుపుకొన్నారు.

తదనంతరం ఎవరి జైలు గదుల్లో వారు అంతర్జాతీయ శ్రామిక గీతాన్ని ఆలపించారు. ఇంతటితో మేడే సంబరాలు ముగియలేదు. మహిళా ఖైదీల వార్డుకు చెందిన ట్రస్టీ ఒకరు జైలు ఆవరణలోని దొడ్డిలో పచార్లు చేస్తూ ఎర్రసైన్యం యొక్క కవాతు పాటనూ, యితర సోవియటు గీతాలను ఈలపాట పాడటం ద్వారా గదుల్లో వున్న మగ ఖైదీలకు తన ధైర్యాన్ని జతచేసింది. మరోవైపున జైలు కాపలాదారు యూనిఫారంలో వున్న జెక్ జాతీయుడైన పోలీసు ఒకరు జ్యూలియస్ ఫ్యూజిక్‌కు కాగితాలూ, పెన్సిలూ యిచ్చి అతడు నోట్సు రాసుకుంటూ వుండగా, అతడి గది బయట ఎవ్వరూ రాకుండా ఆ గార్డు కాపలా కాసి ఆ రకంగా "ఖైదులో బంధింపబడ్డ నేటికీ, రేపటి విముక్తికీ" మధ్య తన ప్రాణాన్ని అడ్డుపెట్టడం ద్వారా ఒక కాగితపు వారధిని నిర్మించపూనుకున్నాడు. మేడే రోజున నిర్వహింపబడే సైనిక కవాతు కన్నా, నిర్బంధం మధ్య జైలులో ఈ రాజకీయ కమ్యూనిస్టు ఖైదీలు నిర్వహించిన ఈ మేడే కవాతులు ఎంతో మిన్న అయినవి. ఒక్క యుద్ధంలో మాత్రమే సైన్యం యొక్క సత్తా తేలేది. జైలు నిర్బంధంతో జరిగే యుద్ధంలో మేడేను నిర్వహించటం ద్వారా ఈ కమ్యూనిస్టు రాజకీయ ఖైదీలు చాటిన సత్తా అసమాన్యమయినది.

కేవలం ఉత్తమ కమ్యూనిస్టు ధీరుల ధైర్యాన్ని మాత్రమేకాక, తమ ప్రాణాలను దక్కించుకోవాలనే తాపత్రయంలో విద్రోహానికి పాల్పడి, శత్రువుకు తన సహచరులను పట్టించి యిచ్చిన వారి గురించి కూడా జ్యూలియస్ ఫ్యూజిక్ తన 'నోట్సు'లో వివరించాడు.

తననూ, తన సహచరుడైన మిరెక్‌నూ జలినెక్ దంపతుల యింట్లో అరెస్టు చేయటానికి కారణం బార్టన్ అనే ఒక కామ్రేడ్ చేసిన సాంకేతిక పొరపాటు అని మొదట జూలియస్ ఫ్యూజిక్ భావించాడు. కానీ తనకూ, మిరెక్‌కూ మాత్రమే తెల్సున్న మేధావులు అరెస్టు కాబడటంతో, అది మిరెక్ యొక్క విద్రోహ ఫలితగానే జరిగిందని ఆయన గ్రహించాడు. స్పెయిన్‌లో యుద్ధంలో వీరోచితంగా పోరాడి, రెండేళ్ళు ఫ్రాన్సులోని కాన్సన్‌ట్రేషన్ క్యాంపులో మ్రగ్గి , చట్టవిరుద్ధంగా జెకోస్లవేకియాలో ప్రవేశించి రహస్య కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న కాకలు తీరిన మెరెక్ యీ రకంగా విద్రోహానికి పాల్పడతాడని ఆయన ఎన్నడూ వూహించలేదు. తన ప్రాణాన్ని కాపాడుకోవటానికి ఆఖరుకు తనను ప్రేమించిన విడాను కూడా మెరెక్ పోలీసులకు పట్టించటం అన్నది అతడి విద్రోహతత్వానికి పరాకాష్టగా జూలియస్ ఫ్యూజిక్ భావించాడు.

"పది మందిలో కలసి వున్నప్పుడూ, పని చేస్తున్నప్పుడూ ధృడంగా నిలబడ్డ మెరెక్, ఒంటరి చేయ బడటంతో ధైర్యాన్ని కోల్పోయి విద్రోహానికి పాల్పడ్డాడనీ" పార్టీకి విధేయులు ప్రతిఘటిస్తారనీ, ద్రోహులు నమ్మకద్రోహానికి పాల్పడతారనీ, వీరులు పోరాడుతారనీ, బలహీనులు చేతులెత్తేస్తారనీ యీ సందర్భంగా ఫ్యూజిక్ వివరించటం జరుగుతుంది.

అయితే ఈ విద్రోహానికి పాల్పడిన కొద్దిమంది కన్నా, విశ్వాసపాత్రులైన వారు అనేక మంది ప్రజల్లో ఉండటంవల్లనే ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమం ముందుకు సాగుతోందనీ, ఫాసిజంపై కమ్యూనిజం తప్పక విజయం సాధిస్తుందనీ ప్రగాఢ విశ్వాసాన్ని ఆయన ఈ 'రక్తాక్షరాల' నోట్సులో ప్రకటించటం జరిగింది. పట్టుబడి చిత్రహింసల పాలవుతున్న రాజకీయ ఖైదీలకు, తోటి ఖైదీలు ధైర్యాన్ని చెప్పటం, తమకు చేతనయిన విధంగా సహాయపడటం లాంటి చర్యల ద్వారా ఒకరినొకరు రక్షించుకోవటానికి వారు చేసిన కృషిని జూలియస్ ఫ్యూజిక్ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఈ నోట్సులో వివరించటం జరిగింది.

ఈ రకంగా జూలియస్ ఫ్యూజిక్ రాసిన ఈ "రక్తాక్షరాలు" ఉత్తమ కమ్యూనిస్టుల యొక్క ధీరోదాత్త లక్షణాలనూ, సాంప్రదాయాలనూ వివరించటం ద్వారా, కమ్యూనిస్టు విప్లవకారులకు ఒక స్ఫూర్తిని యివ్వటం జరిగింది. నేడు తిరిగి ఫాసిజం విభిన్న రూపాలలో తల ఎత్తి వివిధ దేశాల ప్రజల స్వేచ్ఛా, స్వతంత్రాలనూ, ప్రయోజనాలనూ కబళించే యత్నాలు ముమ్మర మవుతున్నాయి. నేటికీ అనేక దేశాల ప్రజలు నిజమైన స్వాతంత్ర్యాన్నీ, స్వేచ్ఛనూ సాధించుకోవాల్సి వుంది. ఇటువంటి తరుణంలో ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను, విముక్తినీ కాంక్షించే కమ్యూనిస్టు విప్లవకారులందరికీ ఈ 'రక్తాక్షరాలు' స్ఫూర్తిదాయకంగా వుంటుంది. కమ్యూనిజం యొక్క అంతిమ విజయంపట్ల అచంచల విశ్వాసాన్ని కల్పిస్తుంది. ★

అర్ధభూస్వామ్య వ్యవస్థలో దళితులకు, వ్యవసాయ కార్మికులకూ భూయాజమాన్య హక్కులు నిర్దాక్షిణ్యంగా నిరోధింపబడతాయి!

మన దేశంలో అస్పృశ్యత రాజ్యాంగం ద్వారా రద్దు చేయబడినా, దళితుల, గిరిజనులపై అత్యాచారాలను నిరోధించే చట్టం అమలులో వున్నా నేటికీ ఏదో ఒక రూపంలో దళితులపై అస్పృశ్యత కొనసాగుతూనే వుంది, దళిత-గిరిజన వర్గాల వారు వివక్షకు గురిచేయబడుతూనే వున్నారు, దళితులపై, గిరిజనులపై పలు రూపాల్లో అగ్రవర్ణాలవారు అత్యాచారాలు జరుపుతూనే వున్నారు. దళితులకు భూమిపై హక్కు చెందకుండా నిరోధించుతూనే వున్నారు. 61 సంవత్సరాల 'స్వాతంత్ర్యం' దళితుల, గిరిజన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షత, అసమానత్వాలను పరిష్కరించలేకపోయింది. దళితులు ఒక వర్గంగానూ, కులంగానూ అనుభవిస్తున్న దౌర్భాగ్యాన్ని అంతం చేయలేకపోయింది.

మనది భూయజమాన్య సంబంధాలపై ఆధారపడిన అర్ధఫ్యూడల్ వ్యవస్థ అయిన కారణంగానే వివక్షతకు, అత్యాచారాలకు, ఆర్థిక అసమానత్వానికీ గురిచేయబడుతున్న దళితుల జీవన్మరణ సమస్యలు పరిష్కారం కాకుండాపోతున్నాయన్నది పదే, పదే రుజువవుతోంది.

దేశంలోని అన్ని ప్రాంతాల్లో మాదిరిగానే, తమిళనాడు రాష్ట్రంలో కూడా అగ్రవర్ణాలు దళితులపై సాగించే అత్యాచారాలు, దాడులు, అమలుజరిపే అస్పృశ్యత, దళితులకు భూమిపై యాజమాన్యపు హక్కు దక్కనీయకుండా దౌర్జన్యంగా నిరోధించటం అన్నది సాగుతూనే వుంది. దశాబ్దాల కాలంగా ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్న డి.ఎం.కె., ఎ.డి.ఎం.కె. పార్టీలు సహితం ఈ దుర్మార్గాన్ని అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందాయి. ఇందుకు కారణం అక్కడ నెలకొన్న కరుడుగట్టిన భూస్వామ్య వ్యవస్థేనన్నది నిస్సందేహమైన విషయం. భూమి యజమాన్య హక్కుకూ, దళితుల సమస్య పరిష్కారానికీ విడదీయరాని సంబంధం వుందన్న విషయం, యిక్కడి దళితుల జీవిత అనుభవంతో మరోసారి రుజువవుతోంది.

దేశంలో అమలవుతున్నాయని చెప్పబడే భూపరిమితి చట్టాలు దళితులకు, వ్యవసాయ కూలీలకు భూయాజమాన్యాన్ని కల్పించలేకపోయాయి. భూస్వాముల ఆధీనంలో వున్న మిగులు భూములను వీరికి పంచటమన్నది జరుగలేదు సరికదా, కనీసం ప్రభుత్వానికి చెందిన పోరంబోకు భూములు సహితం దళితులకు, వ్యవసాయకూలీలకూ దక్కలేదనీ, వాటిని కూడా అగ్రవర్ణాలవారే బలవంతంగా దక్కించుకొని కైంకర్యం చేసుకొంటున్నారనే విషయం తమిళనాడులోని ఇత్తిక్కళ్ అగారం అనే గ్రామంలోని దళితుల అనుభవం తెలియచేస్తోంది. ప్రభుత్వం దళితులకు యివ్వజూపిన పోరంబోకు భూములను సహితం వీరికి దక్కకుండా, వారు ఆ భూములను అనుభవించకుండా, వారికి పట్టాలు రాకుండా ఏ రకంగా అగ్రకులాల వారు నిరోధిస్తున్నారో అర్థమవుతుంది.

1976లో రాష్ట్ర ప్రభుత్వం ఇత్తిక్కళ్ అగారం గ్రామంలోని 62 మంది దళిత కుటుంబాలకు, వ్యవసాయం చేసుకొనేందుకు 182 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని మంజూరు చేయటానికి అనుమతి యిచ్చింది.

అయితే నేటికీ ఈ భూమిని అనుభవించటం, తమ స్వాధీనంలోకి తెచ్చుకోవటం, ఆ భూమిపై యాజమాన్యపు హక్కును పొందటం అన్నది అసాధ్యమైన విషయంగానే మిగిలిపోయింది. ఆ గ్రామంలోని సవర్ణ హిందూ అగ్రకులాలవారు ఆ భూమిని దళితులకు అందకుండా దౌర్జన్యపూరితంగా, చట్టవిరుద్ధంగా ఈ 32 సంవత్సరాల నుండి అడ్డుకొంటూనే వున్నారు. ఆ భూమి కేటాయింపబడ్డ దళిత కుటుంబాలపై పలు రూపాలలో అత్యాచారం జరుపుతూనే వున్నారు.

ప్రభుత్వం ఆ దళిత కుటుంబాల వారికి పోరంబోకు భూములను కేటాయించిన నిర్ణయం ప్రకటించిన వెంటనే, ఆ గ్రామంలోని సవర్ణ హిందువులు 'ఊరు పంచాయితీ'ని జరిపి ఆ రకంగా దళితులకు భూమిని కేటాయించటానికి తమ అసమ్మతిని ప్రకటించారు. ప్రభుత్వం కేటాయించిన భూమిని తీసుకోవటానికి అంగీకరిస్తే అటువంటి వారిని సామాజికంగా వెలివేస్తామనీ, వారు తీవ్రమయిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వుంటుందనీ ఆ పంచాయితీ హెచ్చరించింది.

దాంతో భూమి మంజూరు చేయబడ్డ 62 దళిత కుటుంబాలలో 40 కుటుంబాలవారు ఆ భూమిని తీసుకోవటానికి అంగీకరించక తిరస్కరించారు. ఆ భూమిని తీసుకొని వ్యవసాయం చేసుకోవటానికి బదులు, గతంలో మాదిరి గ్రామంలోని భూస్వాముల వద్ద వ్యవసాయకూలీలుగా పని చేయటానికే సిద్ధపడ్డారు.

మిగిలిన 22 కుటుంబాలవారూ తమకు కేటాయించిన భూములను సాగు చేసుకోవటానికి ప్రయత్నించగా, సవర్ణ హిందువులు వారిపై భౌతికదాడులు జరిపి, వారిని ఆ భూముల్లోకి ప్రవేశించకుండా అడ్డుకొన్నారు. ఆ దళిత కుటుంబాల వారి వ్యవసాయపు పనిముట్లను ధ్వంసం చేశారు. వీటన్నిటినీ తట్టుకొని సాగు చేసిన కుటుంబాల వారిని బహిష్కరించారు. వారి పంట భూములను, పంటలను విధ్వంసం చేశారు. దళితులకు కేటాయించబడ్డ 182 ఎకరాల్లో 120 ఎకరాలను దళితేతరులే తమ స్వాధీనంలో పెట్టుకొన్నారు.

2004లో యిదే భూ విషయంపై ఏర్పడ్డ వివాదాన్ని ఆసరా చేసుకొని దళితులపై సాంఘిక బహిష్కరణ ఆయుధాన్ని ప్రయోగించారు. ఇప్పటికీ వారిపై బహిష్కరణ కొనసాగుతూనే వుంది. ఈ బహిష్కరణ వలన గ్రామంలోని సవర్ణులెవరూ దళితులను తమ పనుల్లో పెట్టుకోరాదు. అలా పనుల్లో పెట్టుకొన్నవారికి భారీ మొత్తం అపరాధం విధింపబడుతుంది. దళితేతరులు దళితులతో మాట్లాడటానికి వీలులేదు. దళితులు గ్రామంలోకి ప్రవేశించ (తరువాయి 11వ పేజీలో)

దోపిడీ వ్యవస్థలో భూపరిమితి చట్టాల బండారం:

ఎం.ఎల్.ఏ.కోసం చట్టానికి మినహాయింపునిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

భూమిలేని నిరుపేదలకు, వ్యవసాయకూలీలకు, దళితులకు **చారెడు పోరంబోకు** భూమిని కేటాయించి, **పట్టా యివ్వటానికి చట్టాల**, రూల్సు మీమాంసను లేవనెత్తి, ఏళ్ళూ పూళ్ళూ గడిపి వట్టి చేతులు చూపించే ప్రభుత్వమూ, పాలనా యంత్రాంగమూ, ప్రభుత్వ పాలనాధికారులూ, కడుపునిండా వివిధ రూపాల్లో కోట్ల రూపాయలను దండుకొంటున్న పెత్తందార్లకూ, భూస్వాములకూ, అధికార పార్టీ నాయకులకు మాత్రం క్షణకాలంలోనే ఏ చట్టపర, రూల్సుకు సంబంధించిన మీమాంసలు లేవనెత్తకుండానే, ఒకవేళ అటువంటి మీమాంసలు తలెత్తే సందర్భాల్లో, నిబంధనలు అడ్డం వచ్చే సందర్భాల్లో ఆ నిబంధనలకు, చట్టాలకూ సత్వరంగా మినహాయింపులిస్తూ ప్రభుత్వానికి చెందిన విశాలమైన భూములను వారికి ధారాదత్తం చేయటం అన్నది మన 'ప్రజాస్వామ్య' పాలనలో పరిపాటైన విషయంగా వుంది.

తూర్పుగోదావరిజిల్లా, తాళ్ళరేవు మండలంలోని, చొల్లంగి గ్రామంలోని 57 ఎకరాల 39 సెంట్ల ప్రభుత్వ భూమిని, ఆ ప్రాంతపు శాసనసభ్యుడు వట్టి వసంత కుమార్, **అతడి భార్య వట్టి** ఉమాచంద్రమతిదేవిలకు, ఆంధ్రప్రదేశ్ **భూనిర్వహణ శాఖ** ప్రధాన కమీషనరూ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి **అయిన ప్రభుత్వ ఉన్నతాధికారి**, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా చట్టానికి మినహాయింపు యిప్పిస్తూ ధారాదత్తం చేసిన వైనాన్ని తెల్సుకొందాం.

ఎం.ఎల్.ఏ. వట్టి వసంతకుమార్ ఆయన భార్య ఉమాచంద్రమతిదేవిలు **తూర్పుగోదావరిజిల్లా కలెక్టరు** గారికి, తమకు చొల్లంగి గ్రామంలో కల 282, 283/1 మొదలైన షెడ్యూలులో గల 57.39 ఎకరాల ప్రభుత్వానికి చెందిన **భూమిని (41.35 ఎకరాల భూమిని** అంతకుముందు యితరులకు పట్టాలు యిచ్చి యిప్పుడు వారు అనర్హులనే పేరిట **ఆ పట్టాలను** రద్దుచేసిన భూమి; 16.04 ఎకరాల ప్రభుత్వానికి చెందిన యితర భూమి) తమకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు యిప్పించమని దరఖాస్తు చేసుకొన్నారట! (ఏ తారీఖున దరఖాస్తు చేసుకొన్నారో తెలియదు).

వారి కోర్కెపై సత్వరం స్పందించిన జిల్లా కలెక్టరు, తన 17.3.2008 నాటి లేఖ ద్వారా, వారు కోరుకుంటున్న భూమిని ప్రభుత్వం మెట్టపర్రగా అప్పటికే నిర్ధారించింది కనుక, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి 1 లక్షా 56 వేల చొప్పున వారి నుండి చెల్లింపును పొంది, వారు కోరిన భూమిని వారికి బదలాయించవచ్చునని సిఫార్సుచేస్తూ, ఆ రకంగా చేయమని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ లాండ్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు ప్రధాన కార్యదర్శి ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించటం జరిగింది.

అందుకు వెంటనే ప్రతిస్పందించిన ప్రధాన కమీషనర్, తూర్పుగోదావరిజిల్లా కలెక్టరుకు, తాను ఆ ప్రతిపాదనను 6.5.2008న ఎంపవర్డు కమిటీ ముందు పెట్టాననీ, అయితే ఈ ప్రతిపాదన ఎంపవర్డు కమిటీ పరిధిలోకి రాదనీ, అందువలన తిరిగి తూర్పు గోదావరిజిల్లా కలెక్టరు తన ప్రతిపాదనను తిరిగి సమర్పించమనీ ఆదేశిస్తూ 9.5.2008న లేఖ రాశారు.

తనకు ఆ ప్రతిపాదనను తిరిగి సమర్పించటం తప్ప మరో జరూరు పనేమే లేదన్నట్లు, తిరిగి వారం రోజుల్లోనే అంటే 15.5.2008న తూర్పుగోదావరిజిల్లా కలెక్టరు, తిరిగి రాసిన తన ప్రతిపాదనను లాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కమీషనరుకు పంపించారు.

మళ్ళీ తిరిగి 10 రోజుల్లోనే అంటే 26.5.2008న ఆ ప్రధాన కమీషనర్, తూర్పుగోదావరిజిల్లా కలెక్టరుకు ఈ క్రింది వివరాలు తెల్పుతూ ఒక లేఖ రాశారు:

11.01.1994నాటి రెవిన్యూ (భూసంస్కరణలు) శాఖకు చెందిన జి.ఓ. నెం.27 ప్రకారం "రొయ్యల సాగు/ చేపల పెంపకం చేద్దామనుకునే వ్యక్తులుగా వున్న విడి రైతులకు వ్యవసాయ భూములకు వున్న మాదిరిగానే, భూపరిమితి వుందని స్పష్టంగా నిబంధన వుందనీ, అదే రొయ్యలు/ చేపలు పెంచే కంపెనీలకయితే, ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణలు (వ్యవసాయ భూములపై పరిమితి) చట్టం, 1973 ప్రకారం గరిష్టంగా 500 ఎకరాలు ఉండవచ్చుననీ, కనుక తాను దరఖాస్తుదారులు (శ్రీ అండ్ శ్రీమతి వట్టి వసంతకుమార్) చేసుకొన్న విన్నపం మేరకు 57.39 ఎకరాల ప్రభుత్వ భూమికి, జీ.వో.నెం.27కు మినహాయింపు యిస్తూ, రొయ్యసాగు/ చేపల పెంపకానికి పూనుకొన్న వ్యక్తులుగా వున్న విడివిడి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సమగ్ర ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రోత్సహించుతూ బదలాయించమని ప్రభుత్వానికి సిఫార్సు చేయటం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం- ప్రధాన కమీషనర్, లాండ్ అడ్మినిస్ట్రేషన్ సిఫార్సు మేరకు వ్యక్తులుగా వున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించటం అన్న పేరు మీదుగా, రొయ్యలసాగు/ చేపల పెంపకం చేసే రైతులకు గరిష్టంగా 100 హెక్టార్ల (250 ఎకరాల) భూగరిష్ట పరిమితిని నిర్ణయిస్తూ, ఆ మేరకు జీ.వో.నెం.27ను సవరిస్తూ, 15.7.2008న జీ.వో.నెం.878ని విడుదల చేసింది. ఈ సవరించిన జీ.వో. ప్రకారం ప్రభుత్వానికి చెందిన 57.39 ఎకరాల భూమిని ఎం.ఎల్.ఏ. వట్టి వసంతకుమార్‌కు బదలాయిస్తూ తగు చర్య తీసుకోవాలని ఆదేశిస్తూ ప్రభుత్వ (ఆంధ్రప్రదేశ్) ప్రధాన కార్యదర్శి 18.7.2008న జీ.వో.నెం.891ని విడుదల చేయటం జరిగింది.

ఈ రకంగా కేవలం 4 నెలల్లోగానే ఎం.ఎల్.ఏ. వట్టి వసంతకుమార్‌కు అనుకూలంగా ప్రభుత్వం- ప్రభుత్వ భూపరిమితి, భూసంస్కరణ చట్టాల నిబంధనలను సవరించటం జరిగింది.

భూపరిమితి/ భూసంస్కరణ చట్టాలన్నవి, భూస్వాములకు, పెత్తందార్లకూ, అధికారపార్టీ అనుయాయులకు ఏ విధంగా చుట్టాలో, పేద ప్రజలకూ, అవసరమున్న వ్యవసాయిక కూలీలకు, రైతులకూ ఎలా నిరుపయోగకరమైనవో ఈ ఉదంతం వల్ల తెలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్ (భూపరిమితి) భూసంస్కరణల చట్టం 1973 ప్రకారం ఏ వ్యక్తికయినా, కుటుంబానికైనా 54 ఎకరాల కంటే ఎక్కువ భూమి వుండకూడదు. రొయ్యల **సాగు/ చేపల** పెంపకం చేయటాన్ని కూడా వ్యవసాయం క్రిందకే **వరిగణించి 54** ఎకరాల భూపరిమితినే **విధించింది. ఈ భూయాజమాన్య** బదలాయింపు **భాగోతాన్ని గురించి తెల్సుకొన్న** వారికి సహజంగానే ఈ క్రింది ప్రశ్నలు **ఉత్పన్నమవుతాయి.**

అ. జిల్లా కలెక్టరు అన్నవాడు పాలనాధికారా లేక అధికారపార్టీకి వూడిగం చేసిపెట్టే బంటా?

ఆ. పోలవరం ప్రాజెక్టు వలన ముంపుకు గురయ్యే గిరిజన గూడేలు, తత్పర్యవసానంగా తలెత్తే ప్రజా సమస్యలు,

ఇ. జిల్లాలో దళితులపై అగ్రవర్ణాలవారు జరిపే దాష్టికాలు-దాడుల సమస్యా, జిల్లాలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళు పేరిట అక్రమంగా భూములు గుంజుకోబడిన రైతుల, గ్రామాల ప్రజల సమస్యలు, యితర శ్రామిక ప్రజల జీవన్మరణ సమస్యలకన్నా, వట్టి వసంతకుమార్‌కు ప్రభుత్వ భూములు కట్టబెట్టడం అన్నదే కలక్టరు తక్షణం స్పందించి, పరిష్కరించాల్సిన సమస్యా?

ఈ. వట్టి వసంతకుమార్‌కు బదలాయించిన ప్రభుత్వ భూములు మెట్టపోరంబోకు భూములే అయితే, వాటిని గతంలో కేటాయించి, పట్టాలిచ్చిన వారి పట్టాలను ఎందుకు రద్దు చేయాల్సివచ్చింది. వారందరూ ఆ భూమిని పొందటానికి అనర్హులైతే, ఎం.ఎల్.ఎ. వట్టి వసంతకుమార్ ఆ భూములు పొందటానికి అర్హుడెలా అవుతాడు?

ఉ. వట్టి వసంతకుమార్‌కు మార్కెట్టు విలువకు అమ్మిన ఆ భూములను గతంలో పట్టాలిచ్చినవారికే అమ్మవచ్చు కదా? వసంతకుమార్‌ను ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ప్రోత్సహించినట్టుగానే, వారిందరినీ ఔత్సాహిక రైతులుగా ప్రోత్సహించ వచ్చు కదా?

ఊ. 1973 భూసంస్కరణల (భూపరిమితి) చట్టం, కంపెనీలకు 500 ఎకరాల భూగరిష్ట పరిమితి నిర్దేశించటం అంటే, పరోక్షంగా గరిష్ట భూపరిమితి లేకుండా (పారిశ్రామికులకు) చేసినట్టు కదా?

వీటన్నిటికి సరయిన జవాబులను నిర్ధారిస్తే ఈ 61 సంవత్సరాలుగా ప్రభుత్వం ఆడుతున్న భూసంస్కరణల యొక్క బూటకం అర్థమవుతుంది.

ఈ భూసంస్కరణ చట్టాలూ, భూపరిమితి చట్టాలూ 'దున్నేవారికే భూమి'ని డిమాండుచేస్తూ పోరాడుతున్న ప్రజలను మభ్యపెట్టడం కోసం ఉద్దేశించినవే తప్ప భూస్వాముల, బడా బాబుల, పెత్తందార్ల మిగులు భూములన్న వాటినికానీ, ప్రభుత్వ బంజరు భూములన్న వాటినికానీ పంచిపెట్టే సదుద్దేశ్యంతో చేయబడినవి కావని అనుభవంలో అర్థమవుతుంది.

రెవెన్యూ అధికారులూ, పాలనాధికారులూ ఈ చట్టాల అమలు పేరిట, భూమిలేని పేదలకు భూమి దక్కకుండా చేయటం కోసం నియమింపబడ్డవారేనని అర్థమవుతుంది. కలెక్టరుకుకానీ, ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అదనపు కార్యదర్శి మరియు ప్రధాన కమీషనర్‌కుకానీ ఆ చొల్లంగి గ్రామంలోని ప్రభుత్వ భూములను వట్టి వసంతకుమార్‌కు యివ్వమని సిఫార్సు చేయటం, అందుకు అనువుగా వారే జీ.వో.27, మరియు చట్ట నిబంధనల నుండి మినహాయింపులకు సిఫార్సు చేయటం చూస్తుంటే వీరు అధికారపార్టీకి గులాములమని నిరూపించుకోవటానికి ఎంతగా తహతహలాడుతున్నారో అర్థమవుతుంది.

పైపెచ్చు వారి సిఫార్సులను చూస్తుంటే, అంతకు ముందు వట్టి వసంతకుమార్‌కు అసలు భూమి ఏమీ లేనట్టూ, యిపుడు ఇవ్వదల్చుకొన్న భూమికే అన్యాయంగా జీ.వో.నెం.27 నిబంధనలు అడ్డం వస్తున్నట్టు, అందుకు జాలిపడి వారు మినహాయింపు (నిబంధనలకు) సిఫార్సు చేసినట్టు అన్పిస్తుంది. ప్రతీ విషయానికీ కొర్రీలు వేసే ఈ అధికారులకు అసలు వసంతకుమార్‌కు వున్న భూమి ఎంత అన్న ప్రశ్న రాకపోవటం యాదృచ్ఛిక మనుకోవాలా? లేక వారిది ప్రభుత్వాన్నే తప్పుదారి పట్టించే వంచనాపూర్వకమయిన వైఖరి అనుకోవాలా?

ఈ కారణాలరీత్యా దేశమంతటా ఈ దోపిడీ వ్యవస్థలో భూసమస్యపై ఆధారపడిన వ్యవసాయక విప్లవం అనివార్యంగా పుట్టుకొచ్చి, ప్రజ్వరిల్లటం అన్నది నిబద్ధం.

ఆకలితో మరణిస్తున్న అస్సాం తేయాకు తోటల కార్మికులు

తేయాకు పరిశ్రమ సంక్షోభంలో కూరుకు పోయిందనే సాకుతో దేశంలోని వివిధ రాష్ట్రాలలో వున్న 136 తేయాకు తోటలను 2003లో తేయాకు తోటల యజమానులు మూసివేశారు. ఈ మూసివేత వలన లక్షలాది మంది తేయాకు తోటల కార్మికులు ఉపాధిని కోల్పోయారు. సంక్షోభం పేరిట యజమానులు కార్మికులకు అంత వరకూ పని చేసినందుకు చెల్లించాల్సిన జీతాన్ని చెల్లించకుండా బకాయిపెట్టారు. వారికి చట్ట ప్రకారం కల్పించాల్సిన రేషన్, వైద్య సదుపాయాలను రద్దు చేశారు. వీలయినంత మేరకు ఆ సంక్షోభ భారాన్ని కార్మికులపై నెట్టారు. బ్యాంకులు, తదితర ప్రభుత్వ ఫైనాన్సు సంస్థల నుండి తెచ్చిన అప్పులు తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టారు. ఈ సంక్షోభం అన్నదాని వలన ప్రధానంగా నష్టపోయినది కార్మికులే. అయినా తమను సంక్షోభం నుండి బయట పడెయ్యమని గగ్గోలు పెట్టి ప్రభుత్వం నుండి పలు రూపాల్లో రాయితీలను, సహాయాన్నీ, సబ్సిడీలను, అప్పులను తేయాకు తోటల యజమానులు పొందారు.

సంక్షోభంలో వున్న తేయాకు పరిశ్రమను వివిధ రూపాల్లో ఆదుకొంటున్నామనీ, పరిశ్రమను ఆదుకోవటం ద్వారా తేయాకు కార్మికుల సంక్షేమాన్ని కాపాడ బోతున్నామని ప్రకటిస్తూ ప్రభుత్వం తేయాకు తోటల యజమానులకు అనేక రూపాల్లో సహాయపడింది, ప్రోత్సహించింది. అనేక స్కీంల ద్వారా యజమానులకు తోడ్పడింది. మూసిన తేయాకు తోటలను తెరిపిస్తామనే పేరిట యజమానులకు ఆర్థిక రాయితీలు, అప్పులు, సబ్సిడీలూ కల్పించింది.

280 తోటలున్న పశ్చిమబెంగాల్లో 2003 నుండీ 14 తేయాకు తోటలు మూతబడి వున్నాయి. సుమారు 30,000 మంది కార్మికులు ఈ దీర్ఘకాలిక మూసివేతల వలన పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్కతోట తప్ప, మిగిలిన తోటలన్నీ యిప్పటికీ మూసివేయబడి వున్నాయి.

కేరళ రాష్ట్రంలో అయితే మూతబడ్డ 19 తేయాకు తోటల్లో 12 తేయాకు తోటలు తిరిగి తెరవబడ్డాయి. కానీ తేయాకు తోట యజమానులు మాత్రం ప్రభుత్వం నుండి సహాయం పొంతుతూనే వున్నారు. పశ్చిమబెంగాల్లో అయితే డార్జిలింగ్ ప్రాంతంలో గల 87 తేయాకు తోటలను వ్యవసాయ ఉత్పత్తుల ప్రత్యేక ప్రాంతం (ఎస్.యి.జడ్) పేరిట ఏర్పరచి అందుకోసం వెచ్చించే 212.65 కోట్ల రూపాయల్లో ప్రభుత్వమే 56.25 కోట్ల రూపాయలు వెచ్చించనుంది.

తేయాకు పరిశ్రమ అభివృద్ధి కోసం పదవ పంచవర్ష ప్రణాళికలో తేయాకు తోటల అభివృద్ధికి 350 కోట్ల రూపాయలు కేటాయిస్తే, 11వ పంచవర్ష ప్రణాళికలో 800 కోట్ల రూపాయలను కేటాయించటం జరిగింది.

ఇదికాక 2006-07 సంవత్సరకాలంలో తేయాకు పరిశ్రమ కోసమని ప్రభుత్వం 4,700 కోట్ల రూపాయల 'ప్రత్యేక ఉద్దేశ్యంకోసం తేయాకునిధి'ని ఏర్పాటు చేసింది.

ఈ నిధి నుండి తేయాకు తోటలను పునరుద్ధ రించటం, పాతతోటలు పీకివేసి కొత్త తోటలు నాటడం, తేయాకు ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను ఆధునీకరించటం కోసం మొత్తాలు వెచ్చింపబడతాయి.

ఈ నిధి నుండి ఈ సంవత్సరం 100 కోట్ల రూపాయలను 33 తోటల యజమానులకు అప్పుగా (2008 జనవరిలో) మంజూరు చేయటం జరిగింది. ఈ అప్పుగా యిచ్చిన మొత్తంలో 25% సబ్సిడీగా యజమానులకు చెల్లించబడుతుంది.

11వ పంచవర్ష ప్రణాళికకోసం కేటాయించిన 800 కోట్ల రూపాయల నుండి 230 కోట్ల రూపాయలను ఈ సంవత్సరం 'నాణ్యత గల తేయాకు ఉత్పత్తికోసం- ఎగుమతికోసం' మంజూరు చేసింది. ఈ మొత్తం నుండి 100 కోట్ల రూపాయలు 'సాంప్రదాయక తేయాకు' ఉత్పత్తి అభివృద్ధి కోసం సబ్సిడీగా ఖర్చుపెడతారట. 87 కోట్ల రూపాయలను తేయాకు ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల ఆధునీకరణకు వెచ్చిస్తారట. 37 కోట్ల రూపాయలను ఉన్నత నాణ్యత గలిగిన తేయాకు ఎగుమతి అవసరానికి వెచ్చిస్తారట.

ఈ రకంగా వందల కోట్ల రూపాయలు తేయాకు తోట యజమానులకు వెచ్చింపబడుతున్నా, ఈ మొత్తాల నుండి కార్మికులను ఆదుకోవటానికి ప్రత్యక్షంగాకానీ పరోక్షంగా కానీ ఒక పైసా వెచ్చింపబడటల్లేదు.

పేరుకు పరిశ్రమను సంక్షోభంలో ఆదుకోవటం; కార్మికుల సంక్షేమాన్ని, జీవనోపాధిని పరిరక్షించటం కానీ ఆచరణలో తేయాకు తోటల యజమానులకే బడ్జెటు మొత్తాలనూ, సబ్సిడీలను దోచిపెట్టడం జరుగుతోంది.

ప్రభుత్వం యిన్ని రకాలుగా తేయాకు పరిశ్రమను ఉద్ధరించుతున్నట్లు చెబుతున్నా, ఈ పరిశ్రమ కొనసాగి, వర్ధిల్లి, లాభాలు దండుకోవటంకోసం తమ రక్త, మాంసాలను వెచ్చించి శ్రమపడే కార్మికులు మాత్రం పొట్టనింపుకోవటానికి పిడికెడు మెతుకులు కూడా దొరక్క ఆకలి మరణాల పాలవుతున్నారు.

ఇటీవలనే దక్షిణ అస్సాం రాష్ట్రంలోని కరీంగంజ్ జిల్లాలోని జాలానగర్ టీ ఎస్టేట్‌లో తేయాకు కార్మికులయిన 32 ఏళ్ళ అంజలీ నాయక్, 60 ఏళ్ళ సుభద్రానాయక్, 34 సంవత్సరాల సురబాలనాయక్‌లు కొద్ది రోజులుగా తినటానికి తిండిలేక ఆకలితో మరణించారు. ఇంకా పలువురు కార్మికులు ఆకలితో అలమటిస్తూ మరణానికి సమీపిస్తున్నారు. వీరికి చట్ట ప్రకారం కల్పించాల్సిన రేషన్, వైద్య సౌకర్యాలు కల్పించకపోతే ఈ ప్రాంతంలో తేయాకు తోట కార్మికుల పరిస్థితి మరింతగా విషమించి అనేక మంది ఆకలి చావుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంది.

భారతీయ తేయాకు కార్మికుల సంఘ నాయకులు ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు ఈ ఆకలి మరణాల ఉదంతాలు బయటపడ్డాయి.

ఈ ఆకలి మరణాల ఘటనపై స్పందిస్తూ కరీంగంజ్ డిప్యూటీ కమీషనర్ ఆ ప్రాంతపు తేయాకు కార్మికుల ఆర్థిక పరిస్థితి ఘోరంగా వుందని అంగీకరిస్తూనే, ఈ చావులకు గల నిజమైన కారణమేదో తెల్సుకోవటానికి మేజిస్టీరియల్ విచారణకు ఆదేశించినట్లు తెలియ పరుస్తున్నాడు. అంటే యివి ఆకలి మరణాలు కాదు, వారు అనారోగ్యంతో మరణించారు అని ఆ విచారణలో ప్రభుత్వం తేల్చబూనుకొందన్నమాట. అనారోగ్యానికి కారణం తిండిలేనితనం, ఆకలి అన్న వాస్తవాలను మాత్రం ఈ విచారణలో తేల్చి చెప్పరు. అసలు ఆకలి ప్రస్తావన లేకుండానే చావుకు గల కారణాలను ఈ విచారణలో నిర్ధారించి పారేస్తారు.

2007లో కూడా జాలానగర్ టీ ఎస్టేట్‌లో ఇద్దరు మహిళా కార్మికులు ఆకలి చావులతో మరణించారు. అప్పుడు మేజిస్టీరియల్ ఎంక్వయిరీ జరిపిన అదనపు డిప్యూటీ కమీషనరు అవి ఆకలి చావులే అని నిర్ధారిస్తూ తన రిపోర్టులో పేర్కొన్నారు.

(తరువాయి 11వ పేజీలో)

రాజస్థాన్‌లో ముగిసిన గుజ్జర్ల రిజర్వేషన్ల ఆందోళన
కుదిరిన ద్రోహపూరిత ఒప్పందం

రాజస్థాన్‌లో వెనుకబడిన వర్గాలకు చెందిన (ఓ.బి.సి.) గుజ్జార్లు, తమను ఎస్టీల్లో కలపమని కోరుతూ 27 రోజుల పాటు సాగించిన తీవ్ర ఆందోళన, చివరికి కపట పూరితమైన ఒప్పందంతో ముగిసింది. ఈ ఒప్పందం మొత్తం గుజ్జర్లందరినీ మోసానికి గురిచేసింది. ఎన్నికల రాజకీయ కుస్తీపట్లలో సమ ఉజ్జీలైన రాజకీయ నేతలలో ప్రముఖురాలైన రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధరా రాజే, గుజ్జర్లతోపాటు ఉన్నతకులాల పేదలకు కూడా రిజర్వేషన్ ప్రకటించారు. అది కేవలం ఓట్లను ప్రోగు చేసుకోవడానికి ఒక నాటకం మాత్రమే.

భారత దేశంలో ఏ ప్రాతంలోనైనా సామ్రాజ్యవాద దోపిడీకి గురవుతున్న జనసమూహాలు తమ సమస్యలపై ప్రజా ఆందోళన చేస్తే ఏం జరుగుతుందో మనకు రాజ్యాంగ విరుద్ధమైన పై ఒప్పందం స్పష్టంగా తెలియ చేస్తోంది. ప్రభుత్వం ఆందోళనలను అణచివేయడానికి ఒకవైపు తుపాకులతో ప్రజల రక్తాన్ని ప్రవహింపజేస్తూనే, రెండోవైపు వారికి వారి ప్రయోజనాలనే తాయిలాలను ఆశచూపి, ప్రలోభ పెట్టి నోరు మెదపకుండా చేస్తోంది. ఫలితంగా ఆందోళనలు స్తంభించి నిలిచిపోతున్నాయి. సామ్రాజ్యవాదానికి, సామ్రాజ్యవాద దళారులైన దేశ పాలక వర్గాలకు భారతదేశ ప్రజలతో ఈ విధమైన సంబంధాలే వున్నాయి.

ఈ మోసం కేవలం గుజ్జర్ల రిజర్వేషన్ పోరాటం సందర్భంలో మాత్రమే జరగలేదు. సామ్రాజ్యవాద దళారీ పాలకవర్గాలలో ఒక ముఠా అయిన భారతీయ జనతాపార్టీ (బిజెపి) రాజస్థాన్‌లో తన నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో వేరు వేరు ప్రజా ఆందోళనలపై ఇరవై ఒక్కసార్లు తుపాకీగుళ్ళతో విరుచుకు పడింది. వంద మందికిపైగా ప్రజల ప్రాణాలను హరించింది. 27 రోజులపాటు కొనసాగిన గుజ్జార్ల రిజర్వేషన్ల పోరాటం రాజస్థాన్‌కే పరిమితం కాలేదు. ఈ ఉద్యమం హర్యానా, ఢిల్లీ, జమ్మూ-కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లకూ పాకింది. ఈ ఆందోళనలో రాజస్థాన్‌లో 68 మంది, హర్యానాలో ముగ్గురు ఆందోళనకారులు పోలీసుల తుపాకీ గుళ్ళకు బలయ్యారు. మరణించిన వారిలో 48 మంది మృతదేహాలు రెండువారాల కంటే పైనే ఘటనాస్థలంలోనే పడి ఉన్నాయి. కనీసం వాటికి పోస్ట్‌మార్టమ్ కూడా జరగలేదు. ఇంతకు మించిన అన్యాయమైన పరిస్థితి ఎక్కడైనా ఉంటుందా? ప్రాణనష్టంతోపాటు హద్దుల్లేని ఆస్తినష్టం కూడా జరిగింది. రోడ్లను దిగ్బంధించి రాకపోకలు స్తంభింపచేయడంతో, రవాణా సౌకర్యాలు నిలిచిపోవడంతో భరించలేని ఆర్థిక భారాన్ని మోయాల్సి వచ్చింది.

ఇంతటి భారీ ప్రాణ, ఆస్తినష్టానికి కారణమైన ఈ గుజ్జార్ల ఆందోళన 23 మే 2008న ప్రారంభం కాగా జూన్ 18న విరమణ దిశగా ఒప్పందం కుదిరింది. 27 రోజులపాటు రాజస్థాన్‌లో వసుంధరారాజె ప్రభుత్వం, ప్రజల రక్తాన్ని ప్రవహింపచేస్తూ, కోట్ల రూపాయల నష్టాన్ని కల్గిస్తూ, కుళ్ళుతున్న శవాల గుట్టలను చూస్తూ ఉండిపోయింది. చాలా రోజుల వరకూ, ఆందోళనకారులతో చర్చలు జరపటానికి ప్రయత్నమైనా చెయ్యలేదు.

చివరకు జూన్ 18న ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ప్రస్తుతమున్న రిజర్వేషన్లకు భంగం కలుగకుండా, గుజ్జర్లు, బంజారాలు (గాడియాలు హోర్లు) కమ్మర్లు, రాయకరైబారీ జాతులకు "ప్రత్యేక వెనుకబడిన కులాలు"గా ఒక విశిష్ట శ్రేణిగా పరిగణిస్తూ 5 శాతం రిజర్వేషన్ కల్పించబడింది. ఈ రిజర్వేషన్ కేవలం ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, విద్యా సంస్థలల్లోను, పంచాయితీ, కార్పోరేషన్ల రాజకీయ ప్రాతినిధ్యాల్లోను ప్రవేశానికి మాత్రమే అమలుజరుపబడుతుందని ఈ ఒప్పందంలో చెప్పారు. మృతులకు నష్టపరిహారం ఇస్తామన్నారు.

గుజ్జర్లను ఎస్టీలుగా రిజర్వేషన్ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నది ఆందోళనకారుల ముఖ్యడిమాండు. 1999 డిసెంబరు 3 మరియు 2008 జనవరి 23న కేంద్రం పంపిన పత్రాలకు సమాధానం ఈ క్రింది విధంగా వ్రాస్తామని ప్రభుత్వం ఆందోళకారులకు హామీ ఇచ్చింది. "సామాజికంగా, విద్యాపరంగా బాగా వెనుకబడివున్న గుజ్జర్లు, బంజారాలు, కమ్మరులు, రాయకారైబారీ కులాలను ప్రస్తుతం ఉన్న ఇతర వెనుకబడిన కులాల రిజర్వేషన్ వ్యవస్థ చెదరకుండా, ప్రత్యేకశ్రేణిలో రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను కేటాయిస్తుంది".

గుజ్జర్ల ఆందోళనతోపాటు, రాజపుత్రులు, బ్రాహ్మణులు మొదలైన ఉన్నత కులాలాలకు చెందినవారు కూడా రిజర్వేషన్ కోరుతూ ఆందోళన మొదలుపెట్టారు. దీనిపై విచారించడానికి రిటైర్డ్ జస్టిస్ శశికాంత్ శర్మ అధ్యక్షతన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కమీషన్ ఏర్పాటు చేయబడింది. దాని రిపోర్టు రావడానికి ఇంకా సమయం పడుతుంది. కానీ ఎన్నికల కోసం వేసే ఎత్తుల్లో భాగంగా, లబ్దిని పొందడానికిగాను ఆ రోజే ఒక మధ్యంతర రిపోర్టును విడుదల చేశారు. దాని ఆధారంగా ఉన్నత కులాల్లోని నిరుపేదలకు 14 శాతం రిజర్వేషన్ ప్రకటనతో మోత మోగించారు. కానీ ఇందులో ఆర్థికంగా వెనుకబడిన ఉన్నతకులాలను ఖచ్చితంగా నిర్వచించలేదు.

ఈ విధంగా, ఎన్నికల యుద్ధరంగంలో కపట రాజనీతిలో తలపండిన ముఖ్యమంత్రి వసుంధరారాజె, మొత్తం రిజర్వేషన్లను 68% పెంచివేయగా, ప్రస్తుతం రాజస్థాన్‌లో ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు 12 శాతం, వెనుకబడిన తరగతుల వారికి 21 శాతం, కొత్తగా కుదిరిన ఒప్పందం ప్రకారం గుజ్జర్లు, బంజారాలు, కమ్మరులు మొదలైన వారికి 5 శాతం, ఉన్నత కులాల్లోని పేదలకు 14 శాతం రిజర్వేషన్లు ఇవ్వబడ్డాయి.

మనం రాజ్యాంగ చట్టబద్ధమైన దృష్టితో ఈ నిర్ణయాన్ని విశ్లేషించినట్లయితే, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైనదని అర్థమవుతుంది. నిజానికి రాజ్యాంగపు ఏ అధికరణలోను రిజర్వేషన్ల (అప్పర్ లిమిట్) గరిష్టస్థాయి ఇంత ఉండాలని నిర్ధారింపబడలేదు. కానీ ఇంద్రా సహానీ వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు, రిజర్వేషన్ల గరిష్టస్థాయి 50 శాతంగా నిశ్చయించింది. గడిచిన 50 సంవత్సరాల కాలంలో సుప్రీంకోర్టు రిజర్వేషన్లకు సంబంధించిన 18 కేసులలో తీర్పులిచ్చింది. రాజ్యాంగంలో పొందుపరచబడిన ఎస్సీ, ఎస్టీలు కాకుండా ఇంకే కులాలను, వర్గాలను, జనసమూహాలను ఆర్థిక వెనుకబాటుతనం కారణంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి ఎలాంటి సౌలభ్యమూ కల్పించలేదు. మండల కమీషన్ సిఫార్సులు అమలు చేయబడిన తర్వాత వెనుకబడిన కులాల వారికి కూడా కేవలం సామాజిక విద్యాపరంగా వెనుకబాటుతనం ఆధారంగా మాత్రమే రిజర్వేషన్ సౌలభ్యం కలుగజేయ బడింది. ఈ రిజర్వేషన్ నిర్ణయించడానికి ప్రతిరాష్ట్రంలోనూ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ కొనసాగుతుంది. "ఆర్థికపరమైన వెనుకబాటుతనం" అనే కారణంగా రిజర్వేషన్ కల్పించటమనేది రిజర్వేషన్ల మూల భావనపట్ల విపరీత పోకడ. ఎందుకంటే భారతదేశంలో తరతరాలుగా కొనసాగుతున్న వర్ణవ్యవస్థ లో దోపిడీకి గురయిన అణగద్రొక్కబడిన పీడిత, అణగారిన జాతుల ప్రజలకు ఒక ప్రజాతంత్ర హక్కుగా ఏర్పడినదే రిజర్వేషన్.

వసుంధర ప్రభుత్వం తలపెట్టిన ఈ రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలపట్ల పెద్దఎత్తున నిరసన వెల్లువెత్తింది. రాజ్యాంగ నిపుణులు, ఉన్నత న్యాయకోవిదులు ఈ నిర్ణయాలను తీవ్రంగా అభిశంసించారు. రాజ్యాంగ నిపుణులైన సుభాష్ కశ్యప్ "ఇది రిజర్వేషన్ కాదు, కేవలం రాజకీయపరమైన మోసపు ఎత్తుగడ. ప్రస్తుతం రిజర్వేషన్ల విధానం ముగిసి, దాని బదులు రాజకీయపు ఎత్తుగడలే చలామణి అవుతున్నాయి" అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు "గుజ్జర్లు, ఇతర మూడు కులాలకు కలిపి 5 శాతం గాను, ఉన్నతవర్గాల లోని పేదలకు 14 శాతంగాను రిజర్వేషన్ ఇవ్వడంకోసం రాజస్థాన్ ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయనుంది. కానీ కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఏమీ లేదు. ఇలా చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది.

రాజస్థాన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ దవే అభిప్రాయం ప్రకారం "ఉన్నత న్యాయస్థానం హెచ్చరికను పెడచెవిని పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. ఇది న్యాయస్థానాన్ని అవమానించడమే. రాజ్యాంగం అధికరణ 16(4)కు ఇది విరుద్ధం. రాజ్యాంగాన్ని అవహేళన చేయడం సరైనది కాదు".

పదిహేడు సంవత్సరాల క్రితం నరసింహారావు ప్రభుత్వం అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్‌ను వేరుగా ప్రకటించగా, అప్పటి అత్యున్నత న్యాయస్థానం దానిని రాజ్యాంగ విరుద్ధంగా నిర్ణయించి, రద్దు చేసింది. జైపూర్ ఉన్నత న్యాయస్థానంలో మాజీ న్యాయమూర్తి పానాచంద్ జైన్ ఈ విధంగా రిజర్వేషన్ కేటాయించడాన్ని రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా అభివర్ణిస్తూ, ఇది ప్రజలను మోసగించే ప్రయత్నమని చెప్పారు. రాజస్థాన్ ప్రభుత్వం తీసుకున్న రిజర్వేషన్లకు సంబంధించిన ఈ నిర్ణయం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైనదే కాక తమ రాష్ట్ర ప్రజలను ఈ కపట నాటకం ద్వారా భ్రమల్లోపెట్టి ఎన్నికల్లో తమ పబ్బం గడుపుకోవాలనే మోసపూరిత ఎత్తుగడ అని కూడా స్పష్టమవుతోంది.

ఇదే సందర్భంలో రాజస్థాన్‌లోని ప్రముఖ దినపత్రిక "దైనిక్ భాస్కర్" 2008 జులై 5న వార్త మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఆ వార్తలో ఇలా ఉంది. బిజెపికి చెందిన పి.ఎం. ఇన్ వెయిటింగ్‌గా (ప్రధాన మంత్రి పదవి కొరకు నిరీక్షణలో) ఉన్న లాల్‌కృష్ణ అద్వానీ గుజ్జర్ల రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు కల్నల్ కరోడీసింగ్ భైంస్లాతో రహస్య సమావేశం జరిపారు. రాబోయే ఎన్నికల్లో గుజ్జర్ల ఓట్లు బిజెపికేనన్న హామీ లభించిందన్న వార్త సుడిగాలిలా వ్యాపించింది. గుజ్జర్లలోని ఇతర ప్రముఖనేతలు, దీనిని గుజ్జర్ల సమూహానికి వెన్నుపోటు పొడవడమేనని అభిప్రాయపడ్డారు. అంతేకాక గుజ్జర్ల సమూహానికి చెందిన 68 మంది బిడ్డలను మృత్యుశయ్యపైకి పంపిన పార్టీ, గుజ్జర్ల ప్రథమ శత్రువు".

రాజ్యాంగ నిపుణుల అభిప్రాయాల్నీ, వారి రాజ్యాంగబద్ధమైన వ్యాఖ్యలను పరిశీలించి విశ్లేషించిన పిదప, రాజస్థాన్‌లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న రిజర్వేషన్ల కొరకు ఆందోళనలన్నీ మోసంతోకూడిన రాజకీయ ఎత్తుగడలనీ కులాల వైషమ్యాలు, ఎన్నికల మంటల్లో చిక్కుకొని అత్యంత హేయమైనస్థితిలో ఉండి, పైకి మేడిపండులా కన్పిస్తున్నాయనీ స్పష్టమవుతోంది.

రాజస్థాన్ సంస్థానాల కంచుకోట. ఇక్కడ ఈనాటికీ సంస్థానాధీశులు అత్యంత ప్రభావం కలిగి వున్నారు. మాజీ సంస్థానాల అవశేషాలకు నేటికీ ఇంకా పూర్వపు ప్రాభవం బలంగానే ఉంది. ఈ కారణంగానే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు అత్యంత సన్నిహితులైన గ్వాలియర్ రాజకుటుంబపు కుమార్తె, ధౌల్‌పూర్ సంస్థానపు కోడలు అయిన వసుంధరా రాజె, రాజకీయంగాను, ఇతరత్రా ఎలాంటి త్యాగాలూ, సంఘర్షణా లేకుండా సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రి పదవిని నిబాలించుకు వస్తున్నారు. అంతేగాక నిరంతరం అబద్ధపు హామీల, పనికిరాని ప్రకటనల బలంతో నిరాటంకంగా ప్రజలను అణచివేస్తూ కూడా రాబోయే ఎన్నికలలో తిరిగి విజయం పొందాలనే కలలు కంటోంది.

దానికి కారణం కూడా రిజర్వేషన్ కొరకు ఆందోళలు స్పష్టం చేశాయి. విభిన్న రాజకీయ పార్టీలు ఈ ఆందోళనల మంటల్లో తమ రొట్టెలు కాల్చుకోవడానికి, కులబేధాల్ని పెంచి పోషించాయి. ఆందోళనకు మూలకారణాలైన సమస్యల పరిస్థితిని చక్కదిద్ది సరిచేయడానికి బదులు వాటిని ఆందోళనల అగ్నిజ్వాలల్లో పడవేశాయి. దేశవిభజన, సమాజ విభజన, మనుష్యుల్లో ప్రాంతీయ, మతపరమైన, వర్గపరమైన, భాషాపరమైన, కులపరమైన అంశాలకు చెంది ఉంటాయన్న దానికి చరిత్రే సాక్షి. ప్రాచీన కాలం నుండి కూడా సంస్థానాల విలువలను బట్టి భారతీయ సమాజం కులాల ఆధారంగా విభజింపబడుతూ వచ్చింది. సామ్రాజ్యవాద విధానాలు, వారి దళారీ భారతీయ పాలకులు, ఈ కులవాదానికి పాలుపోసి పెంచారు. వివిధ రాజకీయ పార్టీలన్నీ తమ ఓటుబ్యాంకులను తయారుచేసుకునే వైపు దృష్టిని కేంద్రీకరించారు. దానికోసం వార్లు మతం, సాంప్రదాయం, కుల, ప్రాంత, భాషా విబేధాలను వినియోగించారు. భారతీయ సమాజహితాన్ని బలిచేసి, సామ్రాజ్యవాద అనుకూలమైన తమ దళారీ ప్రయోజనాలను కాపాడుకోవడమే వారి ధ్యేయంగా మారింది. ఇప్పుడిక భారతదేశంలోని శ్రమజీవులంతా ఏకమై, వర్గ సంఘర్షణ ఆధారంగా ఒక క్రొత్త సామ్యవాద భారత దేశాన్ని సృష్టించాల్సిన అవసరం, బాధ్యత మనందరి భుజాలపై ఉంది.

(వర్గ సంఘర్ష్ కీ పుకార్ 2008 ఆగస్టు సంచిక నుండి)

పోలాటి తిప్ప థర్మల్ కేంద్రం నిర్మాణంపై సంపూర్ణ విచారణ జరగాలి!
రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) డిమాండ్

మచిలీపట్నం, 28.8.2008:
గాయత్రి ప్రాజెక్టు లిమిటెడ్‌చే ప్రమోట్ చేయబడిన థర్మల్ పవర్‌టెక్ కార్పోరేషన్ ఇండియా లిమిటెడ్ 1980 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ స్టేషన్‌ను బందరు మండలం, పోలాటితిప్ప గ్రామంలో స్థాపిస్తున్నారు. ఈ గ్రామ పరిధిలో సర్వే నెం.53/బిలో 1200 ఎకరాల బంజరు భూమిని ప్రభుత్వం కేటాయించింది. 28.8.2008వ తేదీన పోలాటితిప్ప గ్రామంలో పర్యావరణ ప్రభావ అంచనా నివేదికపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించింది. ఈ క్రింది విషయాలను పరిశీలించి పరిగణనలోకి తీసుకొని పరిష్కరించవలసిందిగా రైతుకూలీ సంఘం అధికారులను కోరింది.

1) థర్మల్ పవర్‌టెక్ కార్పోరేషన్‌కు కేటాయించిన భూమి యావత్తు 8.10.1996 నాటి రాష్ట్ర ప్రభుత్వ తీర ప్రాంత యాజమాన్య ప్రణాళిక ప్రకారం కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్.జెడ్.) పరిధిలోనిది. సి.ఆర్.జెడ్. పరిధిలో వున్న భూమిని కేటాయించడం, ఇండస్ట్రీ ఏర్పాటు కొరకు సి.ఆర్.జెడ్. నిబంధనలను మినహాయించడం చట్టవిరుద్ధం. సి.ఆర్.జెడ్-జోన్ 1 పరిధిలో వున్న భూమిని ఇండస్ట్రీ కొరకు కేటాయింపు నిర్ణయాన్ని ఉపసంహ రించుకోవాలి. దీనిని కోస్టల్ మేనేజిమెంట్ జోనుగా మార్చినా విమానాశ్రయాల నిర్మాణంకోసం మాత్రమే మినహాయింపునిచ్చారు.

2) సి.ఆర్.జెడ్ పరిధిలో వున్న భూములలో మడ, ఉరవకాడ వంటి చెట్లను 73 ఎకరాలలో నరకబడిందని, నరికిన ప్రదేశమంతా ఇండస్ట్రీకి కేటాయించిన భూమిలోనిదేనని, మడ చెట్లు నరికింది ఎవరో తెలియదని, అందుకు ఆధారాలు లేవని ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన నివేదికలో స్పష్టం చేసింది. ఆధారాలు దొరకలేదంటూ అమాయకత్వం నటించడం ఏమాత్రం సరైనది కాదు. మడచెట్లను నరికించింది ఇండస్ట్రీ యాజమాన్యం అయితే వారిపై చర్య తీసుకోవాలి. లేదా గ్రామస్తులు నరికితే వారిలో మడ అడవుల నరికివేత వల్ల జరిగే నష్టాలు గురించి సరైన అవగాహన కల్గించేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. మడచెట్ల నరికివేతను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా ఎందుకు వుంది? తీరప్రాంతంలో మడ తదితర చెట్లు సముద్ర జలచర జీవరాశుల పునరుత్పత్తికి దోహదపడతాయి. ఈ చెట్లను విచక్షణారహితంగా నరకటం వల్ల దీర్ఘకాలంలో జీవావరణ సమతుల్యత దెబ్బతిని పర్యావరణ పరంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. భవిష్యత్తులో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

3) పోలాటితిప్ప గ్రామస్తులు చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి గుండేరు డ్రైన్ ప్రధాన ఆధారం. పవర్‌టెక్ కార్పోరేషన్ వారు విద్యుత్ ఉత్పత్తికి సముద్ర జలాలను వినియోగిస్తారు. ఆ నీరును గుండేరు డ్రైన్ నుండి తీసుకుంటే గ్రామంలోని మత్స్యకారులు ఉపాధి కోల్పోతారు. కాబట్టి గుండేరు డ్రైన్ నుండి నీరు తీసుకోకుండా తగు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం, ఇండస్ట్రీ యాజమాన్యం కలిసి రిజిస్టర్డ్ ఎగ్రిమెంట్ ద్వారా గ్రామస్తులకు హామీ ఇవ్వాలి.

4) థర్మల్ కేంద్రంలో స్థానికంగా 1380 మందిని కాంట్రాక్టు ప్రాతిపదికన ఉపాధి కల్పిస్తామని చెప్పినారు. కాంట్రాక్టు ప్రాతిపదికన కాకుండా పర్మినెంటు కార్మికులుగా ఉద్యోగం ఇవ్వాలి. చట్టపరమైన అన్ని హక్కులు, సౌకర్యాలు ఉపాధి పొందేవారికి కల్పించాలి. ఇందుకు రిజిస్టర్డ్ ఎగ్రిమెంట్ ద్వారా స్పష్టమైన హామీ ఇవ్వాలి.

5) థర్మల్ పవర్ స్టేషన్ నుండి విడుదల అయ్యే వ్యర్థజలాలు సముద్రంలో కలుస్తాయి. రసాయనిక వాయువులు గాలిలో కలుస్తాయి. యాష్ (బూడిద) పాండ్ ఏర్పాటు చేస్తారు. కాలుష్య నివారణకు, పర్యావరణ సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు ఇండస్ట్రీ యాజమాన్యం తీసుకుంటుందని చెప్తున్నారు. ఇండస్ట్రీ యాజమాన్యం అటువంటి చర్యలు తీసుకుంటున్నదా? లేదా? అనేది చెక్ చేసేందుకు పర్యావరణ నిపుణులు, ప్రజాసంఘాలతో కూడిన కమిటీలకు పర్యవేక్షించే హక్కును కల్పించాలి. చట్టబద్ధం చేయాలి.

6) ఇండస్ట్రీలో అన్ని కార్మిక చట్టాలు అమలుచేయలి.

7) థర్మల్ పవర్ స్టేషన్ యస్.ఇ.జెడ్.గా ఆమోదించబోతున్నారా? లేదా? అన్నది ప్రజల ముందు స్పష్టం చేయాలి. యస్.ఇ.జెడ్‌గా ఆమోదించరాదు.

8) థర్మల్ పవర్ టెక్ కార్పోరేషన్‌కు ఇస్తున్న పన్ను రాయితీలను బహిరంగ పర్చాలి.

9) పోలాటితిప్పలో థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటు నిమిత్తం పర్యావరణ ప్రభావంపై జరిగిన అధ్యయనం అంతా విమ్టా ల్యాబ్సు వారిచే చేయించారు. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (నాగపూర్) ప్రభుత్వ సంస్థచే అధ్యయనం చేయించాలి. ప్రైవేటు సంస్థతో చేయిస్తే ఇండస్ట్రీ యాజమాన్యం ప్రయోజనాలు నెరవేర్చే విధంగా వారికి అనుకూలంగా వుంటుంది. ఇందులో ప్రజల ప్రయోజనాలు విస్మరించ బడతాయి.

10) పోలాటితిప్ప గ్రామస్తులు స్వేచ్ఛగా చేపలవేట చేసుకునే విధంగా, భవిష్యత్తులో ఏ రూపంలోను గ్రామస్తులు నిర్వాసితులు కాకుండా తగు చర్యలు గైకొనేందుకు రిజిస్టర్డ్ ఎగ్రిమెంట్ ద్వారా హామీ ఇవ్వాలి.

(2వ పేజీ నుండి)

కాలుష్యం వెలువడిన ప్రాంతంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ళు మృతి చెందటం, ఫిబ్రవరి నెలలో 14, 15 తేదీల్లో విశాఖలోని సముద్ర ప్రాంతానికి టన్నులకొద్దీ చనిపోయిన చేపలు తీరానికి కొట్టుకురావటం అన్న తాజా ఘటనలు మన ముందున్నాయి. వ్యర్థ పదార్థాలతో కలుషితమైన నీటిలో పెరిగిన చేపల్లో విషతుల్య పదార్థాలు చేరి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి.

రైతుల జీవనోపాధి హరించుకుపోతుంది:

ఇప్పటికే ఈ రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరిట, ప్రత్యేక ఆర్థికమండళ్ళు పేరిట, పరిశ్రమల స్థాపనావసరాల పేరిట రైతుల నుండి బలవంతంగా 25 లక్షల ఎకరాల దాకా నిర్బంధంగా స్వాధీనం చేసుకోవటం జరిగింది. ఆ మేరకు భూములు కోల్పోయిన రైతులు తమ జీవనోపాధిని కోల్పోయి రైతుకూలీలుగా కుదింపబడ్డారు. తిరిగి తీరప్రాంతాభివృద్ధి పేర ప్రభుత్వం నేరుగానో లేక ప్రైవేటు కంపెనీల ద్వారానో మరో 5 లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొనేయత్నంలో వుంది. దీనికి తోడు ఎప్పుడో పేరుకుయిచ్చిన అసైన్డ్, ఈనాం భూములను రద్దు చేసింది. కారిడార్‌కోసం జరిగే ఈ భూసేకరణల వలన మరింత మంది రైతులు భూమిలేని నిరుపేదలై జీవనోపాధి కోల్పోతారు. ఇంత వరకూ వారి వ్యవసాయ భూముల్లో జీవనోపాధి పొందుతున్న వ్యవసాయకూలీలు సహితం జీవనోపాధిని కోల్పోతారు.

పెరిగే ఆహార సమస్య:

ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలకు బియ్యం దొరకటం కూడా కష్టమయిన స్థితికి ఆహార సమస్య చేరుకొంది. (ఇందుకు దళారీలు, దొంగ వ్యాపారపద్ధతులూ కారణం). ఇప్పుడు ఈ కారిడార్ కోసం సేకరించే భూముల్లో, సారవంతమైన పంట పండే భూములు కూడా గణనీయమైన విస్తీర్ణంలో వుంటాయి. ఆ భూముల మేరకు ఆహారోత్పత్తి తగ్గిపోయి, ఆహార సమస్య మరింత తీవ్రమవుతుంది.

త్రాగునీటి సమస్య:

ఇప్పటికే రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతం ఏదో ఒక మోతాదులో తాగునీటి సమస్యతో సతమతమవుతోంది. ఇప్పుడు కోస్టల్ కారిడార్‌లోని పరిశ్రమల అవసరాల కోసం, టౌన్ షిప్‌ల అవసరాలకోసం ప్రస్తుతం అందుబాటులో వున్న త్రాగునీటి వనరులను మరలించటం వలన తీరప్రాంతమంతటా త్రాగునీటి సమస్య తీవ్రతరమవుతుంది.

ఇక సాగునీటికి కూడా కటకటే. పోలవరం ఎడమ కాలువ నీరు కాకినాడ పిసిపిఐఆర్‌కు సరిపోతాయి. ఇది పూర్తయ్యేలోపు ఏలేశ్వరం నీటిని వాడతారు. విశాఖలో బాక్సైట్ తవ్వకాలు ప్రారంభమైతే పంపా, తాండవ, కళ్యాణలోవ, శారద మొదలగు నదుల నీళ్లన్నీ బాక్సైటు ఖనిజం కడిగేందుకు వాడటంతో ఆ నదులన్నీ ఎర్ర బురద నీటిమయమై తాగుకీ, సాగుకీ పనికి రాకుండా పోతాయి. ఇక దక్షిణ కోస్తాలో అయితే గుండ్లకమ్మ, వెలిగొండ వంటి మధ్యతరహా ప్రాజెక్టుల నీరు కూడా కారిడార్ అవసరాలకే తరలించబడుతుంది. రైతాంగానికి సాగునీరిచ్చే జలయజ్ఞం కాదిది; పరిశ్రమలకు నీటిని తరలించే యాగమిది.

పర్యావరణ సమస్య:

ప్రకృతి వైపరీత్యాలనూ, తుపానులనూ, సునామీలను తట్టుకొనేందుకు, ప్రజలను కాపాడేందుకు ఈ తీరప్రాంతమంతటా మడచెట్లు, సర్వీ, జీడిమామిడి తోటలు, రిజర్వు వనాలను పెంచటం జరుగుతోంది. ఇప్పుడు ఈ తీరప్రాంత కారిడార్ పరిశ్రమలకోసం ఈ మడ చెట్లనూ, రిజర్వు వనాలను, సర్వి, జీడిమామిడి తోటలను నరికివేయటం జరుగుతోంది. ఇందువలన పర్యావరణానికి తీవ్రమయిన విఘాతం ఏర్పడబోవటంతోపాటు, విలువైన జీడిమామిడి పంట అంతరించబోతోంది. భీమిలీ నుండి శ్రీకాకుళం వరకూ రష్యా కంపెనీకి, నిజాంపట్నం నుండి కొత్తపట్నం వరకూ ఆస్ట్రేలియా కంపెనీకి బీచ్‌సాండ్ ఎక్సకేషన్ (తీరప్రాంత ఇసుకను తవ్వి, కడిగి, దానిలో దొరికే అరుదైన ఖనిజాలను వెలికితీసే) పనిని అప్పచెప్పారు. దీనిలో దొరికే ఇల్మనైట్ ఖనిజాన్ని ఆ కంపెనీలు తరలించుకుపోతాయి. ఒకవేళ అణుధార్మిక ఖనిజం దొరికితే భారత ప్రభుత్వానికిస్తాయట. ఆ సంగతలా వుంచితే, దీనికోసం మొత్తం తీరంలోని ఇసుకనంతా త్రవ్విపోస్తారు. సహజంగా ఏర్పడ్డ ఇసుకతిన్నెలన్నీపోయి, చెట్టూచేమా లేక తీరప్రాంతం ఎడారి అవుతుంది.

జీవనోపాధి బూటకం:

10 లక్షల మందిపైగా ప్రజల జీవనోపాధిని హరించి వారి జీవితాలను ధ్వంసం చేసే ఆ 'కోస్టల్ కారిడార్' 20 సంవత్సరాలలోగా 12 లక్షల మందికి జీవనోపాధి అవకాశాలు కల్పిస్తుందట. ఆ అవకాశాలు ఎంతటి నాణ్యమయినవో లేక ఆఖరు స్థాయికూలీలుగా పనిచేసే అవకాశాల్లో స్పష్టత లేదు. ఈ మాత్రపు ఉద్యోగాలకోసం అదీ 20 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో, యింతటి భారీ మూల్యం చెల్లించాల్సిన అవసరంలేదు.

ఈ రకంగా ప్రస్తుతం మనకు తెల్సున్న నష్టాలతో పాటు విదేశీ పరిశ్రమాధిపతుల స్వాధీనంలోకి ఈ తీరప్రాంతం వెళ్ళటం వలన సంభవించబోయే అనేక సమస్యలకు మన రాష్ట్ర ప్రజలు గురవుతారు.

సామ్రాజ్యవాద ఆధిపత్య ప్రయోజనాలకు ఆధీనం చేయబడే తీరప్రాంతం:

భౌగోళికంగా తూర్పున కల హిందూ మహాసముద్ర ప్రాంతం అత్యంత కీలకమయినది. ఈ ప్రాంతంపై ఆధిపత్యం వహించే శక్తులకు (సామ్రాజ్యవాద-అగ్రరాజ్య) ఈ తీరప్రాంతం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమయినది. ఈ ప్రాంతంపై పట్టును పొందటం ద్వారా మలక్కా జలసంధి ద్వారా జరిగే వాణిజ్య జలరవాణాను అధీనంలో వుంచుకోవటం ద్వారా, ఈ ప్రాంతాన్ని తన ఆధిపత్యంలో వుంచుకో సాధ్యమవుతుంది. వాణిజ్య రవాణాను నిర్వహించటం ద్వారా యితర దేశాల వాణిజ్యాన్ని శాసించవచ్చు. ఇతర దేశాలను సైనిక రవాణా ద్వారా తన ఆధీనంలో వుంచుకోవచ్చు. ఆ కారణం చేతనే గతంలో సామ్రాజ్యవాద దేశాలూ, అగ్రరాజ్యాలు అయిన అమెరికా-సోవియట్ యూనియన్‌లు ఈ తీరప్రాంతంపై తమ ఉనికినీ, ఆధిపత్యాన్నీ వుంచుకొనేందుకు ముమ్మరమయిన ప్రయత్నాలు చేశారు.

నెల్లూరు వద్ద గల శ్రీహరికోట అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయబడింది ఈ ప్రయోజనం కోసమే. నాటి సోషల్ సామ్రాజ్యవాద దేశమయిన సోవియట్ యూనిట్ ఆధిపత్య ప్రయోజనాలకోసం ఈ కేంద్రం నిర్మించబడింది. అదేవిధంగా 1985 నుండి ఒరిస్సాలోని బలియాపాల్ తీరప్రాంతంలో సోవియట్ యూనియన్ ప్రయోజనాలకు అనుగుణంగా క్షిపణి కేంద్రాన్ని నిర్మించటానికి పూనుకొన్నా నాటి బలీయమైన ప్రజా ఉద్యమం ఎదుర్కోవటంతో, ఆ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించి శ్రీహరికోటలో నిర్మించింది.

సోవియట్ యూనియన్ పతనానంతరం, ఏకైక అగ్రరాజ్యంగా వున్న అమెరికా, నేటి ప్రపంచ సామ్రాజ్యవాదానికి నాయకత్వం వహిస్తూ, హిందూ మహాసముద్ర తీరప్రాంతంపై తన పట్టును, ఆధిపత్యాన్ని పెంచుకోవటానికి కృషి చేస్తోంది. ఇప్పటికే సంయుక్త నావికా ప్రదర్శనలన్న వాటి రూపంలో విశాఖపట్నంలో తిష్టవేసిన అమెరికన్ నౌకా సైన్యం, నేడు ఈ తీరప్రాంత కారిడార్‌లో కార్పోరేట్ సంస్థల ఆస్తుల, తీరప్రాంత రక్షణ పేరిట, ఈ తీరప్రాంతాన్నంతటినీ తన కబంధ హస్తాల్లో యిరికించుకొని హిందూ సముద్ర ప్రాంతంలో పెత్తనం చలాయించటమేకాక, భారతదేశ భద్రతకు కూడా ప్రమాదకరమైన శక్తిగా పరిగణిస్తుంది. వ్యూహాత్మక ఒప్పందం పేరిట అమెరికాతో జరిగిన సైనిక ఒప్పందం వల్ల హిందూ మహాసముద్రంలో వాణిజ్య నౌకలకు భారత నావికాదళం కాపలా కాయాలి. అమెరికా సైనిక నౌకలకు కాపలా కాయాలి. ఈ రకంగా తూర్పుతీరాన్ని అమెరికా అదుపులో పెట్టుకుంది.

ఇదంతా అభివృద్ధేనని మతిమాలిన పాలకులు మనల్ని నమ్మమంటారు. ఈ 'కోస్టల్ కారిడార్ ద్వారా' అభివృద్ధి పొందే విదేశీ కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను మన ప్రయోజనాలుగానే పరిగణించుకోమంటారు.

నాడు సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం అనేక త్యాగాలు, పోరాటాలు నిర్వహించిన ప్రజల ఆకాంక్షలను వమ్ముచేస్తూ బ్రిటీష్ దోపిడీ వర్గాల నుండి అధికారాన్ని బదలాయించుకొన్న దోపిడీ పాలకవర్గాలు దాన్నే స్వతంత్ర్యం అంటూ వంచన చేశాయి.

నేడు అభివృద్ధి పేరిట 'తిరిగి అవే పాలకవర్గాలు మనదేశాన్నే సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తున్నాయి.

'సెజ్‌ల పేరిట', 'కోస్టల్ కారిడార్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ దేశ వ్యతిరేక, ప్రజావ్యతిరేక నిర్మాణాలను ప్రజలు నమైక్యంగా ఎదిరించి, ప్రతిఘటించాలి. తమ జీవనోపాధి పరిరక్షణకోసం; తమ దేశ ప్రయోజనాల పరిరక్షణకోసం, తమ భూముల పరిరక్షణకోసం నమైక్యంగా ఉద్యమించాలి. వ్యవసాయంపై ఆధారపడ్డ మెజార్టీ ప్రజానీకం గల మన దేశంలో వ్యవసాయ భూములను, దున్నేవానికే భూమి ప్రాతిపదికగా పంచి, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచటమే నిజమయిన అర్థంలో అభివృద్ధి అవుతుంది తప్ప, పారిశ్రామికాభివృద్ధి పేరిట దేశ వనరు లనూ, సంపదనూ, సార్వభౌమత్వాన్నీ సామ్రాజ్యవాద పారిశ్రామిక సంస్థలకు అమ్మివేటం దేశ ద్రోహం అవుతుందని మన పాలకులకూ, ప్రభుత్వాలకూ తెలియచెప్పాలి! ఈ 'కోస్టల్ కారిడార్' నిర్మాణం రద్దయే వరకూ ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలి. బలమైన ప్రజా ఉద్యమం మాత్రమే పాలకుల, ప్రభుత్వాల ఈ దేశ ద్రోహపూరిత విధానాలను నిలువరించగలుగుతుంది. ◈

(1వ పేజీ నుండి)

సామాన్య ప్రజలకు సంబంధించిన డిమాండ్లను, మాట వరసకు ముందునపెట్టి, తమ సొంత డిమాండ్లను పరిష్కరించుకోవటానికే ఈ స్పాన్సరింగ్ కమిటీ ఈ సమ్మెకు పిలుపునిచ్చినట్లు ఎవరికైనా అనిపిస్తే దాన్ని తప్పుపట్టనవసరం లేదనిపిస్తోంది.

కార్మికవర్గానికి వర్గ రాజకీయాలతో చైతన్యం కల్గించకుండా, వర్గ అవగాహన,ఆ వర్గ పోరాట స్ఫూర్తులను కల్పించకుండా తనతోపాటు యితర శ్రామిక ప్రజానీకం యొక్క సమస్యలను పరిష్కరించగలిగే నాయకత్వ శక్తిగా తయారు చేయటం అసాధ్యం. గత 60 సంవత్సరాల కార్మికోద్యమ అనుభవం, ప్రస్తుత సమ్మె అనుభవం మనకు స్పష్టం చేస్తున్నది ఈ విషయాన్నే.

మొక్కుబడిగా, ఆనవాయితీగా మేమూ వున్నాము అని చెప్పుకోవటానికిగానూ ప్రతీ ఏడూ ఒక రోజు సమ్మెలకు పిలుపునివ్వటం, ప్రదర్శనాత్మక ఆందోళలను చేపట్టడం వలన కార్మికోద్యమం పుంజుకోదు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిభావంతంగా ఎదిరించి, ప్రతిఘటించే శక్తిగా రూపొందలేదు. దేశంలో సంస్కరణ విధానాలు అమలుజరుపబడుతున్న ఈ 15 ఏళ్ల కాలంగా ఏడాది కోసారి నిర్వహించిన 'నిరసన సమ్మెల' అనుభవాలూ, ప్రస్తుత సమ్మె అనుభవమూ యీ విషయాన్నే వెల్లడి చేస్తున్నాయి. ఈ అనుభవాల వెలుగులో భారత కార్మికవర్గాన్ని వర్గ రాజకీయ, వర్గ చైతన్య, వర్గ పోరాట అవగాహనల ప్రాతిపదికపై నడిపించాలన్న వాస్తవాన్ని నాయకత్వం గ్రహించాలి. అటువంటి కర్తవ్య నిర్వహణకు పూనుకోవటం అన్నది ఆవశ్యకం. ◆

అర్థభూస్వామ్య ...

(8వ పేజీ తరువాయి)

వీలులేదు. ప్రధాన రోడ్లపై సంచరించటానికి వీలులేదు. దళితులు తమ పశువులను గ్రామానికి చెందిన మేత పొలాల్లో మేపుకోవటానికి వీలులేదు. దళితులకు ఎవ్వరూ పాలు అమ్మరాదు. ఇందువలన పసి పిల్లలు ఎన్నో బాధలకు గురికాబడ్డారు. కాకపోతే దళితులను ఆ గ్రామంలో గల రెండు అంగళ్ళలో కొనుగోలు చేసుకోవటానికి అనుమతించారు.

ఇంత జరుగుతున్నా పరిపాలనాధికారులుకానీ, పోలీసులుకానీ, ఈ దళితుల హక్కులను పరిరక్షించటానికి ముందుకు రాలేదు. మద్రాసు హైకోర్టు వీరికి భూయాజమాన్యాన్ని దఖలుపరుస్తూ పట్టాలు యిమ్మని ఆదేశించినా, ప్రభుత్వం భూమిపై దళితులకు పట్టాలు యిచ్చి చట్టబద్ధంగా భూయాజమాన్య హక్కులను కల్పించలేదు.

పట్టాలు లేకపోవటం వలన, దళితులకు ఆ పోరంబోకుపై భూయాజమాన్య హక్కు లేకపోవటం వల్లనే గ్రామానికి చెందిన సవర్ణ హిందువులు దళితులపై దౌర్జన్యపూరితంగా వ్యవహరించి వారికి ఆ భూములు దక్కకుండా చేయటానికి అవకాశం కలుగుతోంది.

ప్రస్తుతం, యితర గ్రామాల్లోని దళితుల అండతో ఆ గ్రామంలోని 30 కుటుంబాలకు చెందిన దళితులు, తమకు కేటాయించబడ్డ భూముల్లో తిరిగి ఆగష్టు నాల్గవ తేదీ నుండి వ్యవసాయం చేయటానికి పూనుకున్నారు. దళితుల యీ ప్రయత్నాన్ని గ్రామంలోని సవర్ణ హిందువులు మవునంగా సహిస్తారా లేక తమ స్వభావానికి అనుగుణంగా ఏదో ఒక చట్ట విరుద్ధ రూపంలో, జిత్తుతో ఆ దళితుల ప్రయత్నాలను వమ్ము చేయబూనుకొంటారా అన్నది వేచి చూడాల్సిందే!.

వ్యక్తిగత భూయాజమాన్య ప్రాతిపదికపై సాగుతున్న అర్థఫ్యూడల్ వ్యవస్థ కొనసాగినంత వరకూ దున్నేవానికే భూమి లభించటంగానీ, దళితులకు, వ్యవసాయ కూలీలకు భూయాజమాన్య హక్కులు సంక్రమించటం కానీ అసాధ్యం అన్నది యింత కాలపు అనుభవాలు స్పష్టం చేస్తున్న విషయం. అందువల్లనే ప్రస్తుత భూస్వామ్య వ్యవస్థను కూల్చివేసి, దున్నేవారికే భూమిని లభింపచేసే వ్యవస్థ ఏర్పాటుకోసం పోరాటాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. ◈

కామ్రేడ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు వర్ధంతి సభ

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు 49వ వర్ధంతిని 24.7.08న ఆయన స్వగ్రామమైన చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో ఆయన అమరస్థూపం వద్ద రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరస్థూపం వద్ద ఎర్రజెండాను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) నందిగామ ఏరియా నాయకుడు కామ్రేడ్ కాసరెల్లి మస్తాన్ ఆవిష్కరించి అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని, కా॥ నాగేశ్వరరావుకు జోహార్లు తెలుపుతూ నినాదాలిచ్చారు. అనంతరం కా॥ నాగేశ్వరరావు చిత్రపటానికి ఆయన సోదరుడు, నందిగామ మార్కెట్‌యార్డు ఛైర్మన్ కామ్రేడ్ వాసిరెడ్డి సాంబశివరావు పూలదండవేసి వినయ పూర్వకంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎం.పున్నారావు, మేదరమెట్ల వెంకయ్య, వాసిరెడ్డి నాగేశ్వరరావు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) నాయకులు కా॥ రాచబంటి కోటేశ్వరరావు, యాదల నాగేశ్వరరావు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ కా॥ ఎం.కామేశ్వరి, జిల్లా నాయకురాలు ఎ.నాగమల్లీశ్వరి, గ్రామ సర్పంచి ఇంకా బంధువులు, అభిమానులు పూలతో ఘనంగా నివాళులు అర్పించి జోహార్లు పలికారు.

అనంతరం జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ- 60 సంవత్సరాలుగా స్వతంత్ర పాలన సాగిస్తున్నామని చెపుతున్న పాలకులు అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం అనే పేరుతో సెజ్‌లు కోస్తా కారిడార్ పేరుతో వేలు, లక్షలాది ఎకరాల భూములను స్వదేశీ, విదేశీ దోపిడీవర్గాలకు చట్టబద్ధంగా అప్పచెపుతున్నారని, అలాగే వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించకుండా దేశీయ దళారీ, విదేశీ పెట్టుబడిదారులకు అప్పచెప్పటంతో రైతాంగం దివాళా తీసిందని ఫలితంగా ఆహార పంటల స్థానంలో అంతర్జాతీయ మార్కెట్ వ్యాపార అవసరాలకు అనుగుణమైన పంటను ప్రోత్సహించటంలో ఆహార కొరత ప్రమాదం మన ముంగిట్లోనే ఉన్నదని అన్నారు. పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకటం దిన దిన గండంగా మారిపోయిందని అన్నారు. పాలకుల దళారీ వర్గ స్వభావం నానాటికీ మరింత రుజువు అవుతున్నదని దళారీ పాలకులు అధికారంలో కొనసాగుతున్న కాలం ప్రజల సమస్యలు ఏవీ పరిష్కారం కాకపోగా మరింత జటిలమవుతాయని కనుక ఇప్పటికైనా ప్రజాస్వామిక వాదులు-విప్లవశక్తులు ఐక్యం అయి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను ఏర్పాటుకోసం ఉద్యమించాలని అదే అమరులకు ఇచ్చే నివాళి అని ముగించారు.

వర్షపుజల్లుల్లో కూడా 100 మందికిపైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ◈

ఆకలితో ...

(9వ పేజీ తరువాయి)

అయినా ఆ తేయాకు తోట కార్మికులను ఆకలి బాధ నుండి తప్పించి ఆకలి మరణాల నుండి రక్షించటానికి పాలనావ్యవస్థ ఏ రకమయిన చర్యలూ తీసుకోలేదు. తిరిగి ఈ సంవత్సరం ముగ్గురు ఆకలి మరణం పాలయ్యారు. మరికొందరు అదేవైపు పయనిస్తున్నారు.

144.93 హెక్టార్ల వైశాల్యం గలిగిన ఈ జాలానగర్ టీ ఎస్టేట్‌లో 500 మంది కార్మికులు పని చేస్తున్నారు.

తేయాకు తోటల యజమానులు, పారిశ్రామికాధిపతులకు చీమ కుట్టినా మధనపడి, గగ్గోలుచేసి, ఆదుకొనే పాలకులూ, పాలకవర్గాలూ, ప్రభుత్వాలూ- కార్మికులు ఆకలితో పదే, పదే మరణిస్తున్నా నామమాత్రంగా కూడా పట్టించుకోరు. అయినా మనది 'ప్రజాస్వామ్య' పాలనే అని నమ్మమంటారు. మెజార్టీగా వున్న పేద ప్రజల ప్రయోజనాలను పట్టించుకోకుండా, కొద్దిమందిగా వున్న పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల వారి ప్రయోజనాలకోసమే నిర్వహించబడే పాలన 'ప్రజాస్వామ్యం' ఎందుకవుతుంది?. ఇటువంటి దారుణ వ్యవస్థను 'ప్రజాస్వామిక వ్యవస్థ' అని చెప్పటంకన్నా వంచన ఏముంటుంది?

అందుకే మెజార్టీగా వున్న శ్రామిక ప్రజలను పట్టించుకోని ఈ దోపిడీ వ్యవస్థను కూలద్రోసి, సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటం అన్నది భారత కార్మికవర్గానికి అనివార్య కర్తవ్యమయింది!. ◈

కళాశాల, హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌ఓ రంపచోడవరం డివిజన్ కమిటీ విజ్ఞప్తి!

మిత్రులారా!

మన తూర్పుగోదావరిజిల్లా ఏజెన్సీకి ప్రధాన కేంద్రం అయిన రంపచోడవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశల, డిగ్రీ కళాశాల ఉన్నాయి. వీటికి అనుబంధ హాస్టల్స్ లేకపోవడంతో గిరిజన విద్యార్థుల చదువులకు చాలా ఇబ్బంది కలుగుతున్నది. విద్యార్థుల ఆందోళనల ఫలితంగా గత కొద్ది సంవత్సరాలు నుండి ఐడిడిఏ బాధ్యత మీద గిరిజన విద్యార్థులకు స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్ (ఎస్‌ఎంహెచ్) నడిపేవారు. ఐటిడిఏ నిర్లక్ష్యం వల్ల ఇప్పుడు అవి కూడా బిల్డింగ్స్ కొరత తదితర అసౌకర్యాలు వల్ల గిరిజన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

1. సాధన హాస్టల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు ఇక్కడ ఉంటున్నారు. 2001 సంవత్సరంలో ఈ హాస్టల్‌ను పెట్టారు. ఈ హాస్టల్ లేకముందు ఇక్కడ భవనాలలో పాలకేంద్రం నిర్వహించేవారు. పాలకేంద్రం మూతబడిపోవడంతో ఈ భవనాలను సాధన హాస్టల్ (ఎస్‌ఎంహెచ్) కి కేటాయించారు. అదనంగా మరో రేకుల షెడ్డు కూడా నిర్మించారు. అయితే గత విద్యా సంవత్సరం చివర్లో మళ్ళీ ఈ భవనాన్ని పాలకేంద్రానికి కేటాయించారు. పాలకేంద్రం నిర్వాహకులు భవనాలను రిపేరు చేస్తుంటే చూసి విషయం అర్థం అయిన విద్యార్థులు ఆందోళన చెందుతూ ఐటిడిఏ అధికార్లు చుట్టూ తిరిగారు. "మాకు హాస్టల్‌కి వేరే బిల్డింగ్ చూపించమని" వేడుకున్నారు. మీకు వేరే బిల్డింగ్ కేటాయిస్తామని ITDA అధికార్లు అనేకసార్లు హామీయిచ్చారు. ఏప్రిల్‌లో సెలవులకు ఇళ్ళకి వెళ్ళిన విద్యార్థులు జూన్‌లో తిరిగి హాస్టల్‌కి వచ్చేసరికి పాలకేంద్రం పెట్టారు. ఉన్న ఒక్క రేకులషెడ్డులో ఉండటానికి అందరికీ సరిపోదు. కరెంట్ లేదు. మంచినీటి బోరుకు మోటారు బిగించి నీరు లేకుండా చేశారు. ఇదే విషయాన్ని మళ్ళీ అనేకసార్లు అధికార్ల దృష్టికి తీసుకెళ్ళినా అధికార్ల నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో **అటు చదువులు మానుకోలేక, ఇటు ఛార్జీలు పెట్టుకుని రోజూ ఇంటి నుంచి** కళాశాలలకు వచ్చి, పోలేక నీరు, కరెంటు లేక ఆ చీకటి రేకుల షెడ్‌లోనే ఉంటున్నారు.

2. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిరిజన విద్యార్థులకు ఆ కళాశాలనందు కొన్ని తరగతి గదులును కేటాయించి స్టూడెంట్ మేనేజిమెంట్ హాస్టల్‌ను నిర్వహించేవారు. కొత్తగా సైన్స్ గ్రూపులు పెట్టడంతో ఆ గదులు కూడ ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొత్తగా హాస్టల్‌కి వేరే బిల్డింగ్ కేటాయించాలని పదులసార్లు అధికార్లను వేడుకున్నారు. కొత్త హాస్టల్ బిల్డింగ్ కడుతున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి రెడ్యానాయక్ గారు చేత హడావుడిగా శంకుస్థాపన చేయించారు. శంకుస్థాపన చేయించి 6 నెలలు గడిచిపోయినా ఇంత వరకు బిల్డింగ్ రూపం దాల్చలేదు. ఫలితంగా విద్యార్థుల వెతలు మళ్ళీ మొదటికి వచ్చాయి. ITDA అధికార్ల చుట్టూ తిరిగిన విద్యార్థులు-సమస్య వివరించినప్పుడల్లా "మీరు బిల్డింగ్స్ చూసుకొని అక్కడకి వెళ్ళండని" సలహా ఇచ్చేవారు. దీంతో ఇంత కాలం అధికార్లు చుట్టూ తిరిగి, తిరిగి అసహనానికి గురైన విద్యార్థులు ప్రదర్శనగా వెళ్ళి ప్రాజెక్టు ఆఫీసర్‌గారిని, RDO గారిని కలవగా స్టూడెంట్ మేనేజిమెంటు హాస్టల్ కాబట్టి తమకు సంబంధం లేదని, విద్యార్థుల బిల్డింగ్స్ చూసుకొని వాటికి అద్దె కూడా విద్యార్థులే చెల్లించాలని, తమకేమి ఆదేశాలు లేవని తామేం చేయలేమని చేతులెత్తేశారు.

డిగ్రీ హాస్టల్ విద్యార్థులు సుమారు 120 మంది వరకు ఉన్నారు. ఉన్న ఒక్క గదిని కూడ ఖాళీ చేయాల్సిందిగా ప్రిన్సిపాల్‌గారు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక అనేక మంది విద్యార్థులు చదువులు మానుకుంటున్నారు. మరొక SMH (ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న బాలికలకు) ఉంది. 100 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఈ హాస్టల్ బిల్డింగ్స్ వీరికి సరిపోవడం లేదు. వర్షం వస్తే గోడలన్నీ ఊటెక్కి పడుకోలేని పరిస్థితి. ఉన్న అతి తక్కువ మరుగుదొడ్లకి డోర్స్‌లేవు. ఇంత మందికి ఒకే ఒక్క మంచినీటి బోరు మాత్రమే ఉంది. దీనిలో నీరు బురదతో ఎర్రగా వస్తాయి. ఈ హాస్టల్‌కి కనీసం వాచ్‌మెన్ కూడా లేదు. ఈ సమస్యలు పరిష్కరించాలని DTWO గారికి విద్యార్థినులు విన్నవించారు. ఇప్పటికీ ఎటువంటి ప్రయత్నాలు చేపట్టలేదు.

అతికొద్ది మంది విద్యార్థుల చదువులకు కోట్లాది రూపాయలు ప్రైవేటు కళాశాల యాజమాన్యానికి ముట్టచెబుతున్న ITDA అధికార్లు అత్యధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులున్న ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం హాస్టల్ సౌకర్యం కల్పించకపోవడం చాలా విచారకరమైన విషయం. విద్యార్థినీ, విద్యార్థులను 'ఈపూట' తిండి గురించి, రేపు ఉండే చోటు గురించి' నిరంతరం భయాందోళనలతో ఉంచడం ఏ గిరిజన అభివృద్ధి కోసమో పరిశీలించాలని కలెక్టర్‌గార్ని, ITDA పాలక మండలిని కోరుతున్నాం. కావున ఇప్పటికయినా వెంటనే స్పందించి గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా ఉండే విధముగా యుద్ధప్రాతిపదికన ఈ క్రింది తాత్కాలిక, శాశ్వత చర్యలు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

డిమాండ్లు:

1. రంపచోడవరం సాధన హాస్టల్‌లో డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఉన్న గిరిజన విద్యార్థులందరికీ వారు ఉండటానికి కావల్సిన బిల్డింగ్స్‌ను ITDA చూపించి వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలి.
2. డిగ్రీ కళాశాల విద్యార్థులు హాస్టల్‌కోసం శంకుస్థాపన చేసినచోట పక్కా భవనాన్ని నిర్మించి ప్రభుత్వ బాధ్యతతో రెగ్యులర్ వార్డెన్ ఉండే విధంగా కళాశాల అనుబంధ హాస్టల్‌ను నెలకొల్పాలి.
3. డిగ్రీ, ఇంటర్మీడియట్ బాలికలకు అనుబంధ హాస్టల్ ఏర్పరచాలి. బిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు అనుబంధ హాస్టల్‌ను ఏర్పరచాలి.
4. దేవీపట్నం, మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం గిరిజన బాలికలకు కనీసం SM హాస్టల్స్ కూడా లేవు. కావున ప్రస్తుతానికి హాస్టల్‌ని SM (బాలికలకు) ఏర్పాటు చేయాలి. ఈ సెంటర్‌లలో బాలురకు కూడా SM హాస్టల్ లేనిచోట స్థాపించాలి.
5. ఏజన్సీలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు పక్కా భవనాలు నిర్మించి, మరుగుదొడ్లు, మంచినీరు, వాచ్‌మెన్ తదితర సౌకర్యాలన్నీ కల్పించి ప్రతీ కళాశాలకు అనుబంధ రెగ్యులర్ హాస్టల్స్‌ను స్థాపించాలి.
6. రాజమండ్రిలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకోసం గిరిజన సంక్షేమ శాఖ ద్వారానే ప్రత్యేక హాస్టళ్ళు నిర్మించి, నిర్వహించాలి. అంత వరకూ యస్.సి. హాస్టల్స్‌లో ఉండేందుకు ఎస్.సి. విద్యార్థినీ, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా వసతి సౌకర్యాలను అభివృద్ధిపరచాలి.

పై చర్యలన్నీ తాత్సారం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాము.

విప్లవాభివందనలతో

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (PDSO)
అల్లూరి సీతారామరాజు యువజనసంఘం (NYS అనుబంధం)
రంపచోడవరం డివిజన్ కమిటీ

రంపచోడవరం, 7.8.'08:

ఈ సమస్యల పరిష్కారంకోసం తాత్కాలిక, శాశ్వత చర్యలు తక్షణమే చేపట్టాలని **PDSO, NYS**ల కరపత్రంతో విస్తృత ప్రచారం చేసి రంపచోడవరంలో 7.8.08న తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ గోపాల్‌కిష్ణ ద్వివేదికి ITDA అధికార్లకు నియోజకవర్గ స్థాయి ప్రజా సదస్సులో తమ డిమాండ్స్‌ను వివరించారు.

PDSO, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం, రంపచోడవరం డివిజన్ కమిటీలు డిమాండ్ చేశాయి.

అనంతరం ITDA P.O ఆర్డీవోలను పిలిచి రెండు రోజులలో బిల్డింగ్స్ కేటాయించాల్సిందిగా ఆర్డర్స్ జారీ చేశారు. వచ్చే నెలలో ITDA పాలకవర్గ సమావేశం ఉంది. అప్పటికి గిరిజన విద్యార్థుల హాస్టల్ సమస్య పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకి ఆదేశాలు జారీ చేసారు. వంద మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి PDSO నాయకులు జి.అనీల్‌కుమార్, పి.ఈశ్వర్, పి.సుగ్గిరెడ్డి, పల్లాల సోమిరెడ్డి, రవి, మణి తదితరులు నాయకత్వం వహించారు.

ప్రజా సదస్సు అనంతరం 9వ తేదీన డిగ్రీ, ఇంటర్ హాస్టల్ విద్యార్థుల ప్రతినిధి బృందం ITDA అధికార్లను కలవగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి హాస్టల్ విద్యార్థులకు ఇప్పుడున్నది కాక తాత్కాలికంగా మరొక బిల్డింగ్‌ను కేటాయించారు. సాధనా హాస్టల్ విద్యార్థులకి (ఇంటర్) దీప్తి క్యాంపును కేటాయించారు. హాస్టల్‌కి ప్రత్యేక భవనాలు నిర్మిస్తామని అప్పటి వరకు అక్కడ ఉండమని సమస్యలను తాత్కాలికంగా పరిష్కరించారు.

సామాన్య పాఠకులే కాదు, పాలకులూ చదవాల్సిన పుస్తకం 'అనంత ప్రస్థానం'

\- చెరుకూరి

అనంతపురంజిల్లా కరువును గురించి కరువు మూలాల గురించి కరువుపట్ల పాలకుల నిర్లక్ష్యం గురించి, దాని నివారణ-అందులోని సాధ్యాసాధ్యాలు గురించి డా॥ వై.వి.మల్లారెడ్డి గారు రాసిన వ్యాసాల్ని 'కదలిక' పత్రిక పుస్తక రూపంలో ప్రచురించింది.

డా॥ మల్లారెడ్డి గారు ఒక స్వచ్ఛంద సంస్థ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్)లో పనిచేస్తూ, అనేక ప్రాంతాల్లో, దేశాల్లో పర్యటించి, అనేక పుస్తకాల్ని, డాక్యుమెంట్లని పరిశీలించి, పరిశోధించి తమ సంస్థ ద్వారా జిల్లాలో ప్రయోగించి చూచిన పరిష్కారాల సారమే 'అనంత ప్రస్థానం'.

ఒకప్పుడే జిల్లాలో జాతీయస్థాయి నాయకులున్నారు. అందులో జిల్లా అభివృద్ధి పైన ఆకాంక్ష వున్న వారికి అవకాశం లేక, అవకాశం వున్నవారికి అవగాహన లేక, తర్వాత తరం నాయకులకు అరకొర అవగాహన వున్నా వారికి జిల్లా క్షేమం కన్నా తమ తమ కుటుంబాల సంక్షేమమే ముఖ్యమనుకొని జిల్లాని కొల్లగొట్టారు. ఇంకా గుల్లగుల్లగా కొల్లగొడ్తున్నారు.

రాయ లేలినా, రామారావు యేలినా, రాజశేఖరుడేలినా కరువుబారి నుండి ఈ జిల్లానెవరూ తప్పించలేదు. అలాంటి కార్యాచరణ ఎవరికీ లేదు.

"అనంతపురంజిల్లా గురించి బయటి ప్రపంచానికి ఇప్పటికీ తెల్సింది చాలా తక్కువ. ఈ జిల్లా విస్తీర్ణంలో రాష్ట్రంలోనే పెద్దజిల్లా అని ఒక కోటి మంది నివసించగల విశాల భూభాగం ఉన్నప్పటికీ ఇక్కడ 36 లక్షల మంది ప్రజలు మాత్రమే ఎందుకున్నారనీ, భారత దేశంలో అతి తక్కువ వర్షపాతం గల రెండవ జిల్లా అనీ, 26 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నప్పటికీ ఇన్నేళ్ల తర్వాత కూడా సాగునీరు 10 శాతం భూమికి కూడా అందటంలేదని, ఏ వ్యవసాయ, ఆర్థిక విధానాలవల్ల ఇక్కడి ప్రజలు ఒకే ఒక వేరుశెనగ పంట పండిస్తూ దగ్ధమౌతున్నారనీ, ప్రతి యేటా ఈ జిల్లా నుండి 3 లక్షల మంది ప్రజలు ఎందుకు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారనీ, ఏ దుష్ప్రభావాల వల్ల ఇక్కడ 500 మంది పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారనీ, ప్రతి యేటా వేలాది పశువులు ఏ కారణం గా వధ్యశాలకు తరలివెళ్తున్నాయనీ ఒక చోట వంద మంది చేరి పనిచేసే చిన్న చిన్న పరిశ్రమలు కూడా ఇక్కడ ఎందుకు లేవని ఇలాంటి ఎన్నెన్నో దారుణ వాస్తవాలు ఇతర ప్రాంతాల వారికి ఇప్పటికీ నిజంగా తెలియదు".

"ఈ జిల్లా పేరు వినగానే కరువు జిల్లా అనో, ఫ్యాక్షన్ జిల్లా అనో రెండు మాటలు పారేస్తారేగాని వాటి మూలాల గురించి తెల్సుకున్నవారు చాలా తక్కువ. ఆలోచించేవారు మరీ తక్కువ. ఈ జిల్లా కరువు జిల్లాగా ఎందుకు చరిత్రలో స్థిరపడిపోయింది? ఇక్కడ ఏ అసహజ వనరులు ఈ జిల్లాను అలా స్థిరీకరించినాయి? కేవలం వర్షపాతం లేకపోవడమేనా? కేవలం ప్రభుత్వ నిరాదరణేనా! పాలకవర్గ సుదీర్ఘ నిర్లక్ష్య వైఖరి పాత్ర ఇందులో ఎంత? ఈ స్థితి నుండి ఈ జిల్లాను బయటపడ వేయటానికి మార్గాలే లేవా? కరువులనూ, దారిద్ర్యాలనూ అరికట్టే కార్యాచరణ దిశలే లేవా? ప్రత్యామ్నాయ భూ వినియోగ పద్ధతులే లేవా? ప్రత్యామ్నాయ జీవనాధారాన్ని కల్పించే వ్యవసాయ ప్రణాళిక లేవీ లేవా? సాగునీరు అందించే జల వినియోగ నిర్మాణాలు సాధ్యం కావా? వ్యవసాయాధారిత పరిశ్రమల కల్పనకు, వ్యవసాయేతర పరిశ్రమల స్థాపనకు ఆచరణ సాధ్యమైన మార్గాంతరాలే లేవా? ప్రజల సాంఘికశక్తిని పెంపొందించే నిర్మాణాత్మక కార్యాచరణతో ఈ జిల్లాను మరో అనంతపురంజిల్లా సాధ్యమే అని నిరూపించటానికి చిత్తశుద్ధితో చేయగల కృషి సాధ్యం కాదా? నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ పథకాలు రూపొందించి ప్రజల భాగస్వామ్యంతో సుదీర్ఘ అనంత సంక్షోభాన్ని పరిష్కరించే రూపాంతరాలే లేవా? పర్యావరణాన్ని జీవన వనరులుగా మార్చుకొనేందుకు అవసరమైన సాంకేతిక జీవనాన్ని ఉపయోగపెట్టుకొనే శాస్త్రీయ దృక్పథమే లేదా?" కలవరపడుతూ ఈ ప్రశ్నలన్నీ సంధించిన సుప్రసిద్ధ రచయిత సింగమనేని నారాయణ గారికి ఈ పుస్తకంలో సవివరంగా సమాధానాలు లభ్యమౌతాయి.

జిల్లాలో చెరువులు, కుంటలు, తలారులు లాంటి ఆరు వేల సాంప్రదాయక నీటి వనరులున్నాయి, పెన్నార్, కుముద్వతి, అప్పర్ పెన్నార్, పిఏబిఆర్, చాగల్లు మద్దిలేరు జిజిఎస్‌లాంటి ప్రాజెక్టులున్నాయి. ఇవిగాక కృష్ణ, తుంగభద్ర జలాల్ని మళ్లించాలనే ఆలోచన వుంది, 36 లక్షల జనం వున్నారు. లక్షల ఎకరాల వృధా భూములున్నాయి. ("పనికిరాని భూములనేవి లేవు ఉన్నవల్లా వృధాగా వున్న భూములే") ఇన్ని వనరులున్న జిల్లాలో.

మట్టితేమను నిలువ వుంచటం; చెక్ డ్యాంల నిర్మాణం ద్వారా వాగుల వెంబడి వున్న ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెంచడం, చిన్న చిన్న నదుల, వంకల మీద మధ్యతరహా నీటి ప్రాజెక్టులు కట్టడం, సహజ ఉత్పాదకత కోసం అటవీకరణ-తద్వారా పచ్చదనాన్ని అభివృద్ధి చేయటం; 30 శాతం సాగుభూమిలో మామిడి, చింతలాంటి తోటలు పెంచటం; అటవీ వ్యవసాయం ద్వారా బోడి కొండల్లో పచ్చదనం, పాడి పరిశ్రమ, పశువులమేత, వాటర్ షెడ్‌లను అభివృద్ధి పరచటం-అందులో ప్రజల్ని భాగస్వాముల్ని చేయటం; భూగర్భ జలాల మీద జనమందరికీ సమాన అధికారం కల్పించటం; వ్యవసాయానికి నోచుకోని వేల ఎకరాల్ని రైతులతో ఏర్పడిన సహకార సొసైటీలకు యిచ్చి తగు సహకారమందించడం ద్వారా పశువులు, పశువుల మేత పెంచి, మాంస పరిశ్రమ, పాడి పరిశ్రమ పెంపొందించటం; పడే వర్షాన్ని-ప్రత్యక్షంగా పంటలకు వాడుకోవటం, చెరువుల్లో, కుంటల్లో కొంత కాలం నిల్వ వుంచుకోవటం, భూమిలోకి ఇంకించి బావుల ద్వారా, బోర్ల ద్వారా వాడుకోవటం; జిల్లా బయట నుండి వచ్చే నదీజలాలు -ఇలా అన్ని రకాల నీటి వనరుల్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా మొత్తం వృధాగా పడివున్న భూములన్నిటినీ వ్యవసాయ యోగ్యం చేయవచ్చని మల్లారెడ్డి గారు తేల్చారు.

జిల్లాలో బహుముఖ కరువు చిత్రాన్ని పరిష్కరించే సమాలోచనలో కరువు-దుర్భిక్షం, ఋతుపవనాల ప్రభావం భౌతిక శీతోష్ణస్థితి, కరువు రకాలు- అంటే పంట కరువు, నీటి కరువు, వర్షపు కరువులు, నీటి వివాదాలు, వినియోగాలు, వాటర్ గ్రిడ్ సమతుల్యం అనే పంటల అలవాటు, పండ్లతోటల పెంపు, వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ తదితరాల్ని సమగ్రంగా విశ్లేషించి గ్రామాభివృద్ధిని ఒక నిరంతర ప్రజా ప్రక్రియగా -మానవ వనరుల అభివృద్ధే ఇతర అభివృద్ధి ప్రక్రియలకు పునాదిగా -వీటికి సామాన్య జనులే శ్రీకారం చుట్టాలని చెప్పూ, దారిద్ర్యమూ కరువు బాధలతో శాశ్వత జీవచ్ఛవాలుగా బ్రతుకుదామా? లేక వాటి నివారణకు నడుం బిగిద్దామా? అనే నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు.

నీటి వినియోగంలో అసమగ్ర, అసమతుల్య వినియోగాన్ని ఎత్తి చూపుతూ నీటి వినియోగంలో సమతుల్యమూ, ప్రజలందరికీ నీటిపై సమాన హక్కు కల్గి వుండటమే గ్రామీణాభివృద్ధికి పునాదిగా వక్కాణించారు.

దిగుమతి ప్రభావం నుండి తమ రైతుల్ని ఆదుకోవటానికి జపాన్ వెయ్యి శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తుంది; చాలా అభివృద్ధి చెందిన దేశాలు 70 శాతం సబ్సిడీ ఇవ్వటం ద్వారా తమ రైతుల్ని ఆదుకుంటాయి. ఇక్కడ రైతులకి మద్దతు ధర ప్రకటించాలని చిన్న కోర్కె కోరారు రచయిత.

కార్పోరేట్ వ్యవసాయం ఈ దేశానికి పనికిరాదని, భూసంస్కరణలు అమలుచేసి, ఉపాధి అవకాశాలు పెంచటమే సంక్షోభ పరిష్కారమని శాస్త్రీయంగా తెలిపారు.

ప్రత్యేక రాష్ట్రాలు కాదు- ప్రజల అభివృద్ధి కావాలని, వ్యవసాయకంగా అభివృద్ధి చెందకుండా ఇతర రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాలుగాని, ప్రాంతాలు గాని లేవని తేల్చారు.

ఎక్కడో ప్రపంచంలో కొన్నిచోట్ల లభ్యమయ్యే పెట్రోలు, డీజిల్ విదేశాల నుండి దిగుమతి చేసుకొని దేశమంతటా పంపిణీ చేస్తున్నాం. అలా దేశంలో లభ్యత వున్న ప్రాంతం నుండి నీరు అది లేని ప్రాంతాలకు తరలించాలనీ-

రైతు ఏ ప్రాజెక్టు కింద నిర్వాసితుడౌతున్నాడో అదే ప్రాజెక్టులో అతను ప్రథమ లబ్ధిదారుడవ్వాలో సూచిస్తూ,

అనంతపురిజిల్లాలో 10-15 ఎకరాల భూమి తీసుకొని వర్షాధారంపై ఆధారపడి దాన్ని పండించాలని అనుసంధాన నీటిపారుదల విధానాన్ని వ్యతిరేకించే వారిని సవాల్ చేస్తున్నారు.

ఇంత విషయ పరిజ్ఞానం, ప్రభుత్వ పని విధానంపట్ల అవగాహన వున్న రచయితకు ప్రభుత్వ సహాయంపట్ల, హెల్ప్ లైన్ల హెల్ప్‌పట్ల భ్రమలుండటం ఆశ్చర్యకరం. రతనాల సీమ రాళ్లసీమగా మారటానికి స్థానిక వనరుల

(తరువాయి 13వ పేజీలో)

డౌ కంపెనీ పరిశోధనా కేంద్రాన్ని నిర్మించటాన్ని నిరసిస్తూ ఆందోళన జరుపుతున్న షిండే గ్రామ ప్రజలు; రైతులు

1984వ సంవత్సరంలో భోపాల్‌లో విషవాయువును వదిలి మారణహోమాన్ని సాగించిన యూనియన్ కార్బయిడ్‌ను అమెరికన్ బడా రసాయనాల కంపెనీ అయిన డౌ కంపెనీ కొనుగోలు చేసుకొంది. నాటి మారణహోమంలో బాధితులయినవారికి నేటికీ పరిహారం చెల్లింపబడలేదు. నాటి విషవాయువు వెలువడిన అనంతరం విషతుల్యంగా మారిన భూ, జల, పరిసరాలను నేటికీ ప్రక్షాళన చేయటం జరగలేదు. భోపాల్ యూనియన్ కార్బయిడ్ కర్మాగారపు ఆవరణలో వున్న విషతుల్యమయిన వ్యర్థాలను తొలగించటం జరుగలేదు. కానీ ఆ కంపెనీని కొనుగోలు చేసిన డౌ యాజమాన్యం మాత్రం భారతదేశంలో తిష్టవేసి తన కార్యకలాపాలు నిర్వహించుకోవటంకోసం సన్నాహమయింది.

నాటి యూనియన్ కార్బయిడ్ సృష్టించిన మారణహోమానికి డౌ కంపెనీని బాధ్యత వహింపచేసి, తమకు పరిహారం యిప్పించమనీ, భోపాల్ పరిసర ప్రాంతాలను విష కాలుష్యం నుండి ప్రక్షాళన చేయించమనీ, తమకు తగు పునరావాసం కల్పింపచేయమనీ భోపాల్ గ్యాస్ బాధితులు ఆందోళన సాగిస్తున్నారు.

మరోవైపు డౌ కంపెనీ యాజమాన్యం ఎన్నడో జరిగిన ఘటనకు తాను బాధ్యత వహించనవసరంలేదనీ, యూనియన్ కార్బయిడ్ ఆస్తులను ఆ ఘటన జరిగిన చాలా ఏళ్ళ తర్వాత ముగ్గురకు అమ్మివేయటం జరిగిందనీ అందువలన నాటి మారణహోమానికి తాను బాధ్యతను వహించననీ తెగేసి చెప్పటమే కాకుండా, తనకనుకూలంగా మన దేశంలోని దళారీ బడా పారిశ్రామిక వేత్తలను మలచుకొంది. వారితోపాటు ప్రధాన మంత్రీ, తదితర మంత్రులూ కూడా అదే వాదనను అంగీకరిస్తూ మన దేశంలో తిష్టవేసి తన కార్యకలాపాలు నిర్వహించుకోవటానికి అనుగుణంగా డౌ కంపెనీకి అవకాశాలు కల్పించారు. అందులో భాగంగా మహారాష్ట్రలో పూనెకు 40 కిలో మీటర్ల దూరంలో చకన్‌కు సమీపాన గల షిండే గ్రామంలో 100 ఎకరాల భూమిని కేటాయించి డౌ కంపెనీకి యిచ్చారు. ఈ భూమిలో డౌ కంపెనీ గ్లోబల్ స్థాయి పరిశోధనా కేంద్రాన్ని 300 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబూనుకొంది.

తమ గ్రామానికి చెందిన పశువుల మేతభూమిని, తమ గ్రామ పంచాయితీ అనుమతి లేకుండా, తమ అంగీకారం లేకుండా డౌ కంపెనీకి యివ్వటాన్ని షిండే గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తూ, ఆ భూమిని డౌ కంపెనీకి యివ్వరాదంటూ ఫిబ్రవరి నెలలో ఆందోళన జరిపారు.

భామచంద్రడోంగార్ బజావో షేత్కారీ వర్కరీ సంఘర్ష సమితి, ప్రభుత్వేతర సంస్థ అయిన లోకాయత్ సంస్థల ఆధ్వర్యంలో వీరు తమ ఆందోళనను నిర్వహించారు. వీరి ఆందోళనలో బొంబాయి హైకోర్టు రిటైర్డ్ జడ్జి అయిన పి.బి.సావంత్, బి.జి.కోల్సేలు కూడా పాల్గొన్నారు. గ్రామస్థులు డౌ కంపెనీకి యిచ్చిన స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని అడ్డుకొన్నారు. కంపెనీ పోలీసులను మోహరించినా, వెనక్కి తిరిగిపోక నిర్మాణం సాగించకుండా అడ్డుకొన్నారు.

ఈలోగా భోపాల్ గ్యాస్ పీడితుల ఆందోళనలు ముమ్మరం కావటంతో యిటీవలనే కేంద్ర ప్రభుత్వం ఆందోళనకారులతో ఒక ఒప్పందాన్ని చేసుకొని వారిచేత ఆందోళనను విరమింపచేసింది. భోపాల్ హైకోర్టులో గ్యాస్ పీడితులకు చెల్లించాల్సిన పరిహార బాధ్యతను డౌ కంపెనీనే భరించాలని కేంద్ర రసాయనాల మంత్రిత్వశాఖ వేసిన దావాను సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న హామీని కేంద్ర ప్రభుత్వం యిచ్చింది. అందువలన డౌ కంపెనీ దుర్మార్గాన్ని ప్రజల్లో ఎండగడుతూ భోపాల్ గ్యాస్ పీడితులు సలుపుతున్న ఆందోళనను ప్రభుత్వం చాకచక్యంగా అటకెక్కించగలిగింది.

మరోవైపు బొంబాయి హైకోర్టు నుండి పూనెలో డౌ కంపెనీ తలపెట్టిన నిర్మాణాన్ని కొనసాగించాలనే రూలింగును ఆధారం చేసుకొని ప్రభుత్వమూ, కంపెనీ యాజమాన్యమూ తిరిగి నిర్మాణం సాగించటానికి పూనుకొన్నారు.

తిరిగి భామచంద్రడోంగార్ బచావో వర్కారీ షేత్కారీ సంఘర్ష సమితి, లోకశాసన్ ఆందోళన సంస్థల ఆధ్వర్యంలో జులై 29వ తేదీన గ్రామ ప్రజలు డౌ కంపెనీ ఆవరణలోకి ప్రవేశించి అక్కడ వున్న తాత్కాలిక షెడ్లకు నిప్పంటించి, కూల్చివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

డౌ కంపెనీ ఆవరణలో కొన్ని బోర్లను తవ్వటం మొదలుపెట్టడంతో షిండే గ్రామ ప్రజలు ఈ రకంగా తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

తాము ఆ ఆవరణలో రసాయనిక ఉత్పత్తి చేయబోవటంలేదనీ, అందువలన అక్కడ విష రసాయనాల కాలుష్య ప్రమాదం ఏమీ లేదనీ, తాము తమ కేంద్రాన్ని ప్రారంభించేముందు అక్కడి భూమిలో విష పదార్థాల శాతం ఎంత వుందో తెల్సుకోవటానికి భూపరీక్షల నిమిత్తం బోర్లు తవ్వుతున్నామనీ, గ్రామస్థులు అపార్థం చేసుకొని తమ ఆవరణలో ప్రవేశించి ఆందోళన జరుపుతున్నారనీ డౌ కంపెనీ ప్రతినిధులు వాదిస్తున్నారు. తాము ఆ పరిశోధనా కేంద్రంలో కేవలం పరిశోధనలు మాత్రమే నిర్వహిస్తామనీ, తమ పరిశోధనలను ప్రత్యేకించి శక్తిని (ఇంధనాలను), నీటిని ఏ రకంగా సంరక్షించటం అన్న విషయంపై కేంద్రీకరించే పరిశోధనలు జరుపుతామనీ, లోహాలు యితర పదార్థాల వినియోగ స్థానంలో వ్యవసాయిక ఆధార పదార్థాలను వినియోగించటానికి వీలయిన పరిశోధనలు జరుపుతామనీ కంపెనీ ప్రతినిధులు ప్రకటిస్తున్నారు.

ఈ పరిశోధనా కేంద్రం పరిసరాల్లో కల సుధ నది క్రింద వున్న పంట భూములు సారవంతమయినవనీ, యిప్పుడు ఈ కేంద్రం తన పరిశోధనలతో భూ, జల వనరులను విషతుల్యం చేస్తే తమ జీవనాధారం నశిస్తుందనీ, పైపెచ్చు ఈ ప్రాంతం వకరీ భక్తి తెగలవారికి చెందిన పవిత్ర ప్రాంతమనీ, ఇది భక్తతుకారాం పుట్టిన ప్రాంతం అనీ, ఈ ప్రాంతంలోనే అతడు తన గాథలను రచించాడనీ, అంతేకాక ఈ ప్రాంత పరిసరాల్లోనే మహర్షి మరాఠీ రచయిత అయిన ధ్యానేశ్వర్‌కు చెందిన అలాండీ వుందనీ, ఈ మొత్తం ప్రాంతమంతా వకారీలకు పవిత్ర ప్రాంతమనీ, ఏడాదికోసారి వకారీలందరూ ఈ ప్రాంతం యాత్రలకు వస్తారనీ, అటువంటి ప్రాంతంలో ఈ డౌ కంపెనీ కార్యకలాపాలు ఆ ప్రాంతాన్ని అపవిత్ర పరుస్తాయనీ, ఆ ప్రాంతపు పర్యావరణాన్ని విషతుల్యం చేసి కలుషితం చేస్తాయనీ ఆందోళన జరుపుతున్న గ్రామ ప్రజలు వాదిస్తున్నారు.

కంపెనీ ప్రతినిధులు చెప్పినట్లు కేవలం పర్యావరణాన్ని కలుషితం చేయని పరిశోధనలనే ఆ కేంద్రంలో చేస్తే, ఎందుకు ప్రభుత్వం డౌ కంపెనీ సమర్పించిన ప్రాజెక్టు రిపోర్టును, సమాచార చట్టం క్రింద అడిగినా కూడా యివ్వనిరాకరిస్తోందనీ, ఆ రిపోర్టును ఎందుకు బహిరంగపరచటల్లేదనీ వారు వాదిస్తున్నారు.

అభివృద్ధి అనే సాకుతో ప్రభుత్వాలూ, పాలకులూ సామ్రాజ్యవాద కార్పోరేట్లకు దళారీలుగా పనిచేస్తూ, దేశ ప్రయోజనాలను, దేశ ప్రజల ప్రయోజనాలనూ ఆ సామ్రాజ్యవాద కార్పోరేట్ల దోపిడీకి స్వాధీనం చేస్తున్న దానిలో భాగంగానే ఈ డౌ కంపెనీ పరిశోధనా సంస్థకు అనుమతులు యిచ్చి, దాని నిర్మాణానికి సమర్థించటం జరుగుతోంది.

ఈ ప్రజలు సమైక్యంగా, పోరాట మార్గానే ఈ దారుణాలను ఎదుర్కోవీలవుతుంది. పోరుబాటలో పయనిస్తున్న షిండే గ్రామ ప్రజలకు, వారి ఆందోళనలకు 'జనశక్తి' తన సంఘీభావాన్ని తెలియచేస్తోంది. ◈

(12వ పేజీ తరువాయి)

వినియోగంపట్ల నిర్లక్ష్యమే కారణమని రచయిత గుర్తించారు. వాటిని వినియోగంలోకి ఎలా తేవాలో సూచించారు. ఇన్నాళ్లకైనా వస్తున్న హంద్రీనీవా నీళ్లు ఫ్యాబ్ సిటీ కోసమే (దాని సైన్సు సిటీ అని పేరు మార్చినా) తప్ప రైతాంగం కోసం కాదని స్పష్టమైంది. సోమశిల, పోతిరెడ్డిపాడు నీళ్లు కూడా బ్రాహ్మణి స్టీల్సుకే. నీరు రైతాంగానికి దక్కకుండా చేస్తున్నదెవరు? సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలన్నది ఆంధ్రప్రదేశ్ సాగునీటి చారిత్రక అనుభవం గమనించిన వారెవరికైనా అర్థమౌతుంది. ఈ శక్తులే ఈనాడు (అసలు లేని) నీటి పొదుపు గురించీ, బిందు సేద్యం గురించీ, ఆరుతడి పంటల గురించి మాట్లాడటం ఏ ప్రయోజనాల కోసమో గుర్తించటం కష్టం కాదు. అయినా అనుభవమూ పరిశీలనా వున్న రచయిత మౌనం వహించటం గమనార్హం. ఏమైనా రైతాంగపు కష్టాలకు స్పందనా, పరిష్కారం కనుగొనాలన్న తపన ప్రస్ఫుటంగా రచనలో కన్పిస్తున్నాయి. అదే ఈ రచనకు ప్రాణం. ◈

ఉద్యోగుల రాజకీయ ఎంపికను శాసిస్తున్న వాల్-మార్ట్ కార్పోరేషన్

గత కొన్ని సంవత్సరాలుగా తన కార్మికులను, ఉద్యోగులను పలురకాలుగా బెదిరిస్తూ వారు యూనియన్లలో చేరకుండా అమెరికాకు చెందిన బహుళజాతి కార్పోరేషన్ వాల్-మార్ట్ వారిని బెదిరిస్తోంది. వారిపై అనేక రూపాల్లో ఒత్తిడి తీసుకువస్తోంది.

ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు జరుపుతోంది. ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. వారిపై నిఘా చర్యలు అమలుజరుపుతోంది. వాల్-మార్ట్ యాజమాన్యం పలు సమావేశాలూ, మీటింగులూ నిర్వహించి ఉద్యోగులు-కార్మికులు యూనియన్లలో చేరరాదంటూ బోధలు చేస్తోంది. కొత్తగా ఉద్యోగాలలో చేరే వారు యూనియన్లలో చేరకుండా వారిపై ఒత్తిడి తీసుకువస్తోంది.

ఇంతటితోనే ఆగని వాల్-మార్ట్ యాజమాన్యం, యిప్పుడు రాబోయే నవంబర్ 4వ తేదీన జరుగబోయే ఎన్నికలలో తమ సంస్థ ఉద్యోగులు, తన కార్మిక-ఉద్యోగ వ్యతిరేక విధానాలకు అనుకూలంగా వుండే జాన్ మెకైండ్‌కే ఓటు వేయాలని ప్రబోధిస్తోంది. జాన్ మెకైండ్‌కే ఓటు వేయాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తోంది.

కంపెనీకి యాజమాన్యం తన ఉద్యోగులకు జాన్ మెకైండ్‌కే ఓటు వేయమని సందేశాన్ని యిచ్చే రూపంలో ఆదేశించింది.

తక్కువ వేతనాలు, వైద్య సౌకర్యాలలో కోత, ఉద్యోగులను యిష్టానుసారం బదిలీ చేయటం లాంటి విధానాలను అనుసరిస్తున్న వాల్-మార్ట్ యొక్క విధానాలూ, ప్రయోజనాలు జాన్ మెకైండ్ అధ్యక్షుడిగా ఎన్నుకోబడితే మరింతగా బలపడే అవకాశం వున్నందువలన, ఆ సంస్థ యాజమాన్యం తన సంస్థలోని ఉద్యోగులను ఈ రకంగా జాన్ మెకైండ్‌కు ఓటేయమని ప్రబోధిస్తోంది.

ఈ ఎలక్షన్ సందర్భంగా అమెరికాలోని కార్మికులు మెరుగైన ఉద్యోగాలు, మెరుగైన వేతనాలు, పెన్షన్ భద్రత, ఆరోగ్య సౌకర్యాలు పెంపుదలలు చేకూరాలని కోరుకొంటున్నారు.

తమ ఆకాంక్షలకు అనుకూలంగా ఎవరైతే వుంటారని భావిస్తున్నారో వారికే ఉద్యోగులు తమ ఓటును వేయబూనుకోవటం అన్నది వారి హక్కు

కానీ యింత వరకూ కార్మికులనూ, ఉద్యోగులనూ బెదిరిస్తూ వచ్చిన వాల్-మార్ట్ యిప్పుడు రాజకీయ క్రమాన్ని సహితం ప్రత్యక్షంగా బెదిరించటం ప్రారంభించింది. అయితే అమెరికన్ కార్మిక సంఘాలు కార్పోరేట్ సంస్థల ఈ రకపు రాజకీయ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఆగష్టు 15న ఫెడరల్ ఎలక్షన్ కమిటీకి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశాయి.

తాము సెనేటర్ ఒబామా ఎన్నికలను బలపరుస్తూ కార్పోరేట్ సంస్థలు ఖర్చు చేయటాన్ని వ్యతిరేకిస్తున్నామనీ, అదే విధంగా జాన్-మెకైండ్‌కు ఓటు వేయమంటూ వాల్-మార్ట్ తన ఉద్యోగులపై ఒత్తిడి తేవటాన్ని వ్యతిరేకిస్తున్నామనీ, వాల్-మార్ట్ సంస్థ యొక్క ఈ ప్రవర్తనా తీరును నిషేధించాలనీ వారు డిమాండు చేశారు. 'ప్రజాస్వామ్యం' గురించి అనుక్షణం జపం చేసే అమెరికాలో ఈ ప్రజాస్వామ్యమన్నది సామ్రాజ్యవాద కార్పోరేట్ సంస్థల కబంధ హస్తాల్లో యిరికించుకోబడి ఎంతటి హాస్యాస్పదంగా, బూటకంగా మలచబడిందో ఈ ఘటన వెల్లడి చేస్తోంది.

దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థల్లో అమలుజరిగేది దోపిడీ స్వామ్యం తప్ప, ప్రజాస్వామ్యం కాదు అని గుర్తించటానికి యింతకు మించిన రుజువు మరేం కావాలి! ◈

ఒరిస్సా తీర ప్రాంతంలోని తాబేళ్ళ రక్షణకోసం గ్రీన్‌పీస్ నిరసన

ఒరిస్సా సముద్ర తీరంలో టాటా స్టీలు కంపెనీ ధర్మడీప్ వాటర్ పోర్టు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంబించి కొనసాగిస్తోంది. ఈ పోర్టు నిర్మించే ప్రదేశం పరిసర ప్రాంతం అంతా అపురూపమయిన 'ఆలివ్ రిడ్లీ' అని పిలువడే చిరుతాబేళ్ళకు నెలవు ప్రాంతం. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన ఈ తాబేళ్ళు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడుతుందనీ, పర్యావరణ సమతుల్యం దెబ్బ తింటుందనీ గ్రీన్ పీస్ సంస్థ గత నాల్గు సంవత్సరాలుగా ఆందోళనను వెల్లడి చేస్తోంది. తాబేళ్ళు అంతరిస్తాయనటానికి తగు ఆధారాలుంటే తాను ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపేస్తామని టాటా కంపెనీ ప్రకటించింది. గ్రీన్‌పీస్ సంస్థ అధ్యయనం చేసి ఆ ప్రాజెక్టు వలన సంభవించబోయే పర్యావరణ ముప్పును వెల్లడించింది. ఇప్పుడేమో టాటా కంపెనీ "వీలైనంత తక్కువ హాని కలిగేలా నియంత్రిస్తూ ప్రాజెక్టు నిర్మిస్తున్నాం" అని మాట మార్చి ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తోంది. గ్రీన్‌పీస్ సంస్థ మాత్రమేకాక పలువురు శాస్త్రజ్ఞులూ, విద్యావేత్తలూ ఈ ధర్మా ప్రాజెక్టును నిర్మించటాన్ని వ్యతిరేకిస్తూ ఒరిస్సా ప్రభుత్వానికి విన్నపాలు చేశారు. అయినా ఈ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతోంది.

ఇందుకు నిరసనగా 70 మంది గ్రీన్‌పీస్ కార్యకర్తలు ఆగష్టు 20వ తేదీన ముంబయిలోని టాటా గ్రూపుకు చెందిన ప్రధాన కార్యాలయం అయిన 'బొంబే-హౌస్' ముందు మానవహారంగా ఏర్పడి, ఆ కార్యాలయంలోకి గల 3 ప్రవేశ ద్వారాలను అడ్డుకొంటూ తమ నిరసనను సాగించారు. "వ్యాపారంకన్నా తాబేళ్ళు మిన్న", "ప్రాజెక్టుతో తాబేళ్ళు శాశ్వతంగా అంతరించి పోవటం నిజం" అంటూ నినాదాలు యిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. 3 గంటలపాటు ఈ నిరసన ధర్నా సాగిన అనంతరం పోలీసులు వీరిని తొలగించారు.

ఈ విషయమై మాట్లాడదామని తాము ఎంతగా, ఎన్నిసార్లు ప్రయత్నించినా టాటా కంపెనీ తమను తప్పించుకొంటోందని గ్రీన్‌పీస్ సంస్థ ప్రకటించింది.

పారిశ్రామికాభివృద్ధి పేరిట ప్రభుత్వం, పాలకులు పర్యావరణ ప్రమాదాలను, ముప్పులను కొనితెచ్చుకోవటానికి సంసిద్ధపడుతున్నారే తప్ప, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీవర్గం యొక్క ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించటానికి మాత్రం అణుమాత్రం కూడా అంగీకరించటల్లేదు. అందువలన ప్రజలే తమ ఆందోళన ద్వారా, ఉద్యమాల ద్వారా తమ ప్రయోజనాల పరిరక్షణకు తామే పూనుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

ఇనుప ఖనిజ ఎగుమతి
వ్యతిరేక కమిటి ప్రచురణ

ఇనుప ఖనిజ ఎగుమతు లెందుకు?

వెల: 5.00

ప్రతులకు: మణి బుక్ స్టాల్
సండే మార్కెట్, నెల్లూరు

మైత్రీ బుక్ హౌస్,
జలీల్ వీధి, విజయవాడ-2.

జనశక్తి నిధిని సేకరించండి ! చందాల సంఖ్యను పెంచండి !!

జనశక్తి పక్ష పత్రికగా రెగ్యులర్‌గా వెలువడుతూన్న విషయం పాఠకులకు తెలుసు. నిర్వహణలో ఆర్థిక భారం పెరుగుతూ వుంది. గత దశాబ్ద కాలంగా దీని కోసం అప్పులుచేసి నిర్వహించుకొంటూవస్తున్నాం. దీని దృష్ట్యా పత్రిక ఈ స్థితి నుండి బయటపడాలంటే పాఠకుల, రాజకీయ కార్యకర్తల, ప్రజల సహకారం తప్పనిసరి.

రాజకీయ కార్యకర్తలు ప్రజలనుండి, పాఠకులనుండి, అభ్యుదయ, ప్రజాస్వామ్య దేశభక్తియుత శక్తులను విరాళాలు అభ్యర్థించి సేకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఇదే సమయంలో పత్రిక చందాలను విరివిగా చేర్పించవలసిందిగా కోరుతున్నాం.

అభివందనములతో
జనశక్తి నిర్వాహకులు

సార్వత్రిక సమ్మె సందర్భంగా కార్మిక ప్రదర్శనలు

విజయనగరం, 20.8.2008:

కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను విరసిస్తూ దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా విజయనగరం, కోట వద్ద నుండి ఉదయం 11 గంటలకు ఏపిఎఫ్టియు ఆధ్వర్యంలో వివిధ అసంఘటిత రంగాలకు చెందిన 180 మంది కార్మికులు మూడు లాంతర్లు గంటస్తంభం లోయర్ ట్యాంక్ బండ్ రోడ్ గుండా మయూరీ జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు నశించాలని, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు వ్యతిరేకిస్తామని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, సెజ్ల చట్టాన్ని రద్దు చేయాలని అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమంకై సమగ్ర చట్టం చెయ్యాలని కార్మికులు పెద్దవిత్తున ప్రదర్శన దారిపొడుగున నినదించారు. ప్రదర్శనలో ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా మయూరీ జంక్షన్కు చేరుకోగానే ఈ నాలుగు రోడ్ల కూడలి వద్ద కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలదో ఈ ప్రాంతం దద్దరిల్లింది.

ఈ సందర్భంగా బి.శంకరరావు (సిపిఐ (ఎం.ఎల్), ఆర్.నారాయణరావు (ఏపిఎఫ్టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు) మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు మూలంగా కార్మికవర్గానికి ఉద్యోగులకు హక్కుల రక్షణ కరువైందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటి సాధారణ ప్రజల జీవనం సంక్షోభంలో పడిందని దేశ సహజ సంపదలను, దేశీయ బడా కంపెనీలకు బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్నారని, 40 కోట్ల మంది అసంఘటిత రంగంలో కార్మికులుగా శ్రమదోపిడీకి గురవుతున్నారని, ఈ దోపిడీ దురాగతాలని ప్రతిఘటించడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్టియు అనుబంధ సంఘాల నాయకులు జి.శ్రీనివాసరావు, నారాయణి స్టీల్ వర్కర్స్ యూనియనం ప్రధాన కార్యదర్శి పి.అప్పలస్వామి, లోడింగ్-అన్లోడింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఆటో వర్కర్సు యూనియన్ గౌ॥ అధ్యక్షులు కె.పైడిరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.అప్పలరెడ్డి, ఆరెన్ ఎక్స్పోర్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎస్.శంకరరావు, ఎన్వైఎస్ జిల్లా అధ్యక్షులు జి.శంకరరావు, బి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా ఏపిఎఫటియు రాష్ట్ర కమిటీ ప్రచురించిన కరపత్రాలను రుణా ఈస్టు కోస్టు జూలు మిట్లుల వద్ద ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు కార్యకర్తలు విస్తృతంగా పంచారు. పట్టణం అన్ని సెంటర్లలో విసబ్బుతంగా పోస్టర్లు వేయడం జరిగింది.

సమ్మెలో పాల్గొన్న అసంఘటితరంగ కార్మికులు

విజయనగరం పారిశ్రామికవాడ (వి.టి.అగ్రహారం)లో గల నారాయణి స్టీల్స్ (పి) లిమిటెడ్, ఆరెన్ ఎక్స్పోర్టర్స్ ఆంజనేయ ఫ్లోరుమిల్లులో ఏపిఎఫ్టియు పిలుపు మేరకు కార్మికులు 20.8.2008 సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. విధులను బహిష్కరించారు.

విజయవాడ, 20.8.2008:

ఆగష్టు 20 దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా ఈ రోజు 20.8.08 ఆంధ్రప్రదేశ్ కార్మియ సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడలో ఏపిఎఫ్టియు నగర కమిటీ ఆధ్వర్యాన కొత్తపేట జోడుబొమ్మల సెంటరు నుంచి సొరంగం సెంటరు, ఆంజనేయవాగు, శ్రీనివాసమహల్ సెంటరు వరకు సమ్మెను జయప్రదం చేయండి అనే నినాదాలతో విస్తృతంగా కరపత్రాలు పంచుతూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార ఆందోళన కార్యక్రమం చేయడం జరిగినది. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వలన, వేలాది పరిశ్రమలు మూతపడటం వలన లక్షలాది కార్మికులు నిరుద్యోగులుగా మారి, కుటుంబాలను పోషించుకోలేక పోవుచున్నారు. ధరలు విపరీతంగా పెరిగి పోవుచున్నాయి. రైతులు పంటలు పండించిన గిట్టుబాటు ధరలేక, ఆత్మహత్యలు చేసుకొనుచున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు పంటలు మునిగి సంక్షోభంలో కొట్టుమిట్టాడుచున్నారు. అసంఘటిత రంగ కార్మికులు, సమగ్రమైన వేతన చట్టాన్ని అమలుచేయించుకోవడానికి సంఘటితంగా పోరాడాల్సి వుందని తెలియజేస్తూ నగర ఏపిఎఫ్టిఎఫ్ కన్వీనర్ టి.పూర్ణచంద్రరావు, ఓపిడిఆర్ జిల్లా కార్యదిర్శ కె.ఏసు, ఎం.వెంకట్రావు, వి.లక్ష్మణరావు తదితరులు మాట్లాడినారు.

మచిలీపట్నం, 20.8.2008:

దేశవ్యాపితంగా ఉద్యోగులు, కార్మికుల సార్వత్రిక సమ్మె సందర్భంగా ఏపిఎఫ్టియు ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయ ఆవరణలో సాంఘిక సంక్షేమ ట్రెజరీ, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, ఎం.ఆర్.ఓ., ఎం.డి.ఓ., ఇరిగేషన్, డ్రైనేజి ఆఫీసులు, ఆర్.టి.సి., డిపో, బెల్ కంపెనీల వద్ద కరపత్రాలు పంచుతూ పాటలు పంచక లేదా పాటలు పాడుతూ సమ్మెను విజయవంతం చేయమని విజ్ఞప్తిచేస్తూ కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొనే విధంగా కృషి చేసారు. ఈ సందర్భంగా జరిగిన గ్రూపు మీటింగ్లలో ఏపిటిఎఫ్టియు పట్టణ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రవి మాట్లాడుతూ "8 గంటల పనిదినంకు బదులు 12 గంటల పనిదినం" అమలు చేస్తున్నారు. అలానే 1991 సంవత్సరంలో ప్రైవేటీకరణను 24 శాతం నుండి 76 శాతంకు పెంచారు. దీనివల్ల ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోయి వీధులపాలవు తున్నారు. ఉద్యోగుల, కార్మికుల హక్కులు హరించ బడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉద్యోగ, కార్మికవర్గాలు సంఘటితంగా చైతన్యయుత రాజకీయ పోరాటాలకు సిద్ధం కావాలి" అని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో సమ్మెకు సంఘీభావంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకులు తలశిల మనోహర్, జి.జగన్, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు పామర్తి అంజమ్మ పాల్గొన్నారు.

దేశవ్యాపితంగా ఆగష్టు 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఏపిఎఫ్టియు మచిలీపట్నం ఏరియా శాఖ ఆధ్వర్యంలో 19.8.08 సాయంత్రం 6.30కు మచిలీపట్నం బస్టాండ్ సెంటర్ నుండి కోనేరు సెంటరు వరకు కాగడాల ప్రదర్శన జరిగింది. ప్రదర్శనకారులను ఉద్దేశించి ఏపిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ "60 సంవత్సరాల స్వతంత్ర పాలన"లో ప్రభుత్వ గణాంకాల ప్రకారం 77 శాతం మంది ప్రజలు సగటున రోజుకు 20 రూ. ఖర్చు చేయని దుస్థితిలో ఉన్నారు. తమ శ్రమశక్తితో సమాజాన్ని సాకుతూ, ఉత్పత్తులను సృష్టించి సంపదలను సమకూర్చుతున్న కార్మికులను ప్రభుత్వం దయనీయస్థితికి నెడుతున్నది. కార్మికులు సంఘటిత బలంతో పోరాడి సాధించుకొన్న 8 గంటల పనిని 12 గంటలు పెంచుతూ చట్టం చేసింది. చట్టబద్ధంగా ఉన్న హక్కులను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో కార్మికవర్గం చైతన్యయుతమైన రాజకీయపు అవగాహనతో సంఘటితంగా పోరాడాలి. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కామ్రేడ్ సోని విజ్ఞప్తి చేశారు.

స్త్రీ విముక్తి సంఘటన నాయకులు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రదర్శనలో చిలకలపూడి సిడబ్ల్యుసి గోడౌన్ యూనియన్, టు టౌన్ హమాలీ వర్కర్స్ యూనియన్, మచిలీపట్నం ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు, శ్రామిక మహిళలు సుమారు 100 మంది పాల్గొన్నారు. విజయవంతం చేసారు. మధ్యలో వర్షం వచ్చినా ప్రదర్శనను పట్టుదలగా కొనసాగించారు.

వేటపాలెం, 20.8.'08:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఆగష్టు 20న జరిగిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య (ఏపిఎఫ్టియు) ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ సంఘాలతో వేటపాలెంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఏపిఎఫ్టియు రాష్ట్ర నాయకులు పింజల వెంకట సుబ్బారావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా అధికారంలో వున్న యు.పి.ఏ. ప్రభుత్వం గత ఎన్.డి.ఏ. అవలంబించిన విధానాల అమలు ఫలితంగానే అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేయబడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కులన్నీ హరించివేయబడుతున్నాయి. 61 సంవత్సరాల స్వతంత్ర పాలనలో రోజుకు సగటున 77 మంది 20 రూ.లు కూడ సంపాదించలేకపోతున్నారు. కాంట్రాక్టు కార్మికులు, క్యాజువల్ కార్మికులు, అసంఘటిత కార్మికుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నది. సెజ్ల పేరుతో మనదేశ సహజ వనరులను, పంట భూములను, సముద్రాన్ని విదేశీ బహుళజాతి సంస్థలకు అప్పజెప్పుతున్నారు. ధరలు రోజు రోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించడం తప్ప మార్గంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులతోపాటు ఎన్.వై.ఎస్. జిల్లా అధ్యక్షులు బి.సుబ్బారావు, ఏపిఎఫ్టియు నాయకులు ముసలయ్య, యారాసు భాస్కర్, వార్తికోట సుబ్బారావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

విశాఖపట్టణం, 20.8.'08:

ఎ.పి.ఎఫ్.టి.యు అనుబంధ డాకింగ్ అండ్ ఇంజనీరింగ్ మజ్దూర్ యూనియన్ ఎ.పి.ఎఫ్.టి.యు రాష్ట్రకమిటీ పిలుపు అమలులో భాగంగా ఆగష్టు 20 సార్వత్రిక సమ్మెలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

ఉ॥ 9.00 గంటలకు కంపెనీ గేట్ నుండి బయలుదేరి జాలారిపేట మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎ.పి.ఎఫ్.టి.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥గణేష్ పండా, కోశాధికారి కా॥ఆదారి అప్పారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ జి.నాగభూషణం, యూనియన్ ప్రధాన కార్యదర్శి, కా॥జోగేందర్ శర్మ, ట్రెజరర్ శ్రీనివాస్లు ర్యాలీకి నాయకత్వం వహించారు.

కార్మిక ఐక్యత వర్ధిల్లాలి! కార్మిక చట్టాలను అమలు చేయాలి! చట్టాలలో మెరుగైన మార్పులు చేయాలి. ఉద్యోగ నియామకాలపై వున్న నిషేధాన్ని రద్దుచేయాలి! కాంట్రాక్టు, కేజువల్ పనిపద్ధతిని రద్దుచేయాలి! ఇప్పటివరకు పనిచేస్తున్న వివిధ రంగాలలోని కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. అసంఘటిత రంగ కార్మికుల కొరకు సమగ్ర చట్టాన్ని అమలు చేయాలి. తదితర డిమాండ్లతో దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేటు ఎదుట కార్మికులను ఉద్దేశించి కా॥పండా మాట్లాడారు. సమ్మెకు మద్దతు తెలియజేస్తూ, విధులను బహిష్కరించి చైతన్యాన్ని ప్రదర్శించిన కార్మికులకు అభినందనలు తెలియజేశారు.

ఆయేషా హత్య కేసులో న్యాయ విచారణ జరిపి సత్యంబాబును విడుదల చేయాలి!

నిజనిర్ధారణ కమిటీ డిమాండ్!

నందిగామ, 18.8.2008:

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్), స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కమిటీల తరపున వై.ఏసు, వి.ఎన్.రాజ్యలక్ష్మి, కె.కామేశ్వరిలు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి ఆయేషా హత్య కేసులో సత్యంబాబు పాత్రను పరిశీలించారు.

నందిగామ సబ్జైలులో వున్న పిడితల సత్యంబాబు నాపై అక్రమంగా ఈ కేసు పెట్టారని కమిటీ సభ్యులతో చెప్పారు. 9.8.2008న పనికోసం నేను గాంధీ సెంటరులో నిలబడి వుండగా, పోలీసులు వచ్చి నా చెప్పులు తీసుకుని, కొత్త చెప్పులు కొనుక్కోమని వంద రూపాయలిచ్చారని చెప్పాడు. 10వ తేదీ రాత్రి ఒంటి గంటకు పోలీసులు మా యింటికి వచ్చి నన్ను బెదిరించి తీసుకువచ్చారనీ, రోజూ కొట్టారనీ తెలిపాడు. ఆయేషాను చంపినట్లు, వి.రాధను చంపబోయినట్లు ఒప్పుకోమని పలు విధానలుగా హింసించారని చెప్పాడు. లేదంటే ఎన్కౌంటర్ చేస్తామనీ, నీ తల్లినీ, చెల్లినీ కూడా చంపుతామనీ బెదిరించారని తెలిపాడు.

సత్యంబాబు బంధువులనూ, గ్రామస్తులనూ కలువగా గతంలో చిల్లర దొంగతనం కేసులున్నాయిగానీ, మహిళలను ఇంత క్రూరంగా హత్య చేసే స్వభావం వున్నవాడు కాదని తెలిపారు.

ఆయేషా హత్య, తదితర కేసుల్లో నిరుపేద దళిత యువకుడిని అక్రమంగా యిరికించారని కమిటీ భావిస్తున్నది. దీనిపై వెంటనే న్యాయవిచారణ జరిపించాలని కోరుతున్నది. మానవ హక్కుల కమీషన్, ఎస్సి, ఎస్టీ కమీషన్లు ఈ కేసును పరిశీలించాలని కోరుతున్నది.

కర్నాటక:

ఎరువుల కోసం రైతుల మిలిటెంట్ ఆందోళన

కర్నాటక రాష్ట్రంలో ఎరువుల ధరలు పెరగటం, ఎరువులు సక్రమంగా అందకపోవటమనే సమస్యలతో రైతాంగం ఆందోళన ప్రారంభమైంది. ఈ డిమాండ్స్పై జూన్ 6న-హావేరి జిల్లా కేంద్ర కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వేలాదిమంది రైతులపై పోలీసులు కాల్పులు జరపగా ఒకరు చనిపోయారు, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిలో ఒకరు తర్వాత మరణించారు.

హస్సాన్ జిల్లాలో వందలాది మంది రైతులు పట్టణంలోని ఎరువుల గోదాముల ముందు ధర్నాలు నిర్వహించారు. అయినా అధికార యంత్రాంగం స్పందించి ఎరువుల పంపిణీ చేపట్టలేదు. రైతుల సంఖ్య 'వందల' నుండి వేల సంఖ్యకు పెరిగింది. దీంతో రైతులు గోదాములను బ్రద్దలుకొట్టి 6వేల ఎరువుల బస్తాలను తీసుకెళ్ళారు. పోలీసు లాఠీఛార్జీ రైతాంగపు ఈ సమరశీల చర్యను నిరోధించలేకపోయింది. పోలీసుల లాఠీ ఛార్జీలను ధిక్కరిస్తూ రాష్ట్రంలో 15 చోట్ల ఈ విధమైన చర్యలకు రైతాంగం పూనుకుంది. జూన్ 13న కర్నాటక రైతుసంఘటన(కెఆర్ఎస్) రైతాంగ ఆందోళనకు మద్దతుగా ఇచ్చిన 'ఉత్తర కర్నాటక' బంద్ పూర్తిగా విజయవంతమైంది. ఎరువులు లభ్యంకాకపోటానికి, ఎరువుల ధరలు పెరగటానికి తన బాధ్యతేమీ లేదని కేంద్రంపై నెట్టేయటానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

ఈ సమస్యను పరిష్కరించటానికి ఏవిధమైన చర్యలూ చేపట్టని, రైతాంగపు ఈ స్థితికి కారణమైన ప్రజావ్యతిరేక కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలకు వ్యతిరేకంగా రైతుల ఆగ్రహం రాష్ట్ర వ్యాపితంగా విస్తరిస్తున్నది.

'అభివృద్ధి ... (15వ పేజీ తరువాయి)

'మేం ఎన్నికల్లో కాంగ్రెసుకు ఓటు వేసినవాళ్ళమే. కానీ వాళ్ళే మా నోటికాడ కూడు లాగేస్తుంటే' మాకు మొదటి మా జీవనం ముఖ్యం. అదే పోతుంటే మేం చూస్తూ ఊరుకోం' అని ఇంకొందరు స్పష్టంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. భూసేకరణకు గ్రామాల కొచ్చిన కలెక్టర్ 'మీరెప్పుడైనా కారులో తిరిగారా, తరాలుగా చేపలు పట్టుకొని బ్రతకటమే కదా' అని కించపరుస్తూ మాట్లాడిన దానికి జవాబుగా 'రమ్మనండి ఆ కలెక్టర్ను! కారుతో సహా ఎత్తి సముద్రంలో వేస్తాం, కారుతో వేట చేసుకొని తిరిగి రాగలుగుతాడేమో చూద్దాం' అంటూ తమ ఆగ్రహావేశాలను వ్యక్తం చేసినవారు ఇంకొందరు. 'బ్రతుకుదెరువు కోసం సంవత్సరాల క్రితం ఎక్కడి నుండో వలస వచ్చాం. ఇక్కడ నుండి తరిమేస్తే ఎక్కడికెళ్ళాలి?' అని ఆవేదన వ్యక్తం చేసినవారు మరికొందరు. అధికారపార్టీ నాయకులు, మంత్రులు, రాజకీయ దళారులు, ప్రభుత్వాధికార్లు చేస్తున్న హెచ్చరికలు, బెదిరింపులు, అరచేతిలో వైకుంఠాలు. ప్రజల్లో కొంత గందరగోళం కల్గిస్తున్నప్పటికీ కోస్టల్ కారిడార్ ప్రమాదాన్ని రానున్న విపత్తులను వివరించి చెప్పిన ప్రచారం ద్వారా ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకొని సహకరించారు. సదస్సు జయప్రదంగావటానికి వివిధ రూపాల్లో, తమ సహాయ సహకారాన్నందించి, తమను వెన్నంటి వుండాలని నాయకత్వాన్ని కోరారు. కృష్ణా, నెల్లూరుజిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతోపాటు, ప్రకాశం, గుంటూరుజిల్లాల కారిడార్ ప్రభావిత గ్రామాల నుండి, తీరప్రాంత గ్రామాల నుండి 600 మందికి పైగా ప్రజలు ఈ సదస్సుకు హాజరై ఉదయం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు సాగిన వక్తల ప్రసంగాల్ని ఆసక్తిగా విన్నారు. పోరాట స్ఫూర్తిని నింపుకొని సదస్సు నుండి తిరిగివెళ్ళారు.

జనశక్తి ప్రచురణ

విప్లవ ప్రజాఉద్యమ సమస్యలను సావధానంగా చర్చిద్దాం!

విశ్వం

వెల: 10.00

ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, విజయవాడ-2.

'అభివృద్ధి ... (16వ పేజీ తరువాయి)

మరణించిన వారి సంఖ్య 100కు పెరిగింది. ప్రజల ప్రాణాలను ప్రతి రోజూ బలిపెడుతూ, కోట్ల రూపాయల మన విలువైన సంపదను కారుచౌకగా విదేశాలకు తరలిస్తూ, తాము కోట్లాది రూపాయల లాభాలార్జించే హక్కు ఈ పాలకులకు ఎవరిచ్చారని ప్రశ్నిస్తూ, సెజ్‌లకు, కారిడార్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనను తీవ్రం చేయాల్సిన అవసరముందని పిలుపునిస్తూ కామ్రేడ్ కిషోర్‌బాబు తన ప్రసంగాన్ని ముగించారు.

నిరుద్యోగ నిర్మూలన కాదు- 'నిరుద్యోగుల' నిర్మూలన!

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.ఎన్.స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ఒక పెద్ద కుట్రపూరిత పథకాన్ని నెమ్మదిగా అమలుచేసుకుంటూ పోతున్నదని దీనిని తీవ్రమైన ప్రజా ఉద్యమం ద్వారానే అడ్డుకోగలమని నొక్కి చెప్పారు.

'చీరాలలోని ఐటిసి కంపెనీ, ఆధునీకరణ పేరుతో ఈనెడీసే యంత్రాలను ప్రవేశపెట్టి 6 వేల మంది కార్మికులను ఒకేసారిగా పనుల నుండి తీసివేసింది. మంగళగిరి వద్దనున్న కె.సి.వర్క్స్ సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేసి వేలాది మంది కార్మికులను రోడ్లపైకి విసిరివేశారు. ఆధునీకరణ, ప్రైవేటీకరణ పేరుతో లక్షలాది పరిశ్రమలను మూసివేస్తూ, కార్మికుల సంఖ్యను రోజు రోజుకీ తగ్గించివేస్తూ, నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ మరోవైపున 'సెజ్'ల ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామనే ప్రకటన బూటకం- దగా తప్ప మరోటి కాదు.

ప్రభుత్వం, మన రాష్ట్రంలో వివిధ పేర్లతో సేకరించిన 25 లక్షల ఎకరాల భూముల ద్వారా ఒక కోటీ 25 లక్షల మంది ఉపాధి పొందగలుగుతున్నారు. వీరిని ఈ భూముల నుండి దూరంచేసి, పరిశ్రమలను స్థాపించి 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. ప్రభుత్వం చెప్పిన విధంగా ఉద్యోగాలు కల్పించినప్పటికీ (అది జరిగే పని కాదు) ఇంకా ఒక కోటి మంది ఉపాధి కోల్పోయినట్లే కదా!

అసంఘటితరంగంలో దేశంలో 42 కోట్ల మంది పనిచేస్తున్నారు. వారి జీవనాన్ని, ఉపాధిని గ్యారంటీ చేయకుండా కారిడార్‌ల ఫలితంగా సెజ్‌ల ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారమౌతుందని చెప్పటం మరోసారి ప్రజలను వంచించటమే!

మనదేశం వ్యవసాయదేశం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం ద్వారా వ్యవసాయంపై ఆధారపడిన పరిశ్రమలను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ-పట్టణ ప్రాంత నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుంది మినహా మరో పరిష్కారం లేదు.

గోవాలో-సెజ్‌లకు వ్యతిరేకంగా ప్రజలు, రైతాంగం సాగించిన ఉద్యమం ఫలితంగా ప్రభుత్వం దాన్ని వెనక్కు తీసుకుంది. అలాగే, నవీ ముంబాయిలో సాగించిన పోరాట ఫలితంగా సెజ్‌లకు భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయిందని గుర్తుచేస్తూ, కార్మికులు, రైతాంగం, ఇతర సెక్షన్ల ప్రజానీకంతో కలగలసి శక్తివంతమైన సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాల'ని కామ్రేడ్ స్వామి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

'వాన్‌పిక్'లో భాగంగా చీరాల వద్ద నిర్మించ తలపెట్టున్న, **మోటుపల్లి పోర్టు వ్యతిరేక కమిటీ నాయకులు పోలిరెడ్డి** మాట్లాడుతూ తాము గంగమ్మతల్లిని నమ్ముకొని బ్రతుకుతున్నామని, ఇక్కడ నుండి వెళ్ళిపోయి, తమ కుటుంబాలను బ్రతికించుకోలేమని చెప్పారు. భూములు ఇవ్వకుంటే బ్యాంకులో డబ్బులు జమచేసి భూములు గుంజుకుంటామని ప్రభుత్వాధికారులు బెదిరింపులు చేస్తున్నారని, ఛోటా మోటా నాయకులను లోబరచుకొని వారి ద్వారా ప్రజల్లో భయాలు సృష్టిస్తూ భ్రమలు కల్పిస్తూ, భూములు గుంజుకునే కుట్రలు సాగిస్తున్నారని వీటిని ఓడిస్తూ తాము నిలకడగా పోరాటం సాగిస్తామని పోలిరెడ్డి ప్రకటించారు.

మోటుపల్లి పోర్టు వ్యతిరేక కమిటీ నాయకులు శంకర్ మాట్లాడుతూ మోటుపల్లి పోర్టు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలంతా పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా నిలిచివున్నాయన్నారు. రస్-అల్-ఖైమాతో ఒప్పందం ద్వారా ప్రభుత్వం తీరప్రాంత ప్రజలకు మార్చి 11ననే ఉరిశిక్ష విధించారని, దీని నుండి బయటపడేందుకు చావు బతుకుల పోరాటం ద్వారా దీన్ని వెనక్కిగొట్టగలుగుతామని, అయితే, గట్టిగా ఎదురుతిరిగి నిలబడుతున్నవారిని నగ్జలైట్ల పేరుతో నిర్బంధం ప్రయోగించబూనుకుంటున్నారని, ఈ కుట్రపూరిత విధానాలను తిప్పికొట్టి ముందుకు సాగుతామని శంకర్ ప్రకటించారు.

దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు కొరివి వినయకుమార్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పాత జమీందారీ విధానం పోయి కొత్త జమీందారీ పద్ధతులు వచ్చాయన్నారు. ప్రజలకు గౌరవప్రదమైన జీవితాన్ని ఇవ్వటం బదులుగా, ఎవరినైతే ఈ గడ్డ మీద నుండి తరిమికొట్టేందుకు పోరాటం చేశామో, ఆ సామ్రాజ్య వాదులనే ఈ ప్రభుత్వాలు తిరిగి ప్రతిష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెజ్ చట్టం ద్వారా పెద్దవాళ్ళకు భూములను కట్టబెడ్తూ, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా చిన్నవాళ్ళకు కూలీ పనులు కల్పిస్తామంటున్నారని; ఈ సెజ్‌లు, కోస్తా కారిడార్‌లు రాజ్యాంగ విరుద్ధమైనవని, ప్రజల జీవించే హక్కును కాలరాచివేసేవని అన్నారు. ఒక కోటీ 20 లక్షల ఎకరాల భూములు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు చేస్తే, వై.యస్. ప్రభుత్వం 4 లక్షల ఎకరాలు పంపిణీ చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నది. వాస్తవంలో మరోవైపున సన్న, చిన్నకారు రైతుల నుండి లక్షల ఎకరాల భూములను లాగివేసుకుంటున్నదని, మత్స్యకారుల జీవనాన్ని ఒక వైపున భగ్నం చేస్తూనే మరోవైపున మత్స్యకారులను ఎస్.టి.లలో చేర్చటం ద్వారా ఏదో ఒరగబెడ్తానని ప్రలోభపరుస్తున్నదనీ, ప్రభుత్వ ఈ కుట్రలను అర్థం చేసుకోవాలన్నారు. కారిడార్ వ్యతిరేక ఉద్యమంలో తాము కూడా భాగస్వాములవుతామని ప్రకటిస్తూ వినయ్‌కుమార్ తన ప్రసంగం ముగించారు.

ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు, హైకోర్టు న్యాయవాది వి.నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాపితంగా 8 వేల కిలో మీటర్ల తీరంతోసహా 500 సెజ్‌లకు పైగా ప్రభుత్వం అనుమతులిచ్చారన్నారు.

'సెజ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై వాస్తవ సేకరణ జరిపాము. ఒరిస్సా రాష్ట్రంలోని కళింగనగర్ ఆదివాసులు 'పోస్కో'కు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా, ఆందోళనకారులు 14 నెలలపాటు జాతీయ రహదారిపై గుంతలుతీసి కాపలాకాసి, తమ ఉద్యమాన్ని కొనసాగించారు.

నందిగ్రామ్‌లో ప్రజలు తమ భూములకోసం మిలిటెంట్‌గా పోరాడారు. నవీ ముంబాయిలో పోరాటం ద్వారా భూముల స్వాధీనాన్ని నిలిపివేయగలిగారు. సెజ్‌ల చట్టంలో 'పునరావాసం, భూమికి భూమి' అనే నిబంధనలు లేవని, డబ్బులు తీసుకొని భూములను వదులుకుంటే రైతాంగం, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, వాలంటరీ రిటైర్‌మెంట్ (విఆర్‌ఎస్) తీసుకున్న ఉద్యోగుల స్థితి కంటే ఘోరంగా నిర్వాసితులు దుర్భర స్థితిని ఎదుర్కొంటారని వివరిస్తూ నారాయణరెడ్డి తమ ప్రసంగం ముగించారు.

కారిడార్ వ్యతిరేక పోరాట నాయకులు కేసవ శంకర్రావు మాట్లాడుతూ ప్రజలలో ప్రభుత్వ విధానాలపట్ల పెద్దఎత్తున వ్యతిరేకత వుందనీ, అది వ్యక్తం కావాలనీ; అసైన్డ్ భూములు, బంజరు భూములు పంచకుండా వాటిని బలవంతంగా గుంజుకుంటున్నారని, ఈ విధానాలను అందరం సమైక్యంగా ఎదుర్కోవాలని అభిప్రాయపడ్డారు.

ప్రజాఫ్రంట్ భాగస్వామ్య సంస్థ ప్రతినిధి సూర్యనారాయణ కోస్టల్ కారిడార్ వ్యతిరేక పోరాటానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

ఇంకా ఈ సదస్సులో వేటపాలెం, చీరాల, చినగంజాం గ్రామ పెద్దలు, కారిడార్ వ్యతిరేక ఆందోళనలో పాల్గొంటున్నవారు పాల్గొని సందేశాలిచ్చారు.

ఉపన్యాసాల అనంతరం తీరప్రాంత ప్రజల భూముల్ని, వృత్తుల్ని, జీవితాల్ని, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, ప్రకృతి సంపదలను సర్వనాశనం చేస్తున్న కోస్టల్ కారిడార్‌ను వ్యతిరేకించాలని; సంబంధిత జీ.వో. నెం.34ను రద్దు చేయాలని; అభివృద్ధిపేరిట విధ్వంసం కావించే దళారీ పాలకుల విధానాలను ఖండిస్తూ; 'వాన్‌పిక్' పరిధిలోని గ్రామాల ప్రజానీకాన్ని ప్రలోభపరుస్తూ, బెదిరిస్తున్న ప్రజల మధ్య ఘర్షణలు సృష్టిస్తున్న రాజకీయ దళారీల చర్యలను నిరసిస్తూ; ప్రజల ప్రయోజనాలకంటే వినాశకర ప్రభుత్వ విధానాలను అమలుచేయటానికి అత్యుత్సాహం చూపుతున్న జిల్లా పోలీసు, రెవిన్యూ, ఉన్నతాధికార యంత్రాంగం చర్యల్ని ఖండిస్తూ; కోస్టల్ కారిడార్‌ను, 'వాన్‌పిక్'ను తిప్పికొట్టేందుకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ -అధ్యక్ష వర్గం నుండి **కామ్రేడ్ జె.జగన్, వి.వి.రమణయ్య, ఎం.శోభారాణి** ప్రవేశపెట్టిన వివిధ తీర్మానాలను సదస్సు ఆమోదించింది.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ ఎస్.లలితకుమారి అధ్యక్షవర్గం తరఫున సదస్సును ముగిస్తూ, వ్యూహాత్మకంగా, దేశరక్షణపరంగా కీలకమైన తీరం, సామ్రాజ్యవాదుల హస్తగతమవబోతున్న నేపథ్యంలో దేశభక్తియుత, ప్రజాస్వామ్యశక్తులు, వివిధ సెక్షన్ల ప్రజలు, తీరప్రాంత మత్స్యకారులు సమైక్యంగా సంఘటిత పోరాటాలకు నడుం బిగించాల్సిన అవసరముందని, 1986లో ఒరిస్సా తీరంలో బలియాపాల్, అణుక్షిపణి స్థావర నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటం, సాధించిన దేశవ్యాపిత సంఘీభావం ఫలితంగా క్షిపణి స్థావరాన్ని వెనక్కుగొట్టి ఒక మంచి నమూనాను మన ముందుంచారని గుర్తు చేశారు.

కారిడార్ వ్యతిరేక సదస్సు నిర్వహణకు వివిధ రూపాల్లో సహకరించిన వారికి, ఉపన్యాసకులకు, వలంటీర్లకు, కళాకారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కామ్రేడ్ లలిత సదస్సును ముగించారు.

కోస్టల్ కారిడార్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా కళాకారులు రూపొందించి, పాడిన పాటలు, కారిడార్ కల్గించే విధ్వంసాన్ని, ప్రజలపై ప్రభావాన్ని దృశ్యీకరిస్తూ కళాకారులు రూపొందించిన వీధి నాటిక సదస్సుకు హాజరైన ప్రజానీకాన్ని ఆకట్టుకున్నాయి, ఆలోచింపచేశాయి. అనంతరం, గోలి సదాశివరావు కళ్యాణమండపం నుండి చీరాల రైల్వేస్టేషన్ వరకు, కోస్టల్ కారిడార్‌ను వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నినాదాలుచేస్తూ ప్రదర్శన జరిగింది. ఈ సదస్సు సందర్భంగా 'కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ' నుండి తీసుకువచ్చిన బుక్‌లెట్‌ను పట్టణంలోనూ, ప్రదర్శన పొడవునా విస్తృతంగా ప్రజలకందించారు.

సదస్సు ప్రచార కృషి- ప్రజల స్పందన:

కోస్టల్ కారిడార్‌ను వ్యతిరేకిస్తూ చీరాల కేంద్రంగా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రధానంగా కారిడార్ పరిధిలోని గ్రామాల్లో, పట్టపు పాలాల్లో 15 రోజులుగా 25 వేల కరపత్రాలు, 3 వేల పోస్టర్లు ద్వారా, దళ ప్రచారం, వీధి నాటికలు, సమావేశాల ద్వారా ప్రచార కృషి విస్తృతంగా సాగింది.

ప్రకాశంజిల్లాలోని ఒంగోలు, వేటపాలెం, చినగంజాం, కొత్తపట్నం, చీరాల, ఎన్.జి.పాడు మండలాల పరిధిలోని గ్రామాల్లోనూ; గుంటూరుజిల్లా బాపట్ల, నిజాంపట్నం, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, రేపల్లె మండలాల పరిధిలోని మొత్తం 90 పైగా గ్రామాల్లో ప్రజలను కలిసి, కారిడార్ వలన ఏర్పడే దుష్ఫలితాలను వివరిస్తూ సదస్సు గురించి ప్రచారం చేశారు. కృష్ణా, నెల్లూరుజిల్లాలలో కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారం జరిగింది.

ఈ ప్రచార సందర్భంగా ప్రజలు తమ మనోభావాలను ఈ విధంగా వ్యక్తం చేశారు:

రైతులకు వారసత్వంగా భూములు వచ్చినట్లే, మా తాతల తండ్రుల నుండి వారసత్వంగా మాకు ఈ సముద్రమే వచ్చిందని, ఇదే తమకు జీవనాధారమని దీన్ని వదిలే సమస్యే లేదని తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు చెప్పారు. ఇక్కడ నుండి ఏ ప్రాంతానికి వెళ్ళినా తమ బతుకులు దుర్భరమౌతాయని అందువలన ప్రభుత్వం ఎంతటి నిర్బంధం ప్రయోగించినా, ఇక్కడే నిలబడి పోరాడుతామని, పోరాడి ప్రాణాలైనా వదులుతాము తప్పితే తీరాన్ని వదిలివెళ్ళేది లేదని తెగేసి చెప్పారు. 'మా మత్స్యకారుల కుటుంబాల్లో చదువుకున్నోళ్ళు చాలా తక్కువ. ఆ చదువుకున్న ఒకరిద్దరికే ఉద్యోగాలు లేక వారసత్వంగా అబ్బిన వేట వృత్తినే నమ్ముకుని కుటుంబాల్ని పోషించుకుంటున్నారు. డిగ్రీలు చదివిన వారికే ఉద్యోగాలు లేకుంటే రేపు ఇంత మందికీ ఉద్యోగాలు కల్పించటం అసంభవం, అబద్ధమని' తమ జీవితానుభవాల నుండి మరికొందరు వ్యాఖ్యానించారు.

(తరువాయి 14వ పేజీలో)

గుడ్డీగ

- మల్లికార్జున పిల్లి

మంచోడి బుద్ధి మాంసంకాడ బయటపడ్డట్టు
బుద్ధదేవ్ ఎవరి పక్షమో నందిగ్రామ్‌లో తెలిసిపోయింది
నీరు పల్లానికే ప్రవహించినట్టు
పాలక కమ్యూనిస్టు పార్టీ
టాటాలు, సలీంల వైపుకు పరుగెత్తుతున్నాయి
పోరాడితే పోయేదేమిలేదని చెప్పేవాళ్ళు
పోరాడే ప్రజల్ని
పిట్టల్లా కాల్చి చంపుతున్నారు
నీడనివ్వాల్సిన చెట్టు నిప్పులు కురిపించిందిక్కడ
కట్టుకున్న చీరే కామంతో శీలం దోచిందిక్కడ
కాపాడాల్సిన కమ్యూనిస్టే కసాయిగా మారి
మరతుపాకులెత్తి మట్టిమనుషుల మానప్రాణాలు తీశాడిక్కడ
దేవాలయాల మెట్ల వద్ద
మంచినీళ్ళ బావుల దగ్గర
సవర్ణులు దళితుల్ని తరిమికొట్టినట్టు
పచ్చటి పంట పొలాల్లో
పారిశ్రామిక పెంటదిబ్బల్ని వొద్దన్నందుకు
మనిషి వాసన తగిలితేనే బుసలు కొట్టే క్రూర జంతువులా
పీడితులపై బుల్లెట్ల వర్షం కురిపించాడు అభినవ దయ్యరిస్టు
శ్రమైక జీవన సౌందర్యానికి
పట్టాభిషేకం చేయాల్సినవాడు
శ్రమజీవుల పొట్టలుగొట్టి
బూర్జువాలకు పట్టం గడుతున్నాడు
ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన కార్మికరాజ్యం
తలుపులు బార్లా తెరిచి పెట్టుబడిదారులకు స్వాగతం
పలుకుతోంది
రైతుకూలీలు జిందాబాద్
రైతురాజ్యం సాధిస్తామ్ అని నినదించే వామపక్షీయులు
లాఠీలై, తూటాలై
ప్రజాపోరాటాల్ని నెత్తుటేరుల్లో ముంచెత్తుతున్నారు.
పేదలకు భూముల్ని పంచాలంటు
దున్నేవాడికే భూమి దక్కాలంటు
వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలంటు
రైతుసంఘాలై వ్యవసాయకార్మిక మహాసభలై
భూమికోసం, భుక్తికోసం ఈ దేశ విముక్తికోసం
పోరు చేసే కమ్యూనిస్టు పార్టీ
పంటభూముల్లో రసాయనిక పరిశ్రమలు ఎందుకన్న నేరానికి
పచ్చటి నేలంతా నెత్తుటిమయం చేసింది
ఇల్లలికి ముగ్గు పెట్టుకొని
తనపేరు తనే మర్చిపోయిన గుడ్డీగలా
వర్గాన్ని, వర్గపోరాటాల్ని మరిచిపోయారు
"భారతీయ కమ్యూనిస్టులు"
అధికారపు మత్తులో కూరుకుపోయి
ప్రజల్ని మరిచిన
ప్రభుత్వ కమ్యూనిస్టులారా!
నందిగ్రామ్‌లో ఉవ్వెత్తున లేచిన నెత్తుటి కెరటం
అణగారిన ప్రజల గుండెల్లో రగిలే తుపానుకు సూచన.
ఇక మీ పతనం తప్పదు.

KLUA 102M241

Janasakti (Communist Revolutionaries'Fortnightly) Printed Matter Book-Post RNI No.8315/63 H/VJ-077/2007-09

అభివృద్ధి పేరిట సర్వవిధ్వంసం గావించే సామ్రాజ్యవాదుల, దళారీ పాలకుల 'కోస్టల్ కారిడార్'ని ప్రతిఘటించుదాం!

కోస్టల్ కారిడార్ వ్యతిరేక సదస్సులో వక్తల ఉద్ఘాటన

ప్రసంగిస్తున్న బొజ్జా తారకం, వేదికపై జి.విజయకుమార్ తదితరులు....

కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో, **30.8.'08 ఉదయం 11** గంటలకు చీరాల-పేరాల, **గోలి** సదాశివరావు కళ్యాణమండపంలో 'కోస్టల్ కారిడార్ వ్యతిరేక సదస్సు' జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షవర్గంగా -సి.పి.ఐ. (ఎం.ఎల్) గుంటూరు, ప్రకాశంజిల్లాల సీనియర్ నాయకులు కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, పింజల వెంకటసుబ్బారావు; రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) నాయకులు కామ్రేడ్స్ ఎస్.లలితకుమారి, జె.జగన్, ఎం.శోభారాణి, వి.వి.రమణయ్య వ్యవహరించారు.

'అంతిమ విజయం ప్రజలదే'.

కారిడార్ వ్యతిరేక సదస్సుకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన హైకోర్టు సీనియర్ న్యాయవాది, భారత రిపబ్లికన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, ప్రజాఫ్రంట్ కన్వీనర్ బొజ్జా తారకం మాట్లాడుతూ శ్రీకాకుళంజిల్లా ఇచ్ఛాపురం నుండి నెల్లూరుజిల్లా తడ వరకు ప్రభుత్వం కోస్టల్ కారిడార్‌ను ఏర్పాటు చేయతలపెట్టి, జీ.వో.నెం.34ను విడుదల చేసి, అమలు చేస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు ఈ **ప్రాంతంలో కారుచౌకగా భూములిస్తామని బహుళజాతి పరిశ్రమలను, బడా పెట్టుబడిదార్లను ఆహ్వానిస్తున్నారు. తీరం నుండి భూమివైపుగా 5 కి.మీ. దూరం వరకు, సముద్రంవైపుగా -మొత్తంగా ఈ దళారీ పాలకులు విదేశీ** బహుళజాతి పరిశ్రమలకు కట్టబెడుతున్నారు. ఈ పరిశ్రమలు కారుచౌకగా భూములను, కార్మికుల శ్రమశక్తిని ఉపయోగించుకొని సరుకుల ఉత్పత్తి సాగించి, విదేశాలకు ఎగుమతి చేసి పెద్ద ఎత్తున లాభాలను పోగేసుకుంటాయి. ఈ పరిశ్రమల ప్రయోజనాలకోసం మనం, మన ప్రజల జీవనాన్ని, ఉపాధిని, ఆరోగ్యాన్నీ కోల్పోతున్నాం. ఇనుము, అభ్రకం, రాగి మొదలగు ఖనిజసంపదను; చేపలు, రొయ్యలు తదితర సముద్ర సంపదను; అత్యంత విలువైన అటవీ సంపదను **కొల్లగొట్టుకొని దోచుకెళ్ళటం కోసమే ఈ తీరప్రాంతంలో ఓడరేవుల నిర్మాణం చేపడుతున్నారు.**

మన భూములను కాజేసి, లక్ష, రెండు లక్షలు ఇస్తామని ప్రలోభ పెడుతున్నారు. ఈ డబ్బు మనకెందుకూ కొరగాదు. ఈ విధంగా భూములిచ్చి వెళ్ళినవారి కఠోర జీవన వాస్తవం మన కళ్ళముందుంది.

ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలను కల్పిస్తామని గద్దెనెక్కిన పాలకులు చేయవలసింది ఇదేనా?! అందుకే, ఈ దేశంలో సర్వ, సహజ సంపదలు ఈ దేశంలో ప్రజలకు దక్కాలని పోరాడాలి. రాజ్యాంగం నిర్దేశించిన ఈ కర్తవ్యాన్ని ప్రక్కనబెట్టి పాలకులందరూ ఆఖరుకు పశ్చిమబెంగాల్ వామపక్ష ప్రభుత్వంతో సహా- మన భూములను, సంపదలను, సముద్రాన్ని విదేశీ పరిశ్రమలకు అమ్మివేయటం ద్వారా మన దేశ ప్రజల జీవితాన్ని నాశనం చేస్తున్నాయి.

1947కు పూర్వం, స్థానిక రాజులు ఈస్టిండియా కంపెనీకి మనదేశంలోని భూభాగాలన్నింటినీ క్రమంగా ధారాదత్తం చేసి, చివరికి ఈస్టిండియా కంపెనీనే భారత దేశాన్ని పాలించే స్థితికి తీసుకువచ్చారు. ప్రస్తుత పాలకులు కూడా, ఈనాడు మరోసారి దేశాన్ని బహుళజాతి సంస్థల పాదాక్రాంతం చేస్తున్నారనే విషయాన్ని గుర్తెరిగి త్రిప్పికొట్టాలి.

ఈ బహుళజాతి, బడా కంపెనీలు ప్రజల భూములను, ఇళ్ళనేకాదు; ప్రభుత్వ ఉన్నతాధికారులను, పోలీసు ఉన్నతాధికారులను, రాజకీయ దళారులను, ఛోటా, మోటా నాయకులను, పెత్తందార్లను కూడా కొనుగోలు చేస్తున్నారు. అందుకే వీరు అత్యుత్సాహంగా ప్రజల్ని బెదిరింపులుచేసి, భూములను నయానో, భయానో్న కాజేసేందుకు వివిధ రకాలుగా ప్రయత్నిస్తున్నారు.

ఆఫ్రికా ఖండంలోని సెనెగల్ ఒక చిన్నదేశం. ఆ దేశంలో నూటికి 70 మంది మూడుపూటలా చేపలనే ఆహారంగా తిని బతుకుతారు. బహుళజాతి కంపెనీలు అక్కడ తిష్టవేసిన తర్వాత, అక్కడి ప్రజలకు కనీసంగా పూట గడవని దుస్థితి దాపురించింది. సముద్రతీరం బహుళజాతి సంస్థల చేతుల్లోకిపోయాక, మనదేశంలోని మత్స్యకారుల పరిస్థితీ అదే! మన భావితరాల బాగు కోసమైతే మనం భూములు కోల్పోయినా అర్థముంటుంది. కానీ, బహుళజాతి కంపెనీల సూపర్ లాభాల కోసం మనం బలికావాలా? మన పిల్లలు, **భావితరాలు మరింత దుర్భరస్థితిని** అనుభవించాల్సిన **పరిస్థితిలో ఈ వినాశకర కోస్టల్** కారిడార్ నిర్మాణాన్ని **తీవ్రంగా ప్రతిఘటించాలి.** ప్రజలు సంఘటితంగా ఉన్న చోట, నందిగ్రామ్‌లో ప్రజలు పోలీసు కాల్పులను ఎదుర్కొని, బలిదానం కావించి తమ భూములను నిలుపుకున్నారు. సింగూరులో తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. బాక్సైట్‌ను విదేశాలకు ఎగుమతి చేసుకొని లాభాలు గడించేందుకుగాను, విశాఖజిల్లా చింతపల్లి బాక్సైట్ నిక్షేపాలను జిందాల్ కంపెనీ తవ్వి తరలించుకెళ్తున్నది. అక్కడి **ప్రజానీకం దీన్ని నిరసిస్తూ తీవ్రంగా ప్రతిఘటించి** పోరాడుతున్నారు.

పురాణాల్లో హిరణ్యాక్షుడు భూమి చాపలా చుట్టాడంటే నమ్మలేదు. కానీ, ఈ అమెరికన్ అగ్రరాజ్య సామ్రాజ్యవాదం నేడు భూమిని మొత్తం చాపలా చుట్టటాన్ని చూస్తున్నాం. ఈ మట్టిమీద నిలచి, బతకవలసిన అవసరం మనకు వుంది. అవసరమైతే ప్రాణాలు కోల్పోవటానికైనా సిద్ధమై, తెగించి పోరాడితే విజయం మనదే. చరిత్రలో అంతిమ విజయం ప్రజలదే. మనమొక ఆదర్శవంతమైన పోరాట కృషిని సాగించాలి'. ఈ విధంగా సాగించే ఉద్యమానికి వ్యక్తిగా, న్యాయవాదిగా, ప్రజాఫ్రంట్ కన్వీనరుగా ఎల్లవేళలా, అండదండగా వుంటామని ప్రకటిస్తూ బొజ్జా తారకం తన ఉద్వేగపూరిత ఉపన్యాసాన్ని ముగించారు.

'స్వతంత్రం కాదిది, సామ్రాజ్యవాదుల స్వాహాతంత్రం'

కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ కన్వీనర్, సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ కోస్టల్ కారిడార్ ఏర్పాటు ప్రకటనతోనే గుంటూరుజిల్లా నిజాంపట్నంవాసి, మంత్రి, మోపిదేవి వెంకటరమణ; ప్రకాశంజిల్లా మంత్రి కొణిజేటి రోశయ్య, వారి హంగుదారులు లక్షా 20 వేల ఎకరాల భూముల సేకరణకు ఉత్సాహంగా ముందుకొచ్చారుకానీ, ప్రజలు తీవ్ర నిరసన, ఆందోళన వ్యక్తం చేస్తున్న కారణంగా సాధ్యం కాలేదన్నారు.

'చంద్రబాబు విజన్-2020కి వ్యతిరేకంగా ఆనాడు మాతో గొంతుకలిపి చాలా తీవ్రంగా మాట్లాడినవారు, అధికారంలోకి వచ్చాక, అదే 'విజన్'ను మరింత 'సమర్థవంతంగా' అమలుచేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. నిజాంపట్నం-ఓడరేవు తీరప్రాంతాన్ని, వాన్‌పిక్ పేరిట, రస్-అల్-ఖైమా, మ్యాట్రిక్స్ వంటి సంస్థల ద్వారా అమెరికాకు ధారాదత్తం చేయబూనుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని సింగూరులో భూసేకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ప్రియరంజన్‌దాస్ మున్షి ఆందోళనలో పాల్గొంటున్నారు. మన రాష్ట్రంలో మాత్రం నిర్బంధంగా రైతుల భూములు లాగివేసుకుంటున్నారు. ఇది భారత పాలకుల ద్వంద్వ విధానాలను తెలియపరుస్తున్నది.

భారత పాలకుల ఈ విధానాలకు భూమిక 1947 'అధికార మార్పిడి'లోనే వుంది. దేశవ్యాపితంగా 8 వేల కిలో మీటర్ల తీరం కలిగిన భారతదేశం తీర ప్రాంతాన్ని ముక్కలు ముక్కలుగా విభజించి విదేశీ సామ్రాజ్యవాదులకు అప్పగించేందుకు ఒప్పందాలు జరిగి అమలుకోసం, అదునుకోసం ఎదురు చూస్తున్నారు. ఈ విధానాల్లో భాగంగా ముందుకొచ్చిందే ఈ 'కోస్తా కారిడార్', 'వాన్‌పిక్'!

ప్రపంచబ్యాంకుకు, సామ్రాజ్యవాదానికి, భారత **దళారీ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. కోస్తా కారిడార్ వ్యతిరేక ఉద్యమంలోకి** ప్రజానీకాన్ని విస్తృతంగా సమీకరించాలి. ఆందోళనను తీవ్రతరం చేయాలి. అందుకు మేము ముందుంటామని' తెలియజేస్తూ కామ్రేడ్ గుర్రం విజయకుమార్ తన ఉపన్యాసం ముగించారు.

'కారిడార్ సమస్య...దేశభద్రత సమస్య'

సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ వై.యస్.రాజశేఖరరెడ్డి ఒకవైపున బియ్యం ధరను మార్కెట్‌లో కిలో 30 రూ.కు పెంచివేసి, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ, మరోవైపున 2 రూ.కు కిలో బియ్యం వంటి పథకాలను ప్రవేశపెడ్తూ ప్రజలను దగా చేస్తున్నదన్నారు. టన్ను ఇనుము ధరను 60 వేల రూపాయలకు పెంచివేసి, బస్తా సిమెంట్‌ను 300 రూపాయలకు పెంచివేసి, మధ్యతరగతికి సైతం ఇంటి నిర్మాణాన్ని కలగా మిగిల్చివేసి మరోవైపున 'ఇందిరమ్మ గృహాలు, రాజీవ్ గృహకల్ప'ల ద్వారా ఇళ్ళు నిర్మించి పెడతామని ప్రజల్ని మోసం చేస్తున్నదని, ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు.

'2005లో కేంద్రం ఆమోదించిన ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం' ద్వారా రాష్ట్రంలో 70కి పైగా సెజ్‌లను నెలకొల్పటానికి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. లక్షలాది ఎకరాల భూములను రైతుల నుండి స్వాధీనం చేసుకుని వారిని నిర్వాసితుల్ని చేసే క్రమం మొదలైంది. మన రాష్ట్రంలో విదేశీ భూభాగాలైన సెజ్‌లను పెంచుకుంటూ పోతున్నది. ఈ సెజ్‌ల ద్వారా, కారిడార్‌ల ద్వారా వస్తున్న బహుళజాతి పరిశ్రమల నీటి అవసరాల కోసమే జలయజ్ఞం పేరిట పెద్దఎత్తున ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నదని, ఇది రైతాంగ సాగునీటి అవసరాలకోసం కాదని ఆనాడే మేము ప్రకటించాము. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా, భూసేకరణకు వ్యతిరేకంగా గిరిజన, గిరిజనేతర పేదలతో కలిసి ఆందోళనోద్యమాలు నిర్మిస్తున్నాము. బహుళజాతి పరిశ్రమల అవసరాలకోసమే ప్రధానంగా ఈ నీటి ప్రాజెక్టులు ఉన్నాయని కోస్తా కారిడార్ ప్రకటన ద్వారా ప్రజలందరికీ తేటతెల్లమైంది.

వేలాది ఎకరాల గిరిజన ప్రజల భూములను హొూతా శ్రీరామచంద్రమూర్తి అనే మాజీ జమీందారు ఆక్రమిస్తే, ఆ భూములు తమకు దక్కాలని గిరిజనులు ఏనాటి నుండో ఆందోళన చేస్తుంటే, వారిది న్యాయమైన పోరాటమని అంటూనే, వారి డిమాండ్లను అమలుచేయని ప్రభుత్వం, హొూతా శ్రీరామచంద్రమూర్తి నుండి ఆ గిరిజనుల భూముల్ని **తీసుకొంటూ 2 కోట్ల** నష్ట పరిహారాన్ని అతనికివ్వటానికి పూనుకుంది. దీనికి వ్యతిరేకంగా గిరిజనులను కదిలించి అడ్డుకున్నాం. ఈ క్రమంలో అనేక నిర్బంధాల్ని ఎదుర్కొన్నాం. ఇప్పటికీ గిరిజన సంఘ నాయకులు నలుగురుపై 'రాజద్రోహ నేరం' మోపబడి రాజమండ్రి సెంట్రల్ జైల్లో మగ్గుతున్నారు.

విశాఖపట్నం ప్రక్కనే గంగవరం పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమం సాగింది. నూకరాజు అనే మత్స్యకార్మికుడిని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బలిగొన్నది.

కాకినాడ తీరంలో 'పారిశ్రామిక కారిడార్'కు వ్యతిరేకంగా ఆందోళనోద్యమం సాగుతున్నది.

ప్రస్తుతం విశాఖ సముద్రంలోని యారాడకొండ (డాల్ఫిన్స్ నోస్)ను బహుళజాతి పరిశ్రమలకు కట్టబెడ్తున్నారు. ముస్లిం సంస్థలకు చెందిన ప్రజానీకం దీనికి వ్యతిరేకంగా ఆందోళన సాగిస్తున్నారు. మనదేశానికి రక్షణ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కోస్తా కారిడార్ సమస్య-కోస్తా ప్రాంతానికే పరిమితమైంది కాదు. ఇది మొత్తం దేశ ప్రజలకు సంబంధించిన సమస్య. దేశ భద్రతకు సంబంధించిన సమస్య.

సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు దళారులుగా వ్యవహరిస్తున్న ఈ దేశ పాలకులకు, మన ప్రజల బాధ్యత పట్టలేదు. మన భూములపై నిలబడి ఈ భూములు, సర్వసంపదలు మావి అని పోరాటం సాగిస్తే ఎవ్వరైనా తలొగ్గక తప్పదని ప్రకటిస్తూ ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళి కోస్తా కారిడార్‌ను త్రిప్పికొడ్తారనే ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ కామ్రేడ్ ఝాన్సీ తన ప్రసంగాన్ని ముగించారు.

'సహజ సంపదలు సర్వస్వం- సామ్రాజ్యవాదులకు సమర్పణం'

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ **జె.కిషోర్‌బాబు** మాట్లాడుతూ, కోస్టల్ కారిడార్ ప్రకటనకు పది సంవత్సరాల ముందే, తీరప్రాంతంలో పర్యావరణానికి హాని కల్గిస్తున్నదనే పేరిట రొయ్యల సాగును నిషేధిస్తూ 'కోస్టల్ రెగ్యులేటరీ జోన్'ను ఏర్పరిచారని, ఈ రోజున అదే తీరంలో అత్యంత ప్రమాదకర రసాయన, పెట్రో రసాయన కర్మాగారాలను నెలకొల్పేందుకు సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసేందుకు పాలకులు సిద్ధమయ్యారని అన్నారు.

'సెజ్‌లకు వ్యతిరేకంగా 2005లోనే రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) మొట్టమొదటగా స్పందించి ఒక బుక్‌లెట్‌ను ప్రచురించి, విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రచార ఆందోళనా కార్యక్రమాలను చేపట్టింది.

సెజ్‌ల పేరిట నెల్లూరుజిల్లాలో 13 విదేశీ పరిశ్రమలు రంగంలోకి వచ్చాయి. 13 వేల ఎకరాల భూములను రైతులనుంచి ఇప్పటికే గుంజుకున్నారు. క్రిష్ణపట్నం ఓడరేవును యుద్ధప్రాతిపదికన నిర్మించారు. దాని చుట్టూ 5 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాలు పెడ్తున్నారు. నెల్లూరు సాధారణ ఉష్ణోగ్రత 5-6 డిగ్రీలు పెరిగే అవకాశముంది.

అనంతపురంజిల్లా ఓబులాపురం మైన్స్‌ను వై.యస్. జగన్, గాలి జనార్థనరెడ్డి లీజుకు తీసుకొని ఇనుప ఖనిజాన్ని పెద్దఎత్తున క్రిష్ణపట్నం ఓడరేవు ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. బళ్ళారి, హొస్పేట నుండి ఇనుప ఖనిజాన్ని చెన్నైకి ఈ ఓడరేవు ద్వారా తరలిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు సీనరేజి 130 రూ.ను ప్రజల నుండి ప్రభుత్వం వసూలు చేస్తుండగా, అత్యంత విలువైన ఇనుప ఖనిజానికి, గాలి జనార్థనరెడ్డి, జగన్‌ల నుండి టన్నుకు 11 రూ. నుండి 27 రూ. మాత్రమే ప్రభుత్వం వసూలు చేస్తున్నది. కాగా, వీరు విదేశీ కంపెనీలకు ఇదే ఇనుప ఖనిజాన్ని టన్ను 5 వేల రూపాయల చొప్పున అమ్ముకుంటూ రోజుకు పదికోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నారు. రోజుకు 1100 లారీలు వీరివే, విపరీతమైన వేగంతో గనుల నుండి ఇనుప ఖనిజాన్ని కృష్ణపట్నం పోర్టుకు చేరవేస్తుంటాయి. ఈ వేగంతో, రద్దీతో నెల్లూరుజిల్లాలో ఇనుప ఖనిజ లారీల క్రిందపడి

(తరువాయి 15వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet, Vijayawada-2.
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M241
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	17
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Priyanka
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	APSA
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good